ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-1-2025 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 349 పేజీలు: 10+4 వెల: 6.50

పెన్, పేపర్ విధానంలోనే నీట్ పరీక్ష: ఎన్‌టిఎ 2
ఉపగ్రహాల అనుసంధానం సక్సెస్.. శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్‌కు కేంద్రం ఆమోదం 7

# 8వ వేజ్‌బోర్డుకు కేంద్రం పచ్చజెండా



## త్వరలో చైర్మన్ నియామకం
## కేబినెట్ నిర్ణయం
## ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు భారీగా పెరిగే అవకాశం

**న్యూఢిల్లీ, జనవరి 16:** బడ్జెట్‌కు ముందే కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎగిరి గంతేసే న్యూస్ చెప్పింది. గురువారం జరిగిన కేంద్రమంత్రివర్గ భేటీలో 8వ వేతన సంఘం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్ల కరవు భత్యం 53 శాతానికి పెరిగిన తరుణంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. 8వ వేతన సంఘం ఎప్పుడు వేస్తారా.. అని కేంద్రం ఉద్యోగులు, పెన్షనర్లు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు దీనిపై మోడీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త వేతన సంఘం అమలుకు సంబంధించి పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినప్పుడల్లా ప్రభుత్వం అలాంటి ప్రతిపాదనలేమీ లేవని చెబుతూ వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు హఠాత్తుగా 8వ వేత న సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. గురువారం ప్రధాని నరేంద్రమోడీ

>>2



# భారీ ఎన్‌కౌంటర్

## 19 మంది మృతి
## మృతుల్లో పలువురు మావోయిస్టు అగ్రనేతలు!

**చర్ల, జనవరి16, ప్రభాతవార్త:** తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా పూజరికాంకేర్ అటవీ ప్రాంతంలో గురువారం మావోయిస్టులకు భద్రతా బలగాల మధ్య హోరాహోరీ ఎదరు కాల్పులు జరిగాయి.ఈ ఎదురుకాల్పుల్లో 19 మంది మావోయిస్టులు మృతిచెందారు. తెలంగాణ సరిహద్దుకు కూతవేటు దూరంలో ఉన్న పూజరి కాంకేర్

>>2

# 'కృష్ణా' వివాదం కొలిక్కి?

## జలాలలో తెలంగాణ హక్కు సాధనకు మార్గం సుగమం
## 555 టిఎంసిల నీటి వాటా సాధనలో విఫలమైన కెసిఆర్
## న్యూఢిల్లీలో రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




గురువారం న్యూఢిల్లీలో కృష్ణా వాటర్ ట్రిబ్యునల్ కార్యాలయం వద్ద మంత్రి ఉత్తమ్, న్యాయవాదులు

**హైదరాబాద్,జనవరి 16,ప్రభాతవార్త:** తెలంగాణ,ఏపీ రాష్ట్రాలమధ్య నీటి కేటాయింపుల వ్యవహారాన్ని అంతర్రాష్ట్ర జలవివాదాలచట్టం సెక్షన్3 కింద ఇచ్చిన కొత్తనిబంధనల ఆధారంగా వాదనలు జరగాలని కెడబ్ల్యుడిటి2 గురువారం ఒక ఉత్తర్వులో పేర్కొనడం తెలంగాణకుభారీ విజయంఅనీ నీటిపారుదల శాఖ పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అంతరాష్ట్ర నదీ జలాల వివాదాలచట్టం 1956 అనుసరణకు కెడబ్ల్యుడిటి-2లో తెలంగాణ పట్టుబట్టి సమర్థవంతంగా వాదనలు చేసిందనీ ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన కారణం కృష్ణా,

>>2



# సిఎం రేవంత్ విదేశ యాత్ర

## వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 16:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బృందం గురువారం రాత్రి విదేశీ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. ఐటీ

>>2

# కెటిఆర్ సుదీర్ఘ విచారణ

## ఏడు గంటలపాటు ప్రశ్నించిన ఇడి
## విదేశీ కంపెనీకి నిధుల బదలాయింపుపైనే ప్రశ్నల వర్షం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి16:** ఫార్ములా ఈ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారాక రామారావు ఈడీ(డైరెక్టరేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్) విచారణ గురువారం జరిగింది. సుమారు 7గంటల పాటు ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఉదయం 10.40 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం 5.45 గంటలకు ముగిసింది. ఉదయం ఈడీ కార్యాలయంలోకి చేరుకున్న కేటీఆర్‌ని విచారణ బృందం సుదీర్ఘంగా ప్రశ్నించింది. ఆర్బిఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధుల చెల్లింపు పై ఈడి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే విచారణలో కేటీఆర్‌ను ప్రధానంగా నగదు బదిలీ చుట్టూ ప్రశ్నలు సంధించారని తెలుస్తోంది. హెచ్ఎండిఏ ఖాతా నుంచి విదేశీ కంపెనీకి నిధుల బదలాయింపు, నిధుల బదలాయింపులో ఫెమా నిబంధనల ఉల్లంఘనపై ఈడీ



ఇడి కార్యాలయం వద్ద మీడియాతో కెటిఆర్

>>2

లైవ్‌లో లైడిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం.. రేవంత్ సిద్ధమా?: కెటిఆర్ 2



కాల్పుల ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

# అఫ్జల్‌గంజ్‌లో కాల్పుల కలకలం

## బీదర్ ముఠా అరాచకం
## ఒకరి అరెస్టు, తప్పించుకున్న మిగతా ఇద్దరు

**అఫ్జల్‌గంజ్,జనవరి 16ప్రభాతవార్త:** ఉదయం బీదర్‌లో ఎటిఎంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన సిబ్బందిపై కాల్పులు జరిపి 93లక్షలు ఉన్న నగదుతో బీదర్ దొంగలు సాయంత్రం హైదరాబాద్‌లో కలకలం సృష్టించారు. దొంగలను వెతుక్కుంటూ వచ్చిన బీదర్ పోలీసులపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, ముఠాలో ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం సాయంత్రం అఫ్జల్‌గంజ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. నిందితులు ముగ్గురు రాయ్‌పూర్ వెళ్లేందుకు టికెట్ బుక్ తీసుకున్నారు. సాయంత్రం బస్‌కోసం వేచి చూస్తున్న సమయంలో పోలీసులు రావడంతో వారిపై ఫైరింగ్ జరిపారు. ముఠా జరిపిన కాల్పుల్లో ట్రావెల్స్ మేనేజర్ కడుపులోకి బుల్లెట్ దూసుకెళ్లింది. మరో వ్యక్తికి బుల్లెట్ తగలడంతో గాయాలయ్యాయి. జహంగీర్‌ను అక్కడే సమీపంలో ఉన్న ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తుపాకులతో కాల్పులు జరిపిన

>>2



# సిఎం రేవంత్ విదేశ యాత్ర

>> పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి వెంట ఈ పర్యటనలో ఉంటారు. ఢిల్లీ నుంచి గురువారం రాత్రి 10 గంటలకు బయల్దేరారు. ముఖ్యమంత్రి ముందుగా సింగపూర్‌కు చేరుకుంటారు. 17న తెల్లవారు జామున అక్కడికి చేరుకుంటారు. 17, 18, 19 తేదీల్లో సింగపూర్‌లో మూడు రోజులు పర్యటిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతారు. ఈ సందర్భంగా ప్రపంచంలో పేరొందిన సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ని సందర్శిస్తారు. నైపుణ్య అభివృద్ధికి ఆ యూనివర్సిటీ ఎంచుకున్న కోర్సులు, అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకారం అందించేందుకు సింగపూర్ ఐటీఈతో ఒప్పందం చేసుకుంటారు. సింగపూర్‌లో రివర్ ఫ్రంట్ ను సందర్శిస్తారు. ప్రపంచ స్థాయిలో మూసీ పునరుజ్జీవనం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నందున అక్కడి రివర్ ఫ్రంట్ ఏరియా అభివృద్ధి చేసిన తీరుతెన్నులను పరిశీలిస్తారు. సింగపూర్ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి బృందం 20వ తేదీ ఉదయం దావోస్‌కు చేరుకుంటుంది. 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు 2025లో పాల్గొంటారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించిన పెట్టుబడుల లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇటీవలే అధికారులతో సమీక్షలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, మాన్యుఫాక్చరింగ్ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలతో పాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ) పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. హైదరాబాద్ లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, వరల్డ్ క్లాస్ సిటీగా గ్రేటర్ సిటిలో ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లు, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా అందరినీ ఆకర్షిస్తున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి తొలి ఏడాదిలో చేపట్టిన విదేశీ పర్యటనలన్నీ విజయవంతమయ్యాయి. గత ఏడాది దావోస్ పర్యటనతో పాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. దేశంలో అద్భుతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న తెలంగాణకు భారీగా పెట్టుబడులు సమీకరించే లక్ష్యంతో సీఎం నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం ఈ విదేశీ పర్యటనకు బయల్దేరింది.

## ఔరంగాబాద్ రోడ్డు ప్రమాదంలో కొండగడపకి చెందిన నలుగురు మృతి గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు

**మోత్కూర్, జనవరి 16, ప్రభాతవార్త:** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామం ఒకే కుటుంబానికి చెందిన ఔరంగాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండగడపకు చెందిన కృష్ణమూర్తి కుటుంబం కూతురి కొడుకు పుట్టి వెంట్రుకలు తీయడానికి బస్సు పై షిర్డీకి సోమవారం వెళ్లారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇతర పుణ్య క్షేత్రాలను దర్శించుకోవడం కోసం తుఫాన్ వాహనాన్ని తీసుకొని వెళ్తున్న క్రమంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగి శ్యాం శెట్టి కృష్ణమూర్తి కుటుంబానికి చెందిన భార్య ప్రేమలత వయసు (55) ప్రేమలత కూతురు ప్రసన్న లక్ష్మి (40) ప్రేమలత మనవరాలు అక్షిత(22) మనమడు వైదిత (ఆరు నెలలు) ప్రమాదంలో మరణించారు. ఇంటి యజమాని శ్యామ్‌శెట్టి కృష్ణమూర్తి తీవ్ర గాయాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. ఒకే గ్రామం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించడంతో కొండగడప గ్రామంలో విషాద ఛాయలు అలుముకొని బంధువులు గ్రామస్తులు కన్నీరు మున్నీరవుతున్నారు.

# పెన్, పేపర్ విధానంలోనే నీట్ పరీక్ష

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్‌ఎంట్రన్స్ టెస్ట్(నీట్)ను పెన్, పేపర్ విధానంలోనే కొనసాగించనున్నారు. నీట్ యూజీ పరీక్షల నిర్వహణ విధానంపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎంబీబీఎస్‌తో పాటు బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ యూజీ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తోంది. 2019నుంచి నీట్ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తోంది. నీట్ యూజీ పరీక్షను ఓఎంఆర్ విధానం (పెన్, పేపర్ పద్ధతి)లోనే నిర్వహిస్తామని వెల్లడించింది. ఈ ఏడాది ఒకే రోజులో, ఒకే షిఫ్టులో నీట్ పరీక్ష జరుగుతుందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) గురువారం స్పష్టం చేసింది. నీట్ ప్రశ్నాపత్రం గతేడాది లీకైన నేపథ్యంలో.. నీట్ యూజీ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలా? పెన్, పేపర్ పద్ధతిలో నిర్వహించాలా? అనే దానిపై కేంద్ర విద్యాశాఖ, ఆరోగ్యశాఖ సమగ్రంగా చర్చించుకున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఆ తర్వాతే నీట్ యూజీ పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. జాతీయ మెడికల్ కమిషన్ తీసుకున్న నిర్ణయం ప్రకారం, నీట్‌యూజీ పరీక్షను పెన్, పేపర్ పద్ధతిలోనే ఈసారి నిర్వస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది.



బీదర్ దొంగలు కాల్పులు జరిపిన రోషన్ ట్రావెల్స్


గాయపడిన మేనేజర్ జహంగీర్

# అఫ్జల్‌గంజ్‌లో కాల్పుల కలకలం

>> సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఈసంఘటన అఫ్జల్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, ట్రావెల్స్ యాజమానుల కథనం ప్రకారం. బీదర్ ఎటిఎంలో డబ్బులు జమ చేస్తున్న వ్యక్తులపై కాల్పులు జరిపి సుమారుగా 93లక్షల నగదును దొచుకువెళ్లినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఆదొంగలు దొచుకున్న డబ్బులను తీసుకుని నగరంలోని అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో ఉన్న రోషన్ ట్రావెల్స్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి చతీష్‌ఘడ్‌కు వెళ్లేందుకుగాను బస్సు టిక్కెట్ బుక్ చేసుకున్నారు. రోషన్ ట్రావెల్స్ మేనేజర్‌గా కొనసాగుతున్న జహంగీర్(40)వారిని బస్సు టిక్కెట్ డబ్బులను అడిగాడు. ఆ దొంగలు వెంట తెచ్చుకున్న డబ్బుల సంచుల నుంచి డబ్బులకు బదులుగా తమ వెంట తెచ్చుకున్న తుపాకులతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయారు. ఈ సంఘటన తెలుసుకున్న సుల్తాన్‌బజార్ ఎసిపి శంకర్, ఇన్‌స్పెక్టర్లు రవి తమ సిబ్బందితో కాల్పులు జరిపిన రోషన్ ట్రావెల్స్‌కు చేరుకున్నారు. గాయపడిన జహంగీర్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈకాల్పులు జరిపిన వారు బీదర్ దొంగల ముఠాగా పోలీసులు తేల్చారు. వెంటనే క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. క్లూస్ టీమ్ బృందం కాల్పులు జరిపిన బులెట్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు కూడా రంగంలోకి దిగి దొంగల ముఠా కోసం హైదరాబాద్ నగరమంతా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**దొంగల ముఠాను పట్టుకునేందుకు నగరం చేరిన బీదర్ పోలీసులు...**

ఎటిఎంలో జమ చేస్తున్న వ్యక్తులపై కాల్పులు జరిపి పెద్ద మొత్తంలో డబ్బులను దొచ్చుకుని నగరానికి వచ్చిన దొంగల ముఠాను పట్టుకునేందుకు వచ్చిన పోలీసులను చూసి దొంగల ముఠా తప్పించుకునేందుకు అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఓ ట్రావెల్స్ కార్యాలయంలోకి ప్రవేశించారు. పోలీసులపై కాల్పులు జరుపుతుండగా అక్కడే ఉన్న ట్రావెల్స్ కార్యాలయం మేనేజర్‌కు బుల్లెట్లు తగిలాయి. దీంతో అతనికి తీవ్ర రక్తస్రావం జరిగింది. అప్రమత్తమైన హైదరాబాద్ పోలీసులు కూడా బీదర్ పోలీసులతోపాటు దొంగలముఠాను పట్టుకునేందుకు గాలిస్తున్నారు. ఇక దొంగలు తెలంగాణ వైపు తమ బైక్‌ను మళ్లించినట్లు బీదర్ పోలీసులు నిర్ధారించుకున్నారు. దీంతో బీదర్ పోలీసులు తారసపడ్డారు. దీంతో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయంలోకి దొంగలు ప్రవేశించి కాల్పులు జరిపారు. మేనేజర్‌కు గాయాలయ్యాయి.

**బీదర్‌లో దొంగల కాల్పులు, ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది మృత్యువాత, రూ.కోటి చోరీ**

**జహీరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** పట్టపగలు, నడి రోడ్డుపై కోర్టుకు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూత వేటు దూరంలో దోపిడి దొంగలు బీభత్సం సృష్టించిన సంఘటన కర్ణాటకలోని బీదర్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. బీదర్ పట్టణంలోని ఎస్‌బిఐ ఏటీఎంలో (శివాజీ చౌక్‌కు దగ్గరలో) డబ్బులు జమ చేసేందుకు వెళుతున్న వాహనాన్ని దోపిడి దొంగలు చాకచక్యంగా అడ్డుకుని (ముందే రెక్కి నిర్వహించి) వాహనానికి కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డులపై 5 రౌండ్ల కాల్పులు జరుపగా ఇద్దరు సెక్యూరిటీ గార్డులు అక్కడికి అక్కడే నిండు ప్రాణాలు కోల్పోగా మరొక్క సెక్యూరిటీ గార్డుకు బెల్లెట్ గాయాలయ్యాయి. ఏటిఎంలో దాచేందుకు వాహనంలో తెచ్చిన నగదుతో ఉన్న పెట్టెను దొంగలు ద్విచక్ర వాహనంపై పెట్టుకుని దర్జాగా అక్కడికి నుంచి ఉడాయించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గాయపడిన సెక్యూరిటీ గార్డును ఆసుపత్రికి తరలించారు రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని చిరాగ్‌పల్లి, హద్నూర్ ఇతర పోలీసు ఠాణాలకు చెందిన పోలీసులు బృంధాలుగా ఏర్పడి దోపిడి దొంగల కొరకు గాలింపును ప్రారంభించారు. అటుగా వచ్చే ప్రతి వాహనాన్ని ఆపి క్షుణంగా పరిశీలిస్తున్నాడు. దొంగలు ఎత్తుకెళ్లిన నగదు పెట్టెలో 1 కోటి రూపాయలు ఉన్నట్టు తెలుస్తోంది.

# లైవ్‌లో లైడిటెక్టర్ పరీక్షకు

# నేను సిద్ధం.. రేవంత్ సిద్ధమా?

## సిఎంపై కేసులు ఉన్నాయి కాబట్టే నాపై కేసులు నమోదు

## రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సవాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి16:** రేవంత్ రెడ్డిపై ఏసీబీ, ఈడీ కేసులు ఉన్నాయని చెప్పి.. తనపై కూడా ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేయించి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు మండిపడ్డారు. ఈ కేసుల్లో వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలియజేసేందుకు తాను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం.. రేవంత రెడ్డి సిద్ధమా..? అని కేటీఆర్ సవాల్ విసిరారు. గురువారం ఈడీ విచారణ ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కక్ష సాధింపు చర్యలో భాగంగా తనపై కేసు పెట్టారు. విచారణ సంస్థలను, అధికారులను గౌరవించి ఈ నెల 9న ఏసీబీ విచారణకు హాజరయ్యాను. 16న ఈడీ విచారణకు హాజరయ్యాను. రెండు సంస్థలు కూడా ఒకటే రకమైన ప్రశ్నలు ఏడు గంటల పాటు అడిగారు. అన్ని వివరాలు తీసుకున్నారు. మీరు ఎన్ని సార్లు పిలిచినా వస్తాను. విచారణకు సహకరిస్తాను. రాజ్యాంగాన్ని న్యాయ వ్యవస్థను, కోర్టులను గౌరవించే బిడ్డగా చెబుతున్నా.. ఎన్ని ప్రశ్నలు అడిగినా సమాధానం చెప్తా.. పూర్తిగా విచారణకు సహకరిస్తాను. తన నిజాయితీని నిరూపించుకుంటానని చెప్పాను అని కేటీఆర్ తెలిపారు. ఏసీబీ, ఈడీ వంటి విచారణ సంస్థలకు విచారించేందుకు రూ. 5 నుంచి 10 కోట్లు ఖర్చు అవుతుందని వార్తా పత్రికల్లో చూశాను. సీఎం రేవంత్ రెడ్డికి ఒక మాట చెప్పలదచులకున్నా.. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఏసీబీ, ఈడీ కేసు తనపై పెట్టారు. నువ్వంటే దొరికినోడివి.. నేను నిజాయితీపరుడిని.. ధైర్యంగా ఎదుర్కొంటాను. ప్రజాధనం వృథా చేయకుండా ఆ 10 కోట్లతో రైతు రుణమాఫీ, ఆసరా పెన్షన్లు ఇవ్వొచ్చు. నీకు నిజాయితీ, ధైర్యం ఉంటే.. ఏసీబీ జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి అయినా.. ఎవరి ముందైనా సరే కూర్చుందాం.. మీరు మొత్తం మీడియాను లైవ్ పెట్టండి.. ఏ ప్రశ్న అడిగినా సరే సమాధానం చెబుతాను. మీపై నమోదైన ఏసీబీ, ఈడీ కేసుల్లో కూడా ప్రశ్నిద్దాం. ఇద్దరికి లై డిటెక్టర్ పరీక్ష పెట్టండి.. అప్పుడు రూ.50 లక్షల్లో ఒడిసిపోతది. భారీగా ఖర్చు పెట్టడం దేనికి..? విచారణ సంస్థల అధికారులు, మీడియా సంస్థల సమయం వృథా అయిపోతోంది.. నీకు ధైర్యం ఉంటే నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో అయినా.. న్యాయమూర్తుల ముందైనా, ఈడీ ఆఫీసులోనైనా కూర్చుందాం. నీకు ధైర్యం ఉంటే నీవే తేదీలు, సమయం ప్రకటించు.. నేను కూడా వస్తా. లై డిటెక్టర్ పరీక్ష పెట్టి ఎవరు ఏందో తేల్చుకుందాం అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. విచారణకు ఎన్నిసార్లైనా వస్తా.. ఎన్ని పరీక్షలు పెట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను. న్యాయ వ్యవ్థ మీద నమ్మకం ఉంది. న్యాయం గెలుస్తదనే విశ్వాసం ఉంది. తప్పు చేయలేదు.. అరపైసా అవినీతి జరగలేదు. తప్పు చేసి ఉంటే రుజువు చేయండి.. ఏ శిక్షకైనా సిద్ధమని చెప్పానని కేటీఆర్ తెలిపారు.

# కేంద్రం పచ్చజెండా

>> అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందులో కొత్త వేతన సంఘం ఏర్పాటుకు సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. కమిషన్ ఛైర్మన్‌ను త్వరలోనే నియమిస్తామన్నారు. ఈ కమిషన్ వచ్చే యేడాది అంటే 2026 నాటికి తన నివేదికను సమర్పిస్తుందని తెలిపారు.

**2016లో అమల్లోకి వచ్చిన 7వ వేతన సంఘం..**

పే కమిషన్ చరిత్రను పరిశీలిస్తే.. 7వ వేతన సంఘం కంటే ముందు ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి 4వ, 5వ, 6వ వేతన కమిషన్‌ల కాలవ్యవధి సమానంగా 10 సంవత్సరాలు ఉండేది. ప్రస్తుతం అమలులో ఉన్న 7వ వేతన సంఘం.. 2016లో అమలులోకి వచ్చింది. 2025 డిసెంబరుతో 10 సంవత్సరాలు పూర్తవుతుంది. అయితే ఈ గడువు కంటే ముందే.. ప్రభుత్వం ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

**కొత్త పే కమిషన్‌లో కనీస వేతనం ఎంత..?**

8వ వేతన సంఘం అమల్లోకి వచ్చిన తర్వాత కేంద్ర ఉద్యోగుల జీతాలు భారీగా పెరిగే అకాశం ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కనీసం 2.86గా నిర్ణయించే అవకాశం ఉంటుందట. ఇదే జరిగితే, ఉద్యోగులు కనీస బేసిక్ జీతంలో పెరుగుదల భారీగా ఉంటుంది. అంటే కనీసం.. రూ. 51,480 ఉండొచ్చు. ప్రస్తుతం కనీస మూల వేతనం రూ. 18,000 ఉంది. దీంతోపాటు.. పెన్షనర్ల కనీస పెన్షన్ ప్రస్తుతం ఉన్న రూ. 9,000 నుంచి రూ. 25,740 కి పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ఉద్యోగుల వేతనాన్ని నిర్ణయించడంలో ఈ ఫిట్‌మెంట్ అంశం కీలక పోషిస్తుండడం గమనార్హం. 7వ వేతన సంఘం లెక్కలను పరిశీలిస్తే, ఉద్యోగులకు అందే అన్ని అలవెన్సులు కాకుండా బేసిక్ జీతం, ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ఆధారంగా వారికి అందే మొత్తం జీతం నిర్ణయించబడుతుంది.

**7వ వేతన సంఘం అమలు వల్లే..**

2016 జనవరి నుంచి నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం 6వ వేతన సంఘం సిఫార్సులక బదులు 7వ వేతన సంఘం సిఫారసులను అమలులోకి తెచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సంఘం కింద 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ వర్తించబడింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల బేసిక్ శాలరీ 2.57తో గుణించబడుతుంది. ఇది ఉద్యోగుల ప్రాథమిక వేతనంలో 2.57 శాతం పెరుగుదలకు సమానం. మునుపటి పే కమిషన్‌లో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 1.86. ఇది ప్రభుత్వ ఉద్యోగుల మూల వేతనంలో 1.86 శాతం పెరుగుదల ఉంది.

# భారీ ఎన్‌కౌంటర్

>> అటవి ప్రాంతంలో మావోయిస్టులు సమావేశం అయ్యారన్న పక్కా సమాచారంతో చత్తీస్‌గఢ్ చెందిన డిఆర్జీ ఎస్టీఫ్ సిఆర్ పిఎఫ్ కోబ్రా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టుల రహస్య ప్రాంతాన్ని చుట్టుముట్టిన బలగాలు వారి రాకను గమనించిన మావోలు తప్పించుకునే క్రమంలో భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు సైతం కాల్పులకు దిగారు. ఇరువురి మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతిచెందగా మరికొంత మంది గాయాలపాలైనట్లు తెలిసింది. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఇరువురు బలగాలకు గాయాలైనట్లు తెలిస్తుంది. ఇరువురి మధ్య జరిగిన కాల్పుల్లో మావోయిస్టులు భారీగా నష్టపోయారు. గడిచిన నెలరోజుల వ్యవధిలో వరుసగా ఎన్ కౌంటర్లు చోటుచేసుకున్నాయి. ఏడాది కాలంలో భద్రతా బలగాలు జరిపిన దాడిలో సుమారు 220 మావోయిస్టులు మృతిచెందగా అనేక మంది లొంగిపోయారు. మావోయిజాకన్ని రెండేళ్లలో కూకటివేళ్లతో పెకిలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించిన విధంగానే భద్రతా బలగాలు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి. ఏడాది కాలంగా మావోయిస్టులపై పట్టు సాదిస్తున్న బలగాలను ఎలాగైనా ఎదురుదెబ్బ తియ్యాలని భావించిన మావోలు ఐఈడీ పేల్చి తొమ్మది మందిని హతమర్చారు. ఈ ఘటనలో ఎనిమిది మంది డిఆర్జీ బలగాలతోపాటు వాహన డ్రైవర్ మృతిచెందిన సంఘటన తెలిసిందే.. మావోయిస్టు చర్యలకు ధీటుగా బదులిస్తామని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ప్రకటించిన పదిరోజుల్లోనే పూజర్ కాంకేర్ అటవి ప్రాంతంలో గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మందిని హతమర్చడం తీవ్ర చర్చంశనీయం అయ్యింది. అయితే ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతం తెలంగాణా సరిహద్దుకు కూతవేటు దూరం. ఎన్ కౌంటర్ ప్రాంతంలో భారీ మొత్తంలో ఆయుధాలు మందుగుండి సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

# కెటిఆర్ సుదీర్ఘ విచారణ

>> కేటీఆర్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు సమాచారం. కాగా ఉదయం కెటిఆర్ ఈడీ కార్యాలయానికి చేరుకున్న సమయంలో ఆయనకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. కొందరు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈడీ కార్యాలయం వద్దకు వచ్చిన ఎమ్మెల్యే గోపినాథ్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, పార్టీ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లను వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈడీ ఆఫీసు వైపు వచ్చే వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. ఉదయం గచ్చిబౌలిలోని నివాసం నుంచి బయలుదేరి నేరుగా కేటీఆర్ ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు. బాష్పవాయువు, వాటర్ కెనాన్ల వాహనాలు తెప్పించారు. వాస్తవానికి కేటీఆర్ ఈ నెల 7న ఆయన హాజరు కావాల్సి ఉన్నా, తాను రాలేనని కేటీఆర్ చెప్పడంతో 16న విచారణకు హాజరు కావాలని ఈడీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఫార్ములా ఈ రేస్‌లో నిబంధనల ఉల్లంఘనపై ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా, ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే ఇదే కేసులో నిందితులుగా ఉన్న అప్పటి మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. మరోవైపు ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను రాష్ట్ర హైకోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ కేటీఆర్ వేసిన పిటిషన్ సైతం బుధవారం సుప్రీంకోర్టులో తిరస్కరణకు గురైంది. "డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్"గా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చిన నేపత్యంలో ఈడీ విచారణకు ప్రాధాన్యం సంతరించుకుంది.

## వారం - వర్జ్యం

తేది : 17-01-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం, పుష్యమాసం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, కృష్ణపక్షం,
చవితి తె.5.31
మఖ మ.12.44
వర్జ్యం : రా.9.26-11.10
దు.ఉ.9.03-9.48, 2) మ.12.47-1.32
శుభసమయం: ఉ.7.00-8.00
మ.4.50-5.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. వివాదాలకు దూరంగా వుండండి. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**వృషభం:** కోర్టుకు సంబంధిత విషయాలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. గృహం కొనుగోలు యత్నాలు.

**మిథునం:** కొత్త వ్యాపారాలను ప్రారంభించానికి గాను కావలసిన వనరులను సమకూర్చుకొనే యత్నాలను ప్రారంభిస్తారు.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**సింహం:** మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు.

**కన్య :** బంధుమిత్రుల సలహాలు తీసుకొంటారు. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. వాహనయోగం.

**తుల :** కుటుంబసభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి

**వృశ్చికం:** పొగడ్తలకు లొంగిపోతారు. వాటి వెనుక దాగి ఉన్న లోగుట్టును పసిగట్టరు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** విద్యా వాణిజ్యరంగములలో ప్రోత్సాహకర వాతావరణము నెలకొంటుంది. మానసిక ప్రశాంతత.

**మకరం:** అతిథి మర్యాదలకు అధికంగా ఖర్చు చేస్తారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు.

**కుంభం:** పిల్లలకు వివాహ విషయముల ప్రస్తావన వస్తుంది. రహస్య సమాచారము తెలుస్తుంది.

**మీనం :** తత్ సంబంధీకుల స్వతంత్ర నిర్ణయములు ఇబ్బందిని కలిగించవచ్చును.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఫార్ములా - ఇ కేసు వ్యవహారంలో ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీకి ఎసిబి నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి16:** ఫార్ములా ఈ కేసు వ్యవహారంలో ఏసీబీ మరో ముందడుగు వేసింది. ఎస్ నెక్స్ట్ జెన్ కంపెనీకి ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ రేసును నిర్వహించడానికి ఒప్పందం చేసుకుని ఉన్నట్టుండి ఎస్ నెక్స్ట్ అనే కంపెనీ కుదుర్చుకున్న ఒప్పందం నుంచి అప్పట్లో వైదొలగింది. ఈ నెల 18న ఏసీబీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఏసీబీ పేర్కొంది. ఈ కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హెచ్ఎండీఏ పూర్వ కమిషనర్ అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ ఇంజినీర్ ఇన్ చీఫ్ బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ అధికారులు విచారణ చేశారు. మొత్తంగా ఫార్ములా ఈ కేసు దర్యాప్తులో ఏసీబీ వేగం పెంచిందని పలువురు చర్చించుకుంటున్నారు. 2022 అక్టోబరు 25న జరిగిన మొదటి ఒప్పందం ప్రకారం సీజన్ 9, 10, 11, 12 రేస్‌ల నిర్వహణ ఖర్చులను ఎస్ నెక్స్ట్ జెన్ భరిస్తామని చెప్పింది.

# 'కృష్ణా' వివాదం కొలిక్కి?

>> గోదావరి నదీ జలాల్లో తమకు రావాల్సిన వాటా కేటాయింపులో జరిగిన అన్యాయం ఆయన గుర్తు చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత, బచావత్ ట్రిబ్యునల్ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన కృష్ణా జలాల్లో 811 టీఎంసీల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, అవశేష ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు కేటాయించారు. కృష్ణాబేసిన్ వెలుపల ఉన్న ప్రాజెక్టులను కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్టులవారిగా నీటిని కేటాయించిన పాత విధానం ఆధారంగానే కేసీఆర్ ముఖ్యమంత్రిగా అవశేష ఆంధ్రప్రదేశ్‌తో ఒప్పొందం చేసుకొని తెలంగాణకు అన్యాయం చేశారని ఆయన ఆవేదన చెందారు. ఇది అవిభక్త మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు మరణశాసనంలా మారాయని వివరించారు." కృష్ణా బేసిన్ పరివాహక ప్రాంతంలో 68.5 తెలంగాణ పరిధిలో ఉంది, దీని ప్రకారం తెలంగాణకు 555 టిఎంసి నీరు (811 టిఎంసీ లో 68.5 ) రావాలి. కానీ 299 టీఎంసీలకు మాత్రమే అంగీకరించడంతో కేసీఆర్ తనకు రావాల్సిన 555 టీఎంసీల వాటాను పొందడంలో విఫలమై రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీశారని ఆయన ఆరోపించారు . కృష్ణా నదీ జలాలపై తెలంగాణకు న్యాయబద్ధమైన నీటి హక్కులను కాపాడడంలో విఫలమయ్యారన్నారు. కృష్ణా బేసిన్‌లో పాలమూరు రంగారెడ్డి ఎల్ఐఎస్, కల్వకుర్తి ఎల్ఐఎస్, నెట్టెంపాడు, భీమా ఎల్ఐఎస్ వంటి కృష్ణా ట్రిబ్యునల్ ద్వారా నీటి కేటాయింపులు లేని అనేక ప్రాజెక్టులు ఉన్నాయి. కేసీఆర్ ఈ ప్రాజెక్టుల డిపిఆర్‌లను కెఆర్ఎంబికి, సిడబ్ల్యుసిసమర్పించి, వాటి నుండి ఆమోదం పొంది ఉండాల్సింది, కానీ అలా చేయడంలో విఫలమై పాలమూరు, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల ప్రజల జీవితాలను పూర్తిగా ప్రమాదంలోకి నెట్టాడు" అని మంత్రి విమర్శించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం (ఏపీఆర్ఏ) 2014లోని సెక్షన్89లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపుల గురించి ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఎపిఆర్ఏ 2014లోని సెక్షన్89లోని సూచన నిబంధనలు క్రింద ప్రాజెక్టుల వారిగా కేటాయింపులు చేయాలని ఉంది. కెడబ్ల్యుడిటి2 టర్మ్ ఆఫ్ రెఫరెన్స్ 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సెక్షన్89 ప్రకారం టర్మ్ ఆఫ్ రెఫరెన్స్ చేశారు అని గుర్తుచేశారు. దాని ప్రకారం ఐఎస్‌డబ్ల్యుడి చట్టం 1956 ప్రకారం ఏర్పాటైన ట్రిబ్యునల్ ద్వారా అలాంటి కేటాయింపులు జరగనట్లయితే, ప్రాజెక్ట్ వారీగా నిర్దిష్ట కేటాయింపులు చేయాలి. వర్షాభావ పరిస్థితితో లోటు ప్రవాహాల సందర్భంలో ప్రాజెక్టుల వారీగా నీటి విడుదల కోసం కార్యాచరణ ప్రోటోకాల్‌ను నిర్ణయించాలి. వివరణ: ఈ సెక్షన్ యొక్క ప్రయోజనాల కోసం, నియమిత రోజున లేదా అంతకు ముందు ట్రిబ్యునల్ ఇప్పటికే చేసిన ప్రాజెక్ట్ నిర్దిష్ట అవార్డులు వారసత్వ రాష్ట్రాలపై కట్టుబడి ఉంటాయని స్పష్టం చేయబడింది. పైన పేర్కొన్న టర్మ్ ఆఫ్ రెఫరెన్స్ సహజంగా నది పరివాహక ప్రాంతం పరిగణలోకి తీసుకోకుండా కృష్ణా జలాల న్యాయమైన పంపిణీ చేయక తెలంగాణకు తగిన న్యాయం అందించలేదు. ఈ టర్మ్ ఆఫ్ రెఫరెన్స్ ప్రకారం, ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల వారీ కేటాయింపులను తాకకూడదు తగ్గించే కూడదు అని పేర్కొంది. తద్వారా తెలంగాణ రాష్ట్రానికి కొత్తగా పంపిణీ చేయవలసిన నీటి మొత్తాన్ని పరిమితం చేస్తుంది అని అన్నారు. 2015 సంవత్సరంలో, అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం 1956 (ఐఎస్ ఆర్ డబ్ల్యు డి 1956) సెక్షన్3 కింద కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అక్టోబర్ 6, 2020న జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో, కౌన్సిల్ ఛైర్మన్ (కేంద్ర జలశక్తి మంత్రి) సుప్రీంకోర్టులో కేసును ఉపసంహరించుకోవాలని కేసీఆర్‌ను కోరారు, తద్వారా ఈ అంశంపై కేంద్రం న్యాయ అభిప్రాయాన్ని తీసుకుంటుంది మరియు కొత్త ఏర్పాటు అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటుంది అని ఆయన తెలిపారు. ఎస్ఆర్ డబ్ల్యు డి1956 సెక్షన్3 కింద ట్రిబ్యునల్. ఒక్కరోజులో సుప్రీంకోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకుంటానని కేసీఆర్ హామీ ఇచ్చారు. అక్టోబర్ 2023లో సుప్రీంకోర్టు కేసు అనుమతించిన జూన్ 2021 వరకు అతను సుప్రీంకోర్టులో ఉపసంహరణ పిటిషన్‌ను దాఖలు చేయలేదు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2015లో సుప్రీం కోర్టుకు కి వెళ్లి, అక్టోబర్ 2021 వరకు పిటిషన్‌ను ఉపసంహరించుకోకపోవడంతో కృష్ణా నదీ జలాలపై తెలంగాణకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయం ఆలస్యం అయింది. తెలంగాణ ప్రభుత్వం ట్రిబ్యునల్ ఉత్తర్వును స్వాగతించింది. తెలంగాణకు సరైన న్యాయం అందించడానికి ఇది మార్గం సుగమం చేస్తుందని భావిస్తోంది. ఈ అదనపు టర్మ్ ఆఫ్ రెఫరెన్స్ కింద, కృష్ణా నది జలాల కేటాయింపులో బచావత్ ట్రిబ్యునల్ గతంలో చేసిన 811 టిఎంసిలలో తెలంగాణ తన హక్కు వాటాను పొందగలుగుతుంది అని ఆయన అన్నారు., తెలంగాణకు న్యాయం జరగకుండా అనేక ఎత్తుగడలు వేసిందని ఆయన ఆరోపించారు. ఆలస్యం చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ ఉద్దేశపూర్వకంగా ఒక సాకుతో లేదా మరొకటి ఉద్దేశపూర్వకంగా ట్రిబ్యునల్ విచారణను ఆలస్యం చేసింది. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఎగువన వినియోగానికి జిడబ్ల్యుడిటి కేటాయించిన 45 టిఎంసి (గోదావరి బేసిన్‌లోని పోలవరం ప్రాజెక్ట్ నుండి కృష్ణా బేసిన్‌కు తరలించే మొత్తం 80 టిఎంసి నీటిలో). పోలవరం ప్రాజెక్ట్ నుండి 80 టిఎంసి కంటే ఎక్కువ లేదా పోలవరం ప్రాజెక్ట్ నుండి కృష్ణా బేసిన్ లేదా కృష్ణా డెల్టా కమాండ్‌కు నీటి తరలించినందుకు అదనంగా తెలంగాణకు కృష్ణా నది నుంచి నీటి వాటా పొందేందుకు అదనపు కొత్త నిబంధన కృష్ణా నది జలాలలో తెలంగాణకు న్యాయమైన వాటాను పొందడానికి అదేవిధంగా సహజన న్యాయసూత్రాలకు అనుగుణంగా పంపిణీకి మార్గం సుగమం చేసింది అని ఉత్తమ్ హర్షం వ్యక్తం చేశారు.

# అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయండి

### కేంద్రమంత్రి భూపేందర్‌యాదవ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి వినతి

### కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మలను కలిసిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 16:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం రాత్రి విదేశాలకు వెళ్లే ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ముగ్గురు కేంద్ర మంత్రులను కలిశారు. తెలంగాణలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో ఢిల్లీలోని ఆయన కార్యాలయం ఇందిరా పర్యావరణ భవన్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను సీఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో తెలంగాణవ్యాప్తంగా 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని వివరించారు. 38 ప్రాజెక్టులు వన్యప్రాణి సంరక్షణ చట్టాల పరమైన అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. ఈ ప్రాజెక్టుల్లో అత్యధికం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పీఎంజీఎస్‌వై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఆయా పనులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తికి కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, పీసీసీఎఫ్ డోబ్రియల్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులున్నారు.

**ఆర్టీసీ బస్సులను ఇ-మోడల్‌లోకి మార్చేందుకు సహకరించండి: కేంద్రమంత్రి కుమారస్వామికి రేవంత్‌రెడ్డి వినతి**

హైదరాబాద్ నగరంలోని వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని కేంద్ర భారీ పరిశ్రమలు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆయన కార్యాలయంలో సీఎం గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. పీఎం ఈడ్రైవ్ పథకం కింద జీసీసీ పద్ధతిలో బస్సులు కేటాయించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ కిట్ అమర్చి రెట్రో ఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి కుమారస్వామి దృష్టికి ఏ.రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే 2,800 బస్సులను జీసీసీతో పాటు రెట్రో ఫిట్మెంట్ మోడల్ కింద కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ, మహబూబాబాద్ ఎంపీలు రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులున్నారు.



**ఉక్కు సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ**

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆయన కార్యాలయంలో గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ, మహబూబాబాద్ ఎంపీలు రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్ తదితరులున్నారు.



## తెలంగాణ కల సాకారంలో జైపాల్‌రెడ్డి పాత్ర చిరస్మరణీయం

### జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 16:** ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి గారి పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి గారి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో సాధారణ పల్లె నుంచి ఢిల్లీ దాకా సాగిన ఆయన ప్రస్థానంలో నైతిక విలువలకు కట్టుబడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో బలమైన గళం వినిపించారని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, బెల్లంపల్లి, పరిగి ఎంఎల్‌ఏలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాయకులు రోహిన్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బిఆర్ఎస్ పిటిషన్ దాఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 16:** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో సుప్రీం కోర్టులో బీఆర్ఎస్ పార్టీ రెండు పిటిషన్లు దాఖలు చేసింది. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన 9 నెలలు అవుతున్నా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ పేర్కొంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిపై రిట్‌పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తీర్పుఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని కోర్టుకు బీఆర్ఎస్ తెలిపింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది. గతంలో కేశం మేఘాచంద్ర కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోర్టును బీఆర్ఎస్ కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు వచ్చిందని గుర్తు చేసింది. మేఘా చంద్ర కేసు తీర్పుకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని బీఆర్ఎస్ తెలిపింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది.

## డిపార్ట్‌మెంటల్ పరీక్షల రెస్పాన్స్ షీట్స్ విడుదల

### వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రకటించిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన వివిధ డిపార్ట్‌మెంటల్ పరీక్షల రెస్పాన్స్ షీట్స్‌ను విడుదల చేసింది. వివిధ శాఖల్లో డిపార్ట్‌మెంటల్ పరీక్షల కోసం నోటిఫికేషన్ నంబర్ 4-2024ను సెప్టెంబర్ 12, 2024న టీజీపీఎస్సీ జారీ చేసింది. వీటికి సంబంధించిన పరీక్షలనను నవంబర్ 25 నుంచి డిసెంబర్ 3 వరకు తిరిగి డిసెంబరన 7, 8 తేదిల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో పరీక్షలను నిర్వహించారు. వాటికి సంబంధించిన అభ్యర్థుల రెస్పాన్స్ షీట్స్‌ను గురువారంనుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ గురువారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ రెస్పాన్స్ సీట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటించారు.

## ఎరువుల పంపిణీకి నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్

### రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులకు కావాల్సిన ఎరువులను ఇప్పటి వరకూ తెలంగాణ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) ద్వారా పంపిణీ అవుతోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీకి కొనసాగిస్తోంది. అయితే మార్క్‌ఫెడ్‌తో పాటు, ఇక నుండి ఆగ్రోస్ ద్వారా కూడా రైతులకు ఎరువులను సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు ఆగ్రోస్‌ను కూడా మార్క్‌ఫెడ్‌తో పాటు నోడల్ ఏజెన్సీగా నియమించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. ఈ మేరకు ఎరువుల పంపిణీకి గాను మరో నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్‌ను ఎంపిక చేసిన సమాచారాన్ని వారం రోజుల్లో కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖకు ప్రభుత్వం సమాచారం ఇవ్వనుంది. రాష్ట్రంలో ఎరువుల పంపిణీకి తమ సంస్థను నోడల్ ఏజెన్సీగా నియమించాలంటూ ప్రభుత్వానికి ఆగ్రోస్ ఉన్నతాధికారులు రెండు నెలల క్రితం కోరగా, దానికి స్పందించిన వ్యవసాయ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ఈ ప్రతిపాదనలపై ఇటీవల ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎరువుల కంపెనీలు మార్క్ ఫెడ్ తోపాటు ఆగ్రోస్‌కు ఇండెంట్ మేరకు నేరుగా ఎరువులను సరఫరా చేస్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని 925 సహకార సంఘాలు, 400 ఆగ్రోస్ కేంద్రాల ద్వారా ఎరువులను విక్రయిస్తున్నారు. మరో ఐదు వేల వరకు ప్రైవేటు ఎరువుల దుకాణాలు రైతులకు ఎరువులను విక్రయిస్తున్నాయి. ఈ తరుణంలో ఆగ్రోస్ సొంతంగా ఎరువుల పంపిణీ చేపడితే కేంద్రాల సంఖ్య 987కు పెరగడమే కాకుండా అదనంగా ఎరువులు మరిన్ని లభించే వీలుంటుందని వ్యవసాయ శాఖ భావిస్తున్నది. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లకు ప్రతి సంవత్సరం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా ఉన్న మార్క్ ఫెడ్ మొత్తం 36 లక్షల టన్నుల ఎరువులు (యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్, సల్ఫర్) జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తుంది.

## ఇబ్రహీంపట్నంలో ఇంజినీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం

### ప్రైవేటు వసతిగృహంలో దారుణం

### నిందితుడు అరెస్ట్.. కేసు నమోదు

**ఇబ్రహీంపట్నం, జనవరి 16, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిగేట్ వద్ద ఓ ప్రైవేట్ వసతిగృహంలో విద్యార్థిని అత్యాచారానికి గురైంది. స్థానికులు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మంగల్ పల్లి సమీపంలోని సివిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని మంగల్‌పల్లిగేట్ దగ్గర ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటుంది. కాగా ఈ హాస్టల్ భవనం యజమాని దగ్గర గతంలో డ్రైవర్‌గా పనిచేసిన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జొన్నాయిచింత గ్రామానికి చెందిన అజిత్ (22) బుధ వారం రాత్రి ఒంటరిగా ఉన్న ఆ విద్యార్థినిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. విద్యార్థిని అరుపులకు పక్కగదిలో ఉన్న తోటి విద్యార్థినులు 100కు డయల్ చేయడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థినిని వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు నిందితుడిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసిపి కెపివి రాజు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న విక్టోరియా

### మరొక రికార్డు సాధన కోసం

## కొడుకుతో కలిసి మహా సముద్రంలో ఓపెన్ స్విమ్మింగ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 16, ప్రభాతవార్త:** ముంబాయిలోని అరేబియా మహా సముద్రంలో ఈ నెల 19న తన కుమారుడితో కలిసి ఓపెన్ స్విమ్మింగ్ చేస్తున్నామని ఇంగ్లీష్ చానల్ ఈదీ రెండు తెలుగురాష్ట్రాల్లో రికార్డు నెలకొల్పిన హైదరాబాద్ నగరానికి చెందిన అంతర్జాతీయ సిమ్మర్ గంధం క్విని విక్టోరియా తెలిపారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 19వ తేదీ ఉదయం ముంబాయి సమీపంలోని మండ్వా జెట్ నుంచి గేట్ వే ఆఫ్ ఇండియా వరకు స్విమ్మింగ్ చేసి మరొక రికార్డును నెలకోల్పడానికి సిద్ధమైనానని చెప్పారు.

తన కుమారుడు సిపెన్‌సింగ్ (20) డిగ్రీ చదువుతున్నారని తాను తన పిల్లలను ఆదర్శంగా తీసుకుని స్విమ్మింగ్ నేరుకోవడం జరిగిందని, తొలిసారిగా తన కుమారునితో కలిసి స్విమ్మింగ్ ఎంతో సంతోషంగా ఉందని, స్విమ్మింగ్‌కు వయస్సుతో సంబంధం లేదని, భవిష్యత్తు తరాలకు తెలియజేయడం కోసమే తాను స్విమ్మింగ్ చేస్తున్నానని ఆమె స్పష్టం చేశారు. దేశంలో తొలిసారిగా తల్లి, కొడుకు కలిసి స్విమ్మింగ్ చేయడం ఇదే తొలిసారని, ఇంతవరకు ఇలాంటి సాహసం ఎవరూ చేయలేద న్నారు. తాను ఇప్పటికే అంతర్జాతీయ పిన్ స్విమ్మింగ్‌లో పాల్గొని గోల్డ్, సిల్వర్, కాంస్య పతకాలను సాధించడం జరిగిందన్నారు. విద్యార్థులు, విద్యార్థినీలు విహారయాత్రలకు వెళ్ళినప్పుడు సెల్ఫి ఫోటోల కోసం చెరువులు, రిజర్వయర్లు, కెనాల్స్‌లోకి దిగి మృత్యువాత పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకుగాను ప్రతి ఒక్కరూ వయస్సుతో సంబంధం లేకుండా స్విమ్మింగ్ నేర్చుకోవాలని ఆమె సూచించారు.

## మూడుభారత అణుకేంద్రాలపై ఆంక్షలు తొలగించిన బైడెన్ సర్కార్

**వాషింగ్టన్, జనవరి 16:** అమెరికాకు కొత్త అధ్యక్షుడుగా డొనాల్డ్‌ట్రంప్ బాధ్యతలు స్వీకరించడానికి కొద్దిరోజులముందే బైడెన్ సర్కారు మూడు భారతీయ అణుసంస్థలపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లుప్రకటించింది. ఇండియన్ రేర్ ఎర్త్స్, ఇందిరాగాంధీ ఆటమిక్ రీసెర్చి సెంటర్, బాబా ఆటమిక్ రీసెర్చి సెంటర్లపై ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు బైడెన్ సర్కార్ ప్రకటించింది. కోల్డ్‌వార్ కాలంలో ఈ మూడు భారతీయ సంస్థలపై విధించిన ఆంక్షలను తొలగించడంతోపాటు ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి, సైన్స్ టెక్నాలజీ సహకారంతోసహా అధునాతన ఇంధన సహకారానికి అడ్డంకులను తగ్గించడంద్వారా అమెరికా విదేశాంగ లక్ష్యాలకు మద్దతిస్తున్నట్లు వాణిజ్యశాఖ బ్యూరో ఆఫ్ ఇండస్ట్రీ అండ్ సెక్యూరిటీ ప్రకటించింది. అదేసమయంలో అమెరికా జాతీయ భద్రత విదేశాంగవిధానాలప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్‌చైనా గమ్యస్థానం కింద ఉన్న 11 సంస్థలను ఎంటిటిజాబితాలో బిఐఎస్ చేర్చింది. భారత్ అమెరికాలు రెండూ కూడా శాంతియుత అణుసహకారం అనసుబంధ పరిశోధన అభివృద్ధి కార్య కలాపాలను ముందుకు తీసుకెళ్లే నిబద్ధతను పంచుకుంటాయని వైట్‌హౌస్ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా రెండు దేశాలతోపాటు భాగస్వామ్య దేశాలకు ప్రయోజనంచేకూర్చిన సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారం ఈ ఆంక్షల తొలగింపుతో మరింత బలపడిందని బిఐఎస్



ప్రకటించింది. ఈ చర్య యుఎస్ ఇండియా భాగస్వామ్య లక్ష్యాలకు అనుగుణంగా ఉందని భవిష్యత్తులో మరింత మద్దతు కూడా ఇస్తుందని వాణిజ్యప్రధాన డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీ మాత్యూ బోర్మాన్ అన్నారు. అమెరికాలో భారత మాజీ రాయబారి తరంజిత్‌సింగ్ సంధు మాట్లాడుతూ బైడెన్ సర్కారు చర్య భారత్‌యుఎస్ భాగస్వామ్య ఒప్పందాలకు అనుగుణంగాజరిగిన ప్రముఖ చర్య అని కొనియాడారు.

## పొలం పనుల్లో హిమాన్షు.. మురిసిపోయిన కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 16:** ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కేటీఆర్ తనయుడు హిమాన్షు వ్యవసాయ పనుల్లో తలమునకలయ్యారు. పార చేతబట్టి హిమాన్షు పొలం పనులు చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మనవడు వ్యవసాయ పనులు చేస్తుండగా.. బిఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎంతో మురిసిపోయారు. హిమాన్షును సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ కార్యకర్తలు అభినందిస్తున్నారు. కేసీఆర్ వ్యవసాయంపై తనకున్న మక్కువను వీలున్నప్పుడల్లా చాటుకుంటూనే ఉంటారు. ఇప్పుడు కేసీఆర్ అడుగుజాడల్లో ఆయన మనువడు కల్వకుంట్ల హిమాన్షు కూడా నడుస్తున్నాడు. హిమాన్షు తీరిక సమయంలో తన తాతయ్యతో కలిసి వ్యవసాయ క్షేత్రంలో గడుపుతున్నాడు.

అచ్చమైన రైతన్నలా పొలం పనులు చేస్తున్నాడు. హిమాన్ష్ వ్యవసాయ పనుల్లో నిమగ్నం కాగా.. మనవడు చేస్తున్న పొలం పనిని చూసి కేసీఆర్ కూడా మురిసిపోయారు.

ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో హిమాన్షు తన తాత సూచనలతో తానే స్వయంగా పారతో మట్టి తీసి, ఓ చెట్టును నాటాడు. ఆ చెట్టు చుట్టూ ఎరువును కూడా పోసి మళ్లీ పారతో మట్టిని కప్పాడు. ఆ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన హిమాన్షు.. ఓ సందేశం ఇచ్చాడు. వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడానికి అడవుల పెంపకం చాలా అవసరం అని పేర్కొన్నాడు. సహజ వనరులను రక్షించడం, సంరక్షించడం మన బాధ్యత అని హిమాన్షు రావు సందేశమిచ్చాడు.

## వెలిమలలో రూ.2,000 కోట్ల భూ కుంభకోణం

### 85 ఎకరాల భూమిని ఓ మంత్రి తన కుటుంబసభ్యుల పేరిట మార్చుకునే యత్నం

### బిజెపి ఎంపి రఘునందన్‌రావు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలే ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారని బిజెపి ఎంపి రఘునందన్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఓ మంత్రి రింగ్‌రోడ్డు సమీపంలోని 85 ఎకరాల భూమిని తన కుటుంబ సభ్యుల పేరుమీదకు మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని రఘునందన్‌రావు ఆరోపించారు. గురువారం బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతనైతా మూడు తరాలుగా అక్కడే ఉంటున్న ఆ గిరిజన రైతులకు పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం, రంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లి మండలం మధ్య చాలా కాలంగా భూవివాదం నడుస్తోందనని శంకర్‌పల్లిలోని కొండకల్, రామచంద్రపురంలోని వెలిమెల గ్రామాల మధ్య మిగిలిన సూమారు రూ.1500 కోట్ల విలువైన 85 ఎకరాలను కబ్జా చేసేందుకు ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల భూములు కాపాడేందుకు ధరణి స్థానంలో భూమాత చట్టాన్ని తీసుకువచ్చామని అసెంబ్లీలో పెద్ద పెద్ద ఉపన్యాసాలు చేసిన మంత్రే ఇప్పుడు పేద ప్రజల భుములను లాక్కునేందుకు పోలీసులను అడ్డం పెట్టుకుని మహిళలు, గిరిజనులను బెదరిస్తు న్నారని ధ్వజమెత్తారు. పేదలకు జరుగుతున్న ఈ అన్యాయాలపై ఎవరైనా మాట్లాడితే పోలీసులను అడ్డం పెట్టుకుని బెదరిస్తు న్నారని మండి పడ్డారు. ఆ భూముల్లోకి ఎవరు వెళ్లొద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా పోలీ సుల చేత బలవం తంగా గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారని ఆరోపిం చారు. సంగారెడ్డి జిల్లా పోలీసులు మూడు రోజులుగా వెలిమెల ఊరవుతల డ్యూటీ చేస్తూ ప్రభుత్వ భూములను ఓ బాడా వ్యక్తికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నార న్నారు. తాము ఈ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించ బోతున్నామన్నారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఒక రంగు పోయి మూడు రంగుల జెండా వచ్చిందే తప్ప ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. చట్టంలోని లోసుగులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వంలోని అమాత్యులు కొందరు రింగురోడ్డు చుట్టూ ఉన్న ఖాళీ స్థలాలు, పేదల స్థలాలను లాక్కుంటున్నారంటూ దూయబట్టారు.



గురువారం బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

### అటవీ శాఖ విజ్ఞప్తులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** అటవీ శాఖకి సంబంధించిన పలు అంశాల్లో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సానుకూల స్పందించారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని రహదారుల (ఎల్ డబ్ల్యూఈ రోడ్స్) అనుమతులు, అర్బన్ ఫారెస్ట్రీ, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం అటవీ అనుమతులకి సంబంధించి అనుమతులు కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. అర్బన్ పార్కుల విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కేంద్రమంత్రికి కొండ సురేఖ గుర్తు చేయగా, వాటికి సంబంధించిన ప్రతిపాదనలను కూడా క్లియర్ చేస్తామని హామీ అన్నారని మంత్రి తెలిపారు.

## కాంగ్రెస్ హామీలే ఓటమికి టికెట్

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ హామీలే ఓటమికి టికెట్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలకు సంబంధించిన ప్రచార పోస్టర్ల విడుదల చేసిన నేపథ్యంలో హామిలపై బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ తెలంగాణలో ఇచ్చిన మోసపూరిత హామీలతో ఎన్నికలకు వెళ్లి హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. డేట్, టైమ్, ప్లేస్ చెప్పు వస్తా, రేవంత్‌కు కేటీఆర్ సంచలన సవాల్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఘనమైన వాగ్దానాలు తెలంగాణలో కాంగ్రెస్ హామీల మాదిరిగానే విఫలమవ్వడం ఖాయమన్నారు. విద్యా భరోసా కార్డు, రూ. 15,000 రైతు భరోసా, రూ. మహిళలకు 2,500, రూ. 4,000 పెన్షన్లు, ఇంటి స్థలాలు, మద్దతు ధర, అంతర్జాతీయ పాఠశాలలు? అన్నీ ఖాళీ హామీలేనని బండి సంజయ్ కాంగ్రెస్ ఎన్నికల హామీలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ బూటకపు ప్రచారాలు, బూటకపు హామీలతో ఢిల్లీ ప్రజలు తప్పుదోవ పట్టించిందని, కాంగ్రెస్‌కు మరో ఓటమి ఎదురుచూస్తోందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ వ్యాఖ్యల నేపథ్యంలో

## బిజెపి కార్యాలయం వద్ద భారీగా పోలీసు బందోబస్తు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయోధ్యలో రామ మందిరం ప్రారంభం అయినరోజే దేశానికి నిజమైన స్వాతంత్రం వచ్చిన రోజని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. మోహన్‌భగవత్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు.

మోహన్ భగవత్ వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తక్కువ చేయడమే అని ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ఈ వ్యాఖ్యలని నిరసిస్తూ తెలంగాణ యూత్ కాంగ్రెస్ నేతలు గురువారం రాష్ట్ర బిజెపి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులను మోహరించారు. బిజెపి కార్యాలయానికి సంబంధించిన దారులను అన్నిటినీ మూసివేసి గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా ఇటీవల ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని యూత్ కాంగ్రెస్ నేతలు బిజెపి కార్యాలయంపై దాడి చేసి పలువురిని గాయపరిచిన సంఘటన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు.


**జిల్లా మహిళా సమాఖ్య - సంగారెడ్డి జిల్లా**

**ప్రకటన**

నెం : 528/షెటర్స్/పత్రికప్రకటన-2/2023/ తేది: 09.01.2025.

ఇందుములముగా పట్టణ ప్రజలకు మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్యకు సంబంధించిన బైపాస్ రోడ్ సంగారెడ్డి నందు గల దుకాణ సముదాయములకు సంబంధించి ఈ దిగువ చూపబడిన దుకాణం నెలసరి అద్దె ప్రతిపాదనపైన 3సం.లు కేటాయించుటకు గాను ఈ క్రింద షరతులకు లోబడి జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణంలో ల్యాటరి పద్ధతి ద్వారా నిర్ణయించడం జరిగింది. దరఖాస్తులు సమర్పించు తేది: 17.01.2025 నుండి తేది: 25.01.2025 వరకు. **క్ర.సం., వేలము నిర్వహించే షాపుల వివరములు: షాపు విస్తీర్ణం, చ.అడుగులు, జిల్లా మహిళా సమాఖ్య నిర్ణయించిన నెలసరి అద్దె, రిజర్వేషన్ ప్రకారం దుకాణాల కేటాయింపు:** 1. GF-షాప్ నం.3, 315, 25,000/-, Physically Disabled, 2. GF-షాప్ నం.5, 315, 25,000/-, ST, 3. FF-షాప్ నం.9, 315, 20,000/-, Nayanibramhan Community, 4. FF-షాప్ నం.10, 315, 20,000/-, SC, 5. FF-షాప్ నం.11, 315, 20,000/-, General, 6. FF-షాప్ నం.12, 315, 20,000/-, General, 7. FF-షాప్ నం.13, 315, 20,000/-, General, 8. FF-షాప్ నం.14, 315, 20,000/-, General, 9. FF-షాప్ నం.15, 315, 20,000/-, General, 10. FF-షాప్ నం.16, 315, 20,000/-, General. 1) ధరఖాస్తు సొమ్ము రూ. 10,000/- లను "సంగారెడ్డి జిల్లా మహిళ సమాఖ్య" (Sangareddy Zilla Mahila Samakhya) పేరుపైన ఏదైన జాతీయ బ్యాంకులో తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ ను నిర్ధారిత ధరఖాస్తుతో పాటు జత చేసి పైన చూపిన ధరఖాస్తు సమర్పణ తేది: 17-01-2025 నుండి తేది : 25-01-2025 వరకు డి.ఆర్.డి.ఎ కలక్టరేట్ కార్యాలయంలో సమర్పించి (దరఖాస్తు సొమ్ము రూ. 10,000/- తిరిగి చెల్లించబడదు) రశీదు పొంది, ల్యాటరి తేది: 27.1.2025 మ.3.00 గం. నందు పాల్గొనవలెను. 2) దరఖాస్తుదారుడు 1) స్వయం సహాయక సంఘ సభ్యురాలు మెప్మా/సెర్ప్ అయి ఉండాలి (సంఘం తీర్మానం, బ్యాంకు పాస్ పుస్తకం, సంఘం ఫోటో జత చేయాలి) 2) నివాస ధృవీకరణ పత్రం లేదా రేషన్ కార్డు 3) కుల ధృవీకరణ పత్రం 4) నోడ్యూ సర్టిఫికేట్ పట్టణ/జిల్లా సమాఖ్య/ గ్రామసంఘం/సంఘం ద్వారా తీసుకొవలెను 5) రూ. 2.00 లక్షల స్వాలెన్స్ సర్టిఫికేట్ బ్యాంకు ద్వారా లేదా తహశీల్దారు కార్యాలయము ద్వారా జారి చేయబడిన దానిని జతపర్చవలెను. 3) ఒక దరఖాస్తుదారుడు ఒక షాపుకి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 4) షెడ్యూల్ కులముల వారికి, షెడ్యూల్ తెగల వారికి మరియు వికలాంగులకు స్వాలెన్స్ సర్టిఫికేట్ అవసరము లేదు. 5) షాపు కేటాయించిన తదుపరి అడ్వాన్సుగా రూ.2,00,000/-లు తేది: 29.1.2025లోగా సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య ఖాతాకు జదిలి చేసి రశీదు పొందగలరు. అడ్వాన్సు డిపాజిట్ చేయనిచో మీ యొక్క షాపు కేటాయింపు రద్దు చేయబడును. 6) షాపు కేటాయింపు పత్రము పొందిన రోజు నుండి 30 రోజులలోగా లీజు అగ్రిమెంట్ చేసుకోవలెను. 7) షాపు నిర్ధారించబడిన నెలవారి అద్దెను ప్రతి నెల 5వ తారీఖు లోపు చెల్లించవలెను. 8) నిర్ణీత గడవు నుండి 30 రోజుల లోపు అద్దె చెల్లించని యెడల లీజు రద్దు చేయబడును. 9) మీ షాపు లోపల మరియు పరిసర ప్రాంతాలలో శానిటేషన్ బాధ్యత లీజుదారుదే. 10) షెటర్ పొందిన వారు ఎట్టి పరిస్థితులలో కూడా ఇతరులకు సబ్ లీజ్/కిరాయికి ఇవ్వబడదు. 11) అగ్రిమెంట్‌లోని నిబంధనలు అతిక్రమించిన యెడల ఏ విధమైన ముందస్తు నోటీసు లేకుండా లీజును రద్దు పరచి అడ్వాన్సు రూపాయలు చెల్లించబడదు, తిరిగి ల్యాటరి వేయు అధికారం అధ్యక్షురాలు, జిల్లా సమాఖ్య గారికి పూర్తి అధికారం కలదు. మిగతా వివరములు కార్యాలయములో పనివేళల్లో తెలుసుకోవచ్చును. 12) పైన చూపిన షరతులకు మార్పులు ఏవైన ఉంటే పూర్తి అధికారం జిల్లా గ్రామీణాభివృద్ధి చైర్మెన్ మరియు జిల్లా కలెక్టర్ గారికి కలదు.

సం/- అధ్యక్షురాలు, జిల్లా మహిళా సమాఖ్య, సంగారెడ్డి జిల్లా

DIPR.No.9128-PP/CL/Advt/1/2024-25, తేది: 16.01.2025

వార్త

ఎవరూ నీకు ప్రావీణ్యాన్ని సంపాదించి పెట్టలేరు. నీకై నీవే దాన్ని సంపాదించుకోవాలి.

-కార్డినల్ న్యూమాన్

# పసుపు పండుగ

దేశంలోనే ప్రప్రథమంగా పసుపు ఉత్పాదనల ఎగుమతులు పెంచే లక్ష్యంగా పసుపుబోర్డు ఏర్పడడం రైతాంగానికి శుభపరిణామం. రైతులకు సాగులాభదాయకంగా, వినియోగదారులకు నాణ్యమైన పసుపు అందజేయాలన్న తలంపుతో ఏర్పడిన జాతీయ పసుపు బోర్డు లక్ష్యం నెరవేరితే ఇక దేశంలో 'పసుపు పండగే' మరి! దేశంలో ప్రధానంగా తెలంగాణ, మహారాష్ట్ర తమిళనాడు ఆంధ్రప్రదేశ్‌లలో మొత్తం 3.24 లక్షల హెక్టార్లలోఎకరాలలో సాగు చేస్తున్నారు. ఇండియాలో పండించే పసుపులో ఈ రాష్ట్రాలలో సాగు మొత్తం 63.4 శాతంగా నమోదైంది. ఇవిగాక ఒరిస్సా, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, గుజరాత్, మేఘాలయ, అస్సాంలలో కూడా పసుపు పండుతోంది. ఈ సంక్రాంతి కానుకగా దేశంలోని పసుపు సాగు రైతుల కలలసాకారంగా జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. నిర్ణయం తీసుకోవడమే తరువాయిగా నిజామా బాద్ కేంద్రంగా ఆ ప్రాంతంలో పసుపు రైతుల కడగండ్లు తెలిసిన పసుపు రైతునే పసుపు బోర్డు తొలి ఛైర్మన్‌గా నియమించడం ఆహ్వానించదగిన విషయం. ఎన్నో ఏళ్లుగా పసుపు బోర్డు కోసం పసుపు రైతాంగం తపస్సు చేస్తోంది. వారు చాలా ఏళ్లుగా పసుపు ఉత్పత్తులకు, ఎగుమతులకు గిట్టుబాటు ధర లేక, ఆదాయం రాక కొంతమంది పసుపు సాగును వదిలి పెట్టలేక వదిలి ప్రత్యామ్నాయ పంటల సాగులోకి మారారు. ఆ యేటి కాయేడు రైతులు గతఏడాది పసుపు సాగుకు దూరమ య్యే పరిస్థితిలో ఉండగా తాజాగా సరైన సమయానికి కేంద్రం సరైన నిర్ణయం తీసుకొందనే చెప్పాలి. 2019 ఎన్నికల్లో మాత్రం 180 మంది పసుపు రైతులు పసుపు బోర్డు కావాలన్న కోరికకు మద్దతుగా లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్లు వేసి తమ తీవ్ర ఆకాంక్షలను దేశం యావత్తూ తెలియచేసే ప్రయత్నం చేశారు. అప్పట్నించీ రాజకీయ పార్టీలన్నీ కూడా 'పసుపు బోర్డు' కావాలన్న పల్లవిని అందుకున్నాయి. అంతకు ముందే పసుపు బోడ్డుకావాలన్న డిమాండ్ ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇంతకాలం సుగంధ ద్రవ్యాల బోర్డులో 'పసుపు' విభాగం కలిసి ఉండేది ఆ బోర్డు తీసుకునే నిర్ణయాలతో పసుపు రైతులు సంతృప్తిగా లేకపోవడమే కాక తమ గురించి పట్టించుకునే ప్రత్యేక బోర్డు కావాలని పట్టుపట్టారు. నేడు పసుపు బోర్డును ప్రత్యేకంగా ప్రకటించడం పసుపు రైతాంగానికి శుభ సమాచారమే. పసుపు బోర్డువల్ల కేవలం పసుపు రైతులకే కాకుండా పర్యాటకం, ప్యాకేజీ యూనిట్లు తదితర ఏర్పాటు ద్వారా ఉపాధి కలుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి పసుపు బోర్డు, పసుపు విరివిగా సాగు చేస్తున్న నిజామాబాద్‌లో దాని కార్యస్థానాన్ని ఏర్పాటు చేయడం, పసుపు రైతునే దానిక ధిపతిగా నియమించడం వల్ల పసుపు బోర్డు దేశవ్యాప్త పసుపు సాగుదారులకు విశేషమైన మేలు చేయగలదు. ఇప్పుడు తాజాగా నిజామాబాద్ కేంద్ర స్థానంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు పసుపు రైతులకు మరింత అందుబాటులో వుండి వారి సమస్యలకు పరిష్కారం చూపగలదన్న విశ్వాసం రైతుల్లో కలుగుతోంది. పసుపు బోర్డు ఏర్పాటు, ఆ వెంటనే దాని కార్యాచరణకు అవసరమైన ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ తన భుజస్కంధాలమీద వేసుకున్నారు. ఈ బోర్డు ఏర్పాటు పసుపు సాగుదారుల్లో ఎంతో ఆనందోత్సాహాలు నింపింది. ఇదంతా ఇలా ఉంటే వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పసుపు రైతులకు పనిముట్లను రాయితీపై అందించాలని తెలంగాణ రైతు కమిషన్ తమ డిమాండ్‌లనుకేంద్రం ముందుంచింది. పసుపు బోర్డు ఏర్పాటులో దేశంలోని ఏప్రాంతానికి గానీ, ఏ రాష్ట్ర ప్రభుత్వానికిగానీ ఏ పసుపు రైతాంగ సంఘాలకు గానీ భిన్నాభిప్రాయంలేనే లేదు. కాగా దేశంలోనిచాలా ప్రాంతాలలో పసుపు సాగులో అత్యాధునిక పద్ధతులను ఉపయోగించడం లేదు. పాత పద్ధతుల్లోనే సాగు నిర్వహణ, యాజమాన్యం పద్ధతులు లేవని రైతాంగం వాపోతోంది. కూలీల కొరత, అధునాతన యంత్రాల లేమి రైతులకు సాగువ్యయం ఎక్కువవుతోంది. ఇంకా సాంప్రదాయ పద్ధతులను వారు విడనాడలేదు. వారు సాగుచేస్తున్నారు. దేశ కాల మానవపరిస్థితుల రీత్యా వ్యవసాయాభివృద్ధిలో చోటు చేసుకున్న మార్పుల కనుగుణంగా సాగు యాజమాన్యం ఉండాలని పసుపు రైతు భావిస్తున్నాడు. పసుపుబోర్డు ఏర్పాటులో ఎవరి ప్రమేయమున్నా ఎవరి పట్టు ఉన్నా దానిని పూర్తిస్థాయి బోర్డుగా తీర్చిదిద్దడంలో అందరూకలిసి సానుకూలంగా ముందుకు కదలాలి. కేంద్ర రాష్ట్ర వ్యవసాయశాఖలు, రెండూ సమన్వయంగా నిజామాబాద్‌ను అంతర్జాతీయ స్థాయికి ఎదిగేటట్లు చేయగల ప్రణాళికలతో పసుపు బోర్డును తీర్చిదిద్దాలి. ఇక ఈబోర్డు నిర్వహణకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయింపు, సిబ్బంది, అధికారులను నియమిస్తామని కేంద్ర మంత్రి భరోసా కూడాఉంది. ఈలోగా రెండేళ్లలో పసుపు ఉత్పత్తులను రెండింతలుచేసే లక్ష్యంతో బోర్డు ముందుకుసాగాల్సి ఉంది. వీటికితోడు అన్నిరాష్ట్రాల పసుపురైతులు, పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయ శాఖలను చేరదీసి ఉమ్మడి కార్యాచరణతో బోర్డు నాయకత్వంలో ముందడుగు వేయడం బోర్డుముందున్న లక్ష్యం.కొత్త వంగడాల రూపకల్పన, అధికోత్పత్తి నివ్వగల విత్తనాల సరఫరాతో పాటు ధరల స్థిరీకరణ, మార్కెటింగ్ వంటి అంశాలపై చొరవచూపడం పుసుపు బోర్డు చేపట్టాల్సిన తక్షణ కర్తవ్యంగా భావిస్తే అదే దేశానికి నిజమైన పసుపు పండగగా భావిద్దాం.

మాటకు మాట ప్రతీకారం కాదు, మౌనమే దానికి సమాధానం.



ఫ్లినీ

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు.ఎమర్సన్

## ప్రజావాక్కు



### వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి

వయసు నిర్ధారణ పత్రాలు అన్నిసచివాలయాల్లో ఇవ్వాలి ఆంధ్రప్రదేశ్‌లోని కొంతమంది వృద్ధులకు ఆధార్ కార్డులో వయసు తప్పుగా నమోదు జరిగింది. వారికి 75 లేదా ,65 సంవత్సరాలు వయసు ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో 45,56,58,సం.లు ఉన్నట్టుగా నమోదు అయింది.! ఆ కారణంగా పలువురు వృద్ధులకు వృద్ధా ప్య పింఛను పొందే అర్హత కోల్పోయారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌లు పెట్టి వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి. ఈ కౌంటర్‌లు నిరంతరం పనిచేయాలి. ఇవి పనిచేసే తీరుపై జిల్లా కలెక్టర్‌లు పర్యవేక్షణ ఉండాలని అర్హత వున్న వారికి వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి.

-శీరాపు శ్రీనివాసరావు, విజయనగరం

### జాతీయ హోదా ఇవ్వాలి

నిజామాబాద్‌కి పసుపు బోర్డ్ ప్రకటించి తెలంగాణకు కేంద్రం సంక్రాంతి బహుమతి అందించింది. కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ మామూనూర్ లో విమానాశ్రయం వరంగల్‌కి పత్తి పరిశోధన కేంద్రం మంజూరు చేయడం ద్వారా తెలంగాణ అభివృద్ధికి కేంద్రం బాసటగా నిలుస్తుంది అనే సందేశాన్నికేంద్రం తెలంగాణ ప్రజలకు ఇచ్చినట్టు అయింది. ఇక నిన్నటికి నిన్న రీజనల్ రింగ్ రోడ్ దక్షి ణ భాగానికి పచ్చజెండా ఊపడం గొప్ప అయితే మరిన్ని ప్రాజెక్ట్ మిగిలిపోయి ఉన్నాయి. ఒకటి రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం, ఐటీ ఐఆర్ ప్రాజెక్ట్ కరీంనగర్ లో ఏఇ ట్రిబుల్‌ఈ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వవల్సి ఉంది.

-భారత అవినాష్, జనగామ

### చట్టపరమైన చర్యలు ఏవి?

పల్నాడు జిల్లాలో సరస్వతీ ఇండస్ట్రీస్ సంస్థ అటవీ శాఖ భూములను ఆక్రమించడం, దళితులకు ప్రభుత్వం ఇచ్చిన ఎస్సైన్డ్ భూములు కొనుగోలు చేయడాన్ని రెవెన్యూ శాఖ అధికారులు విచారించి ధృవీకరించారు.అలాగే కడప జిల్లాలో వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి అటవీ శాఖ భూములను ఆక్రమించినట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయి.ఇలాంటిచట్టవిరుద్ధమైన ఆక్రమణలపై అటవీ శాఖ మౌనం వహించడం ఆశ్చర్యంగాఉంది. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దీనిపై దృష్టి సారించాలి!

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

### నిర్విఘ్నంగా సాగుతున్న కుంభమేళా

జనవరి 13వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ లో ప్రారంభమైన మహా కుంభమేళా ఆద్యంతం ఆనందంగా ముగిసింది. దాదాపు కోటిన్నరపైగా భక్తులు, గంగా,యమునా, అంతర్వాహిని అయిన సరస్వతి త్రివేణి సంగమంలో అత్యంత చలిలో స్నానం చేయడం విశేషం.రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం, భక్తులు కూడా కట్టుబాట్లు పాటించడంవలన అంతటి జనసమోహంఉన్నా ఏప్రమాదం లేకుండా మొదటి రోజు నిర్విఘ్నంగా సాగిపోయింది.ఫిబ్రవరి 26 ఆఖరి రోజువరకు ఇలాగే కొనసాగితే అంతకన్నా కావాలసిందే మిటి? భక్తులు, దాతలవల్ల నాలుగు లక్షల కోట్లరూపాయల పైనే ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ మహా మేళా మరల నూట నలభై నాలుగు సంవత్సరాల తరువాత వస్తుందట.

-ఎన్. రామలక్ష్మి సికింద్రాబాద్

### పోలీసులకు బెదరింపులా!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ గాడిన పడుతున్నదని భావిస్తున్న తరుణంలో కొంతమంది ఎమ్మెల్యేలువారిపై బెదిరింపులకు దిగటం చూస్తున్నాం! అధికారపక్షానికి చెందిన గుడివాడ ఎమ్మెల్యే అనుచరులు ఏకంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులను గుడివాడ రండి,మీ అంతు చూస్తాం అనేవరకు వెళ్లారు! అదీ ఒక నిందితుడ్ని విచారిస్తున్న సమయంలో! సదరు ఎమ్మెల్యే ఇలా అరాచక శక్తులను చేరదీయడం,ప్రోత్సహించడం ఆశ్చర్యంగా ఉంది! అలాగే పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ విధి నిర్వహణలో ఉన్న డిఎస్‌పిని పిలిపించిమరీ బెదిరించారు! ఇలా పోలీసులను బెదిరించడం నేరం, ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయి?

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### మానవత్వం చూపుదాం

నేడు ఎందరో నిర్భాగ్యులు పట్టెడన్నం దొరకక ఆకలికి అలమటిస్తూ ధీనంగా రోడ్డు ప్రక్కన బ్రతుకుతున్నారు.మరికొందరు అనాథాశ్రయాలలో కాలం వెళ్లదీస్తున్నారు. కొందరు దాతలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు వారి ఆకలి తీరుస్తున్నారు.కానీ అది సరిపోవడంలేదు. మనం రోజు మనకోసం ఎంతోఖర్చుచేస్తాం. వాటిలో కొన్ని అనవసర ఖర్చులు ఉంటాయి. ఆ డబ్బులతో పేదవాళ్ల ఆకలి తీరిస్తే భగవంతుడు కూడా సంతోషిస్తాడు. కాబట్టి ప్రతిఒక్కరు తమకున్నంతలో ఇతరులకు సహాయపడాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భక్తినే కొలబద్దగా పరిగణించాలి!

**ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి ఇష్టాలు వారివి. కాలానుగుణంగా నిబంధనలు, పాత సాంప్రదాయాలను కాదని మార్చినా తప్పులేదు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగనంత వరకూ, భక్తికి ఏనిబంధన అడ్డురానంతవరకూ ఇలాంటి సున్నిత విషయాలలో జోక్యం ప్రభుత్వపరంగా బహు తక్కువగా ఉండటం సబబుగా ఉంటుంది. సంస్కార పూరితమైన సాంప్రదాయాలను కాదనకూడదు. మార్పును ప్రతిబింబించే నిబంధనలూ కాదనకూడదు. భక్తి ముఖ్యం. దేవాలయంలో శుచీ-శుభ్రత ముఖ్యం. భక్తుడు ఏకాగ్రత కోల్పోకుండా దేవుడిని కొలవటమే కొలబద్దగా గుర్తించాలి.**



రావులపాటి సీతారాంరావు

పవిత్రంగా దేవుడ్ని, దేవాలయాలలో ప్రార్థించటం ముఖ్యమా? ఆడా, మగా, ఆ మాట కొస్తే అందరు భక్తులు 'డ్రెస్ కోడ్' గుళ్లల్లో పాటించడం ముఖ్యమా అన్న అంశం ఈ మధ్యకాలంలో ప్రాధాన్యత సంతరించుకుంది. బళ్లల్లో 'డ్రెస్ కోడ్'ను ఆచరించటం చాలావరకు విధాయకంగా మారింది. అందరూ ముఖ్యంగా బాల్యంలో భేదభావాలు లేని విధంగా పెరగటం, చదువుకోవటం ముఖ్యమని ఆచరణలో ఆ సూత్రాన్ని పాటించడం తప్పు లేదు. కానీ గుళ్లకు 'డ్రెస్‌కోడ్' నియమం అవసరమా అన్నది లోతుగా విశ్లేషించటంలో తప్పులేదేమో అని అనిపిస్తున్నది. పూర్వకాలంలో మగవారు ధోతులూ, అంగవస్త్రాలను ధరించేవారు. మహా అయితే చొక్కాలు ఆచ్ఛాదన కోసం వేసుకొనేవారు. కాలక్రమేణా వస్త్రధారణలో మార్పులొచ్చాయి. మన దేశంలోనే అనేక ప్రాంతాలలో వస్త్రధారణ విభిన్న రీతులలో ఉండటం గమనిస్తూనేఉన్నాం.చలి విపరీతంగా ఉండే ఉత్తర దేశంలోని ప్రాంతాలలో గుళ్లల్లో పూజారులు పూర్తిగా శరీరమంతటా వస్త్రాలు ధరించే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్కడ పవిత్రతకూ, శుచికే, శుభ్రతకే ప్రాధాన్యం ఇస్తారు కానీ, కేవలం చొక్కాలూ లేకుండా, శరీరాలపైనా ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా దేవాలయాలు దర్శించాలనే నిబంధనలు అక్కడి వాతావర ణానికి అనుకూలం కాకపోవడంవల్ల పాటించడం లేదు. కానీ దక్షిణాదిన మాత్రం శుచీ, శుభ్రతతోపాటు వస్త్ర నియమాలు కొన్ని గుళ్లల్లో కఠినంగా అమలు చేస్తుండటం ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం. పోను పోను ఇదివరిటికంటే మరింత కఠినంగా నిబంధనలు మార్చి పవిత్రతకూ, ప్రార్థనకూ ఉండే ప్రాధాన్యతను గమనించని రీతిలో ఆచారాల పేరిట, సాంప్రదాయాల పేరిట కొన్ని దేవాలయాల్లో దర్శనాలు అనుమతిస్తుండటం కాలానుగుణ మార్పులను పరిగణనలోకి తీసుకోకపోవడం వల్లనే. ఈ సందర్భంగా మీడియాలో కూడా కొన్ని వార్తలు రావటం గమనార్హం.కేరళలోని శ్రీ నారాయణ ధర్మసంఘం ట్రస్ట్ అధిపతి స్వామి సచ్చితానంద కొన్ని వారాల క్రిందట గుళ్లల్లోకి మగవారు చొక్కాలు ధరించి దైవదర్శనాలు చేసుకోవడం కేరళలో అనుమతించాలని కోరారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఆయనను సపోర్ట్ చేశారు. ఈ ఆలోచన సహజంగానే కొంత వివాదానికి దారితీసింది. కొంతమంది కాలానుగుణంగా ఈ మార్పును దేవాలయాలల్లో అనుమతించాలని, మరికొందరు సాంప్రదాయ రీతిని కాదనకూడదని భిన్నాభిప్రాయాలు వెలువరించారు. 2017 సంవత్సరంలో కేరళ ప్రభుత్వం నాన్- బ్రాహ్మిన్ పూజారులను దేవాలయాలలో పూజలకు అనుమతినిచ్చింది. ప్రస్తుతం ఈ వస్త్రధారణ విషయంలో కేరళలో వివాదాలు మొదలయ్యాయి. కేరళలో కమ్యూనిస్టు సిద్ధాం తం ఎంత పటిష్టంగా ఉందో, అంత పటిష్టంగా సాంప్రదా యాలు పాటించాలనే పట్టింపు కూడా ఉండడం అక్కడి సమాజంలోని భిన్న ఆలోచనలకు అద్దం పడుతున్నది.అయితే కేరళలో దేవాలయాల్లో ఒకే తరహా పద్ధతిని పాటించని దాఖలాలు కూడా ఉన్నాయి. గురువాయూర్ విషయంలో ఆ విషయం స్పష్టపడుతూనే ఉంది. ఆడవారి వస్త్రధారణ విషయంలో 2013వరకూ కేవలం చీరెలు ధరించిన మహిళలనే దేవాలయంలోకి అనుమతించేవారు. తర్వాత సాల్వార్స్ వేసుకోవడం అనుమతించడానికి ప్రత్యేక కారణం ఉత్తరదేశంలోని ఆడవారు ఎక్కువగా ఆ డ్రెస్‌లు వాడటంవల్లనే. ఈ మధ్యన దక్షణాది ప్రాంతాలలో



ని కొన్ని దేవాలయాలలో ఈ డ్రెస్ నిబంధనలుకఠినతరంగా అమలు చేస్తున్నారు. భక్తిముఖ్యం, వస్త్రధారణకాదు, ప్రార్థన ముఖ్యం కాలంచెల్లిన సాంప్రదాయాలుకాదు. దేవునిముందు అందరూ సమానులే అందరికి ఆరాధనచేసే హక్కు ఉంటుంది. ఉండాలి. అంతేకాని ఇలాంటి విషయాలకు ప్రాధాన్యత నిస్తూ సమాజంలోని ఎక్కువ మందిని దేవాలయాలకూ, దేవుళ్లకూ దూరం చేయకూడదనే ఆలోచన ఈమధ్య దేశంలో బలం పుంజుకుంటున్నది. శుచీ,శుభ్రత లాంటి నియమాల ఆచరణకు ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు. పూర్వకాలంలో తడిబట్టలతో పూజలు చేసినా, దేవాలయాలను సందర్శించి నా, శుభ్రతను దృష్టిలో పెట్టుకొని ఆ కాలానికి తగ్గట్లు విధించిన నిబంధనలా భావించాలి గాని, సహేతుకత లేని ఏ నిబంధననూ ఈఆధునిక యుగంలో పాటించాలని పట్టుపట్టడం మూఢనమ్మకాలను ఆచరించడానికే అని అను కోకతప్పదు.చర్చిలలో ప్రార్థనలు జరిపేటప్పుడు పాదరక్షల విషయంలో నిబంధనలు లేవు. సిక్కు దేవాలయాలలో తలకు ఆచ్ఛాదన ప్రార్థన చేసేటప్పుడు పాటిస్తారు. అదే విధంగా నమాజ్ చేసేటప్పుడు ముస్లిం మతస్థులు తలమీద టోపీ లాంటిది ధరించి ప్రార్థనలలో పాల్గొనటం మనం గమనిస్తూనే ఉన్నాం. వారి ఆచార వ్యవహారాలనూ, సాంప్రదాయాలను అనుసరించి ఆ విధమైన పద్ధతులు, ఆ మతస్థులు ఎవరూ సహేతుక కారణాలతో అభ్యంతరం పెట్టనంతవరకూ ఎవరికి ఎందుకు అభ్యంతరం ఉండాలి? అదే విధంగా సనాతన సాంప్రదాయాలు, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా భక్తిని మరింత పెంచేవిధంగా ఉన్నంతవరకూ సనాతన భావాలు అంటూ చీటికిమాటికి విజ్ఞత లోపించిన వారు తప్పుపట్టడం అవివేకం. మూర్ఖత్వం అని భావించక తప్పదు. ఎవరి మతం వారిది. ఎవరి నిబంధనలు వారివి. అన్యమత ద్వేషంతో, లౌకిక రాజ్యాంగాన్ని ఆమోదించిన మనదేశంలో అకారణంగా ఆచార సంపదను తక్కువ చేయడం ఎవరూ హర్షించరు. అంతర్లీనంగా దేవాలయాలకు సంబంధించిన ఇలాంటి విభేదాలు ఇతర రాష్ట్రాలలో అంతగా బయటకు రావు. కానీ కేరళలో మొదటి నుంచీ లిట్రసీరేట్ ఎక్కువగా ఉండటం వల్లనోఏమో సమాజపరంగా ఉన్న సమస్యలు బాహాటంగానే చర్చించుకొనే సత్సాంప్రదాయం ఉండటంవల్ల ఇట్టే బయటపడతాయి. నంబూద్రీపాద్‌బ్రాహ్మణుడైనా, కమ్యూనిస్టు సిద్ధాంతాలను కాచి వడబోసి ముఖ్యమంత్రిస్థానంలోకి వెళ్లిన వాడవటంచేత తన కులాన్ని ఎన్నడూ వెనకేసుకొని రాలేదు. అట్టడుగు వర్గాల వారికే ఆయన అధికారంలో ఉన్నంతవరకూ అండగాఉన్నారనే పేరు సంపాదించుకున్నారు. కేరళలోని సాంప్రదాయ వాదులూ వారి వాదాన్ని వదులుకోలేదు. అగ్రవర్ణాలకు చెందినవారు ఇలాంటి విషయాలల్లో వెనక్కు తగ్గిన దాఖలాలులేవు. ఉదాహరణకు సుగిన్ జి.నాయర్ అనే ఆయన ఎర్నా కులంలోని శివుని దేవాలయం నుంచి ప్రార్థనలు చేస్తూ బయటకు వచ్చినప్పుడు ఒక మాట ఈ వస్త్రధారణ విషయంలో మీడియా వారు అడిగితే చెప్పారట! 'నేను ఎన్నో ఏళ్లనుంచి పై శరీరం మీద వస్త్రం లేకుండా దేవాలయంలో పూజ చేసుకోవడానికి అలవాటుపడ్డాను. నిబంధనలు మార్చి నన్ను షర్టుతో దేవాలయంలోకి అనుమతించినా, నా పద్ధతే నేను పాటిస్తాను. షర్టులేకుండా గర్భగుడి ప్రవేశ ద్వారం దగ్గర భక్తితో ప్రార్థన చేయడం నాకు ఇష్టం. అదే చేస్తాను. రూల్స్ మారినంత మాత్రాన నేను షర్టుతోనే భగవంతుడ్ని ప్రార్థించాలని నన్ను ఎవరూ బలవంతపెట్టలేదు గదా! అని తాపీగా భుజం మీద ఉన్న షర్టును ఆలయం బయట వేసుకొని తాపీగా ఏవో శ్లోకాలు చదువుకుంటూ వెళ్లిపోయారట. ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి ఇష్టాలు వారివి. కాలానుగుణంగా నిబంధనలు, పాత సాంప్రదాయాలను కాదని మార్చినా తప్పులేదు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగనంతవరకూ, భక్తికి ఏనిబంధన అడ్డురానంతవరకూ ఇలాంటి సున్నిత విషయాలలో జోక్యం ప్రభుత్వపరంగా బహు తక్కువగా ఉండటం సబబుగా ఉంటుంది. సంస్కార పూరితమైన సాంప్రదాయాలను కాదనకూడదు. మార్పును ప్రతిబింబించే నిబంధనలూ కాదనకూడదు. భక్తి ముఖ్యం. దేవాలయంలో శుచీ-శుభ్రత ముఖ్యం. భక్తుడు ఏకాగ్రత కోల్పోకుండా దేవుడిని కొలవటమే కొలబద్దగా గుర్తించాలి. ●

# జమిలి ఎన్నికలు సాధ్యమేనా?

డాక్టర్ మోటె చిరంజీవి

దేశంలో జమిలీ ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది.'వన్ నేషన్ వన్ ఎలక్షన్' బిల్లు త్వరలోనే పార్లమెంట్‌లో ముందుకు రానుంది. దీనికి సంబంధించి రాజ్యాంగంలోని 129వ సవరణ బిల్లు సైతం ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు సన్నద్ధమవుతోంది. పార్లమెంట్ నుండి పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి.తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు, అవిపూర్తైన వంద రోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీని కోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు అంటే వన్ నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు, మిగిలిన ఐదేళ్లు పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. గతంలో జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదించడంతో ఇక రెండు ప్రక్రియలు మిగిలున్నాయి. ఈ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి. ఈ శీతాకాల సమావేశాల్లోనే ఈబిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. బిల్లు అమల్లోకి రావాలంటే రాజ్యాంగంలోని ఆరు ఆర్టికల్స్ సవరణ చేయాల్సి ఉంది. రాజ్యాంగ సవరణలు చుసినట్లయితే లోక్‌సభ, రాజ్యసభ కాలపరిమితి చెందిన ఆర్టికల్ 83, రాష్ట్రాల అసెంబ్లీకు ఐదేళ్లగడువుని నిర్దేశించే ఆర్టికల్ 172(1)సవరణ. ఎమర్జెన్సీ పరిస్థితులొస్తే సభ కాలపరిమితిని ఏడాది దాటకుంటా వీలు కల్పించే ఆర్టికల్ 83(2) సవరణ.లోక్‌సభను




రద్దు చేసేలా రాష్ట్రపతికి అధికారాలిచ్చే ఆర్టికల్ 85(2) సవరణ. రాష్ట్రాల అసెంబ్లీ రద్దు అధికారాన్ని గవర్నర్‌కుఇచ్చే ఆర్టికల్ 174(2) సవరణ. రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలనకువీలు కల్పించే ఆర్టికల్ 356సవరణ ఇలా కొన్ని ఉన్నాయి. ఎన్నికల కమీషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 324సవరణచేశారు. దేశంలో ఇప్పటి వరకూ అంటే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1957, 1962, 1967లో ఒకేసారి ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత పరిస్థితులుమారి అడపా దడపా జరుగుతున్నాయి. జమిలి ఎన్నికల ప్రతిపాదన తొలిసారిగా 1980లో వచ్చింది. ఆ తరువాత 1999లో లా కమీషన్ కూడా జమిలి ఎన్నికలకు ఒకే చెప్పింది. పార్లమెంట్‌లోబిల్లు ఆమోదం పొందడంతో పాటు ఆరు ఆర్టికల్స్ సవరించాల్సి ఉంది. ఆ తరువాత సగం రాష్ట్రాలు ఒకే చెప్పాల్సి ఉంది. అన్నీ అనుకూలిస్తే 2027లో జమిలి ఎన్నికలు నిర్వహించాలనేది కేంద్రం ఆలోచనగా ఉంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. గతంలో జరిగిన, ఆ తర్వాత వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952 లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు,రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసన సభలను బర్తరఫ్ చేయడం, తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుగుతున్నాయి. జమిలి ఎన్నికలు జరుగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజాప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ తాజా నివేదికలో స్పష్టం చేసింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబం ధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ●

# తిరుపతి తొక్కిసలాటలో తప్పెవరిది?

ఎం కె కుమార్

తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకెన్ల జారీ సమయంలో చోటుచేసుకున్న తొక్కిసలాట భక్తుల హృదయాలను కలచివేసింది. ఈ ఘటనకు పలు కారణాలు ఉన్నప్పటికీ, ముఖ్యంగా భక్తుల నియంత్రణలోపం, భద్రతా చర్యలలోపం, భారీ భక్తులరద్దీ, టోకెన్ల జారీ ప్రక్రియలో పొరపాట్లు, గేట్ల అకస్మాత్తుగా తెరవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. క్యూలైన్లలో ఉన్న భక్తులను ఒకేసారి పెద్దసంఖ్యలో విడుదల చేయడం గందరగోళానికి దారితీసింది. భద్రతా సిబ్బంది తక్కువగా ఉండటం, భక్తులకు తగిన మార్గదర్శనం అందించకపోవడం పరిస్థితిని మరింత వేగంగా విషమం చేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఏర్పాట్లు తక్కువయ్యాయి. టోకెన్ల జారీని తిరుపతిలోనే పరిమితం చేయడం వల్ల గందరగోళం మరింత పెరిగింది. పోలీసు అధికారి గేట్లను అనాలోచితంగా తెరవడంవల్ల ఈ సంఘటన చోటుచేసుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ విషాదానికి స్పందనగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిలు బాధితులను పరామర్శించారు. అయితే, ఈ ఘటన రాజకీయ విమర్శలకు వేదికగా మారింది. విపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపగా, అధికార పక్షం బాధ్యత తీసుకున్నట్లు ప్రకటించింది. టోకెన్ల కోసం భక్తులు పెద్ద సంఖ్యలో గేటు వద్ద గుమికూడడంతో తొక్కిసలాట జరిగింది. సాక్షుల కథనాల ప్రకారం, భక్తులు వెనుక నుంచి బలవంతంగా ముందుకు తోసుకోవడం వల్ల పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. భాషా అడ్డంకులు కూడా కీలక పాత్ర పోషించాయి, ఎందుకంటే తమిళం, కన్నడ మాట్లాడే భక్తులు, పోలీసుల సూచనలు అర్థం చేసుకోలేకపోయారు. పోలీసులు మైక్ ద్వారా భక్తులను వెనక్కి జరగమని పలుమార్లు హెచ్చరించినా, వారు వినిపించుకోలేదు. మధ్యాహ్నం నుంచే భక్తుల రాక పెరిగిపోవడంతో గేటు ముందు భారీ గుంపు ఏర్పడింది. అయితే వెనుక భాగం ఖాళీగానే ఉండిపోయింది. గేట్లు తెరవకముందే భక్తులు ముందుకు దూసుకురావడం వల్ల పరిస్థితి అదుపు తప్పింది. ఈ గందరగోళంలో భక్తులు కిందపడిపోయి ఊపిరాడక మృతి చెందిన ఘటన తీవ్ర విషాదకరంగా మారింది. సమన్వయం లోపం, నిర్వాహకుల తగిన జాగ్రత్తలేని నిర్వహణ ఈ ఘోరానికి దారితీశాయి. ఈ సంఘటన తర్వాత తిరుమలలో రాజకీయ పోరాటాలు, అధికారి విభేదాలు, సమన్వయ లోపాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా టీటీడీ ఛైర్మన్, ఈవో మధ్య జరిగిన వివాదం అధికార వ్యవస్థలో విభేధాల తీవ్రతను చూపించింది. తిరుమలలో ఉన్నత పదవులపై అధికారుల మధ్య ఆధిపత్య పోరు భక్తులకు సౌకర్యాల క్రమం తప్పడానికీ, దేవుడి సేవలో గౌరవాన్ని తగ్గించడానికీ దారితీస్తోంది. ఈ పరిణామాలు కేవలం భక్తి కోసం వచ్చిన భక్తుల జీవితాలకు ముప్పుగా మారడమే కాకుండా, తిరుపతి చరిత్రలో ఈ సంఘటనచెడు గుర్తింపును తీసుకొచ్చింది. దీనిని దృష్టిలో ఉంచుకొని పాలకులు, అధికారులు వారి ధర్మబద్ధమైన విధులను సమర్థంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. టీటీడీ పాలక మండలి, అధికారుల మధ్య నెలకొన్న విభేదాలు తొలగించడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో సమన్వయాన్ని పెంపొందించడం కీలకంగా మారింది. వైకుంఠ ఏకాదశి రోజున జరిగిన ప్రమాదం విధ్వంసానికి కారణమైన లోపాలను గుర్తించి, బాధ్యత వహించాల్సిన వారు బాధ్యత స్వీకరించాలి. మృతుల కుటుంబసభ్యులు తీవ్ర శోకంలో మునిగిపోగా, గాయపడిన భక్తులు స్విమ్స్ ఆసుపత్రి, పద్మావతి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ప్రకటించినా, ఆ ప్రాణనష్టాన్ని పూడ్చలేకపోవడం బాధాకరం. ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ప్రభుత్వం వెల్లడించింది. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాల కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో, 90 కౌంటర్లను తొమ్మిది ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. మంగాపురం వంటి ఇతర ప్రాంతాల్లో టోకెన్లు జారీ చేయకపోవడం వల్ల తిరుపతిలో భక్తుల రద్దీ భారీగా పెరిగిందని పలువురు భక్తులు తెలిపారు. పురుషులు, మహిళలు, చిన్నపిల్లలు ఉన్నారని కూడా చూడకుండా, కొందరు భక్తులు బలవంతంగా ముందుకు దూసుకువెళ్లారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచే టోకెన్ల కోసం భారీగా భక్తులు కేంద్రాలవద్ద గుమికూడగా, రాత్రి 8గంటల వరకు ఒత్తిడి తారాస్థాయికి చేరింది. రాత్రి 9గంటల నుండి క్యూలైన్లలో ప్రవేశం ప్రారంభించడంతో, బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాలవద్ద తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. ఈఘటన భక్తుల భద్రతాపరమైన ఏర్పాట్లలో లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. భక్తులు, బాధితుల కుటుంబాలు ఈ విషాదానికి కారణమైన నిర్వాకంపై తీవ్రఆవేదనవ్యక్తం చేస్తున్నారు.తిరుపతిలో జరిగిన తొక్కిసలాట వంటి దుర్ఘటనలు భక్తులభద్రతను సవాలుగా నిలిపాయి.ఈ సమస్యల పరిష్కారానికి కొన్నిమార్గాలను సూచించడం అవసరం.టోకెన్ల జారీ పద్ధతిలో మార్పులు ముఖ్యమైనవి.భక్తులు ఆన్ లైన్‌లోనే టోకెన్లుపొందే విధానం అమలుచేస్తే కౌంటర్ల వద్దగుమికూడే పరిస్థితి తగ్గుతుంది. జాబితా ప్రకారం సమయ స్లాట్లు కేటాయించడం, ప్రత్యేకమైన అవసరాలు ఉన్నవారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం ప్రయోజనకరం. ప్రత్యక్ష కౌంటర్ల సంఖ్యను పెంచి, చుట్టుపక్కల ప్రాంతాల్లో వాటిని విస్తరించడమూ ఆవశ్యకం. టోకెన్ల సమయ నియంత్రణ ద్వారా భారీ సంఖ్యలో భక్తులను ఒకేసారి అనుమతించడం తగ్గించి, నియంత్రణతో దర్శనం అనుమతించవచ్చు. భద్రతా చర్యల్లో పోలీసుల సంఖ్యను పెంచి, క్యూలైన్‌లను సులభంగా నియంత్రించగల విధానా లు తీసుకోవాలి. ఎమర్జెన్సీ పరిస్థితుల కోసం మెడికల్ టీమ్స్‌ను సిద్ధంగా ఉంచడం కూడా కీలకం. సమాచార వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల భక్తులకు అవగాహన పెరుగుతుంది. స్పీకర్ల ద్వారా దిశానిర్దేశం చేసి గేట్లు తెరవడం లేదా క్యూలైన్ నియమాలు స్పష్టంగా తెలియజేయ వచ్చు. ప్రవాహ నియంత్రణలో భాగంగా, చిన్నచిన్న సమూహాలను మాత్రమే క్రమపద్ధతిలో అనుమతిస్తే, తొక్కిసలాట ముప్పు తక్కువ అవుతుంది. సంక్షిప్తంగా, భక్తుల సంఖ్య తగ్గించే ప్రయత్నాలు, భద్రతా సిబ్బంది మెరుగుదల, సాంకేతిక పరిష్కారాలు, స్పష్టమైన సమాచార మార్గాలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నియంత్రించవచ్చు. ●

# 111 మంది రైతుల ఆమరణ దీక్ష



## 101 మంది రైతుల ఢిల్లీ ఛలోమార్చ్

**ఛండీఘర్, జనవరి 16:** రైతు సమస్యలపై కేంద్రం ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టినరైతునేత జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా హర్యానా సరిహద్దు ఖనౌరీలో 111 మందిరైతులు నిరవదిక దీక్షను చేపట్టిన సంగతి తెలిసిందే.మరోవైపు జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్ దీక్షను విరమింపచేసేందుకు కేంద్రం రైతులకిచ్చిన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ మరో 101 మంది రైతులు ఢిల్లీకి శంభు సరిహద్దుల మీదుగా మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 21వ తేదీ శంభు సరిహద్దునుంచి ఈ ర్యాలీ జరుగుతుంది, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకే ఈ ర్యాలీచేస్తున్నట్లు రైతులు తెలిపారు. కనీస మద్దతుధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకుడు కోఆర్డినేటర్ సర్వన్‌సింగ్ పాంధేర్ మాట్లాడుతూ 101 మంది రైతులు గతంలోమూడు పర్యాయాలు ఢిల్లీకి మార్చి నిర్వహించేందుకు సిద్ధం అయ్యారని డిసెంబరు ఆరు, ఎనిమిది, 14వ తేదీల్లో శంభు సరిహద్దునుంచి ఈ ర్యాలీ తీయాలని నిర్ణయించారని, అయితే హర్యానా పోలీసులు ఈర్యాలీని భగ్నం చేసారన్నారు. రైతుల డిమాండ్లను అంగీకరించకపోగా కేంద్రం కావాలనే తిరస్కరిస్తోందని, నిరంతర నిరసన ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఎస్‌కెఎం, కెఎంఎంలు రెండూ కూడా 101 మంది రైతులతో మార్చ్‌ను ఈ నెల 21వ తేదీ నిర్వహించాలని నిర్ణయించాయన్నారు. ప్రభుత్వం డిమాండ్లను పెడచెవిన పెడుతోందని చర్చలు జరిపేందుకు కూడా సిద్ధంగా లేదని ఆయన ఆరోపించారు. అందువల్లనే రెండు రైతు వేదికలుకూడా తమ నిరవధిక ఆందోళనను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీనే 111 మంది రైతులు ఆమరణదీక్షకు పూనుకున్నారు. తమ రైతునేత దల్లేవాల్‌కు మద్దతుగా ఈ దీక్షలుచేస్తున్నట్లు తెలిపారు. రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక దీక్ష గత ఏడాది నవంబరు 26వ తేదీ ఖనౌరి సరిహద్దు వద్ద ఆమరణదీక్షకు పూనుకున్నారు. నేటికి 52 రోజులుగా ఆయన దీక్షలోనే కొనసాగుతున్నారు. ఇదే దీక్షను కొనసాగిస్తే ఆయన కీలక అవయవాలు దెబ్బతినేప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించినా ఆయన పెడచెవిన పెడుతున్నారు. దీనితో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 పరిధిలో హర్యానా పోలీసులు నిషేధాంక్షలు ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 13వ తేదీనుంచి రైతులు పంజాబ్ హర్యానా సరిహద్దుల్లో దీక్షలుచేస్తున్న సంగతి తెలిసిందే. ఢిల్లీకి మార్చ్ చేయాలని నిర్ణయించినా పోలీసులు భగ్నంచేసారు. తమ పంటలకు గిట్టుబాటుధరలు లభించాలని, అలాగే కనీసమద్దతుధరలను చట్టబద్ధంచేయాలని కోరుతున్న సంగతి తెలిసిందే.



# దేశ చరిత్రను వక్రీకరిస్తున్న ఆర్ఎస్ఎస్

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ధ్వజం

**కోల్‌కత్తా, జనవరి 16:** అయోధ్యలో రామ మందిరం ప్రతిష్టాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇటీవలచేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ దేశచరిత్రను వక్రీకరించడానికి ఆర్ఎస్ఎస్ పన్నుతున్న పథకమని విమర్శించారు. భగవత్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నానని అవిభారత దేశ చరిత్రకు వ్యతిరేకమైనవని ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక అసంబద్ధమైన వ్యాఖ్యలతో దేశ చరిత్రను వక్రీకరించే ప్రయత్నంచేస్తున్నారు. దేశాన్ని మతం ఆధారంగా విభజించాలని చూస్తే మేం ఊరుకోమని దేశం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని మమతా అన్నారు.

ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్‌బాగెల్ మాట్లాడుతూ భగవత్ తన వ్యాఖ్యల ద్వారా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అసంఖ్యాక త్యాగాలుచేసిన వారిని అవమానించారని దుయ్యబట్టారు. ఆయన ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను బిజెపి తప్పుగా వక్రీకరించి ప్రచారంచేస్తోందని విమర్శించారు. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రామమందిరప్రతిష్టాపన రోజునే వచ్చిందని ఇటీవల ఆర్ఎస్ఎస్ చీఫ్‌మోహన్ భగవత్‌చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు.



# బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

## ప్రాణాపాయం లేదన్న వైద్యులు

**ముంబయి, జనవరి 16:** బాలివుడ్ చిత్రపరిశ్రమ ఒక్కసారిగా ఖంగుతిన్నది. ప్రముఖనటుడు సైఫ్ ఆలీఖాన్‌పై చోరీకి వచ్చిన నిందితుడు కత్తిపోట్లకు గురిచేసాడన్న అంశం బాలివుడ్ మొత్తం తెల్లారేసరికి పాకిపోయింది. ముంబయిలోని బాంద్రాలో సైఫ్ ఆలీఖాన్ నివాసంలోనే గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ హీరోపై దాడిజరిగింది. సైఫ్ ఆతడి కుటుంబసభ్యులు మంచి నిద్రలో ఉండగా మెట్లమార్గం గుండా ఇంట్లోకి ప్రవేశించిన ఒక దుండగుడిని గుర్తించి సైఫ్ రెండో కుమారుడు జేహ్ కేర్‌టేకర్ అరుపులు కేకలు వేయడంతో సైఫ్ వెంటనే మేలుకొని వచ్చాడు. దుండగుడిని ప్రతిఘటించిన సైఫ్‌పై ఈ దుండగుడు తనవద్ద ఉన్న కత్తితో ఆరుసార్లు పొడిచాడు. ఈక్రమంలోనే సైఫ్ వెన్నుముకలో దుండగుడి కత్తిమొన అలాగే ఉండిపోయిందని వైద్యులు సైతం తెలిపారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి మొత్తం వివరాలను సేకరించారు. పక్కింటి సిసి ఫుటేజిని పరిశీలించినపోలీసులు ఒక ఆగంతకుడు మెట్లు దిగి వెళుతున్నట్లు గుర్తించారు. మెట్లమార్గంతోనే దుండగుడు ప్రవేశించి తిరిగి అలాగే పరారయినట్లు కూడా పోలీసులు గుర్తించారు.

ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి తక్షణమే గాలింపు చర్యలుచేపట్టారు. కాగా అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో వినియోగించే మెట్ల మార్గంలోనే దొంగ సైఫ్ ఇంట్లోకి ప్రవేశించాడని తేలింది. అయితే నిందితుడు దొంగతనం కోసమే వచ్చినట్లు భావిస్తున్నామని ఇప్పటికే నిందితుడిని గుర్తించారని, పదిబృందాలు ఈకేసు దర్యాప్తుకోసం పనిచేస్తునానయని స్థానిక డిసిపి దీక్షిత్ గేడమ్ పేర్కొన్నారు. సైఫ్ కుటుంబంలో పనిచేసేఐదుగురు సిబ్బందిని ప్రశ్నించారు. నటుడుఉండే హౌసింగ్ సొసైటీలో కొన్ని ఇళ్లకు మరమ్మతులు జరుగుతున్నాయి. దీనితో బయటనుంచి పనివారు వచ్చిపోతున్నారు. కాగా ఆరు కత్తిగాయాలు తగలిన సైఫ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు కార్లు సిద్ధంగా లేకపోవడంతో పెద్దకుమారుడు ఇబ్రహీం ఆలీఖాన్ ఆటోలో ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. లీలావతి ఆసుపత్రిలోచేరిన సైఫ్‌కు వైద్యులు వెన్నెముకలో దిగబడిన 2.5 అంగుళాల కత్తిముక్కను వెలికితీసి శస్త్రచికిత్స చేసి ద్రవాలు లీక్ కాకుండా కట్టడిచేసారు. అలాగే మణికట్టు ఇతర భాగాల్లో జరిగిన గాయాలకు కాస్మెటిక్ సర్జరీచేసి అప్పటికప్పుడు తక్షణ చికిత్సలుచేసారు.

అక్కడి ఇళ్లల్లో ఫ్లోర్ పాలిషింగ్‌చేసే కార్మికులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా సైఫ్ ఆలీఖాన్‌పై దాడి బిష్ణోయ్ గ్యాంగ్‌పనే అంటూ వస్తున్న వార్తలను పోలీసులు ఖండించారు. ఈ దాడికి బిష్ణోయ్ గ్యాంగ్‌కు ఎలాంటిసంబంధం లేదని తేల్చిచెప్పారు. నిందితుడు కేవలం సొమ్ములకోసమే ఇంటికి వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. సిసిటివి ఫుటేజి ఆధారంగా నిందితుడి ఫోటోను కూడా విడుదలచేసారు.

కాగా బాలివుడ్ చిత్రపరిశ్రమలోని సీనియర్ నటుడిపై జరిగిన దాడి ఇపుడు రాజకీయ రంగుపులుముకుంది. సాక్షాత్తూ సంపన్నవర్గంలోని ప్రముఖ నటుడికే భద్రత కరువైతే ముంబయిలో సామాన్యమద్యతరగతిప్రజల సంగతేమిటంటూ థాకరే శివసేన, ఆమ్ ఆద్మీపార్టీ కాంగ్రెస్‌లు బిజెపిపై దుమ్మెత్తిపోస్తున్నాయి. దీనిపై ముఖ్యమంత్రి ఫడ్నవిస్ స్వయంగా రంగంలోకి దిగి కౌంటర్లు ఇస్తుండటం గమనార్హం. యాక్టర్‌పై దాడిని శాంతిభద్రతల సమస్యకు ముడిపెట్టవద్దంటూ ఆయన హితవు పలికారు.

# హిండెన్‌బర్గ్ రిసెర్చి సంస్థకు మూత!

## కార్యకలాపాలు విరమిస్తున్నట్లు ప్రకటించిన నాథన్ ఆండర్సన్



**న్యూఢిల్లీ, జనవరి 16:** హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ. ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక ఏ స్థాయిలో ప్రకంపనల్ని సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దేశ కార్పొరేట్ వర్గాల నుంచి రాజకీయ రంగం దాకా ఈ అంశం కుదిపేసిన విషయం తెలిసిందే. ఆ సంస్థ ఇచ్చిన రిపోర్ట్ దెబ్బకి అదానీ షేర్లు కుదేలయ్యాయి. ఈ సంస్థ రిపోర్ట్ భారత స్టాక్ మార్కెట్లనుకూడా వణికించింది. అయితే తాజాగా ఈ సంస్థ సంచలన నిర్ణయం ప్రకటించింది. కంపెనీ కార్యకలాపాలను మూసివేస్తున్నట్లు సంస్థవ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ తాజాగా ప్రకటించారు. సంస్థ మూసివేత గురించి కొంత కాలంగా తన ఆత్మీయులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులతో చర్చించినట్లు చెప్పారు. అనేక చర్చల అనంతరం సంస్థను మూసివేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూసివేత వెనుక ఎలాంటి బెదిరింపులు, భయాలు, ఆరోగ్య కారణాలు, వ్యక్తిగత అంశాలూ లేవని స్పష్టం చేశారు. తమ ప్రణాళికలు, ఐడియాలు ముగియడంతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్లు వివరించారు.

హిండెన్‌బర్గ్ నా జీవితంలో ఓ అధ్యాయం మాత్రమే. సంస్థ స్థాపించినప్పుడు నన్ను నేను నిరూపించుకునేందుకు ఎంతో కష్టపడేవాడిని. అయితే ఇప్పుడు నేను కంఫర్ట్‌జోన్‌లో ఉన్నానని అనిపిస్తోంది. ఈ సంస్థ వల్ల ఎంతో సాహసం చేశాను. ఎన్నో ఇబ్బందులు, సవాళ్లు, ఒత్తిళ్లను ఎదుర్కొన్నా. అయినప్పటికీ ఎంతో ఉత్సాహంగా పనిచేశా. ఇదంతా నాకో ప్రేమకథలా అనిపిస్తోంది. ఇకపై నా భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి పెడతాను అని నాథన్ అండర్సన్ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

అదానీ గ్రూప్‌పై 106 పేజీల రిపోర్ట్‌నురిలీజ్ చేసింది. అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడుతున్నదని, స్టాక్ మార్కెట్లలో గ్రూప్ కంపెనీల షేర్ల విలువ పెరిగేలా అక్రమాలకు దిగుతున్నదని సంచలన ఆరోపణలు చేసింది. దీంతో అదానీగ్రూప్ మార్కెట్ విలువ ఏకంగా రూ.12 లక్షల కోట్లు హరించుకుపోయింది. అదానీ సంస్థల్లో ఆయా కంపెనీల పెట్టుబడులు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసి కొన్న వాటాలపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. చివరకు అదానీ వ్యాపార విస్తరణకు కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ సహకరించిందని, దీనిపై లోతుగా దర్యాప్తు జరగాలని పార్లమెంట్‌లో విపక్షాలన్నీ పట్టుబట్టింది తెలిసిందే.

# కాశ్మీర్‌లో అంతుచిక్కని మరణాలు



## నెలన్నర వ్యవధిలో 15 మంది మృతి!

**శ్రీనగర్, జనవరి 16:** జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీని అంతుచిక్కని మరణాలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని బుధాల్ గ్రామంలో గడిచిన నెలన్నర వ్యవధిలో అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 15కు చేరుకుంది. మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. అయితే ఈ మరణాలకు బ్యాక్టీరియా లేదా వైరస్ కారక సాంక్రమిక వ్యాధులు కారణం కాదని ప్రాథమికంగా తేలినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఇక్కడి పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం దర్యాప్తు కోసం 11 మందితో ప్రత్యేకబృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో గత డిసెంబర్ 7న సహపంక్తి భోజనం నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఇక్కడ భోజనం చేసిన అనంతరం అస్వస్థతకు గురికాగా వారిలో అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. డిసెంబర్ 12న మరో కార్యక్రమంలో విందు ఆరగించిన మరో కుటుంబంలోని తొమ్మిదిమంది అనారోగ్యం బారినపడ్డారు. అందులో ముగ్గురు చనిపోయారు. జనవరి మూడోఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబంలోని పదిమంది తీవ్ర అస్వస్థతకు గురికాగా ఆరుగురు చిన్నారులే. వీరిలో ఓ పదేళ్ల బాలిక చనిపోగా 15 ఏళ్ల అబ్బాయి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇలా గడిచిన నెలన్నర వ్యవధిలోనే మొత్తంగా 15 మంది చనిపోవడం ఆ గ్రామంలో భయాందోళనలకు కారణమైంది. ఈ అంతుచిక్కని మరణాలకు గల కారణాలను గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ముమ్మర ప్రయత్నాలు చేసింది. బాధితుల నుంచి నమూనాలను సేకరించి దేశవ్యాప్తంగా ఉన్న అత్యున్నత ల్యాబ్‌లకు పంపించింది. ఎన్ఐవి, ఎన్‌సిడిసి, ఎన్ఐటిఆర్, డిఆర్‌డిఇతో పాటు చండీగఢ్, జమ్మూలలో ఉన్న పరిశోధక ల్యాబ్‌లలో పరీక్షించినప్పటికీ వైరస్ లేదా బ్యాక్టీరియా కారకాలు లేవని తేలింది. ఐఐటిఆర్ నిర్వహించిన విశ్లేషణలో మాత్రం ఆ నమూనాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు గుర్తించింది. దీంతో మరింత అప్రమత్తమైన ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని వివిధ శాఖలను ఆదేశించింది. తొలి ఘటన వెలుగు చూసిన మరుసటి రోజే అక్కడి ఆహార, నీటి నమూనాలను సేకరించేందుకు వైద్య బృందాన్ని రంగంలోకి దింపినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. సీనియర్ వైద్యులు, పరిశోధకులు తాజా పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపింది. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన చర్యలన్నీ తీసుకుంటోందని జమ్మూ కశ్మీర్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సకీనా ఇటూ పేర్కొన్నారు.

# ఎన్నికల్లో కృత్రిమ మేధ వినియోగంపై ఇసి నజర్

**న్యూఢిల్లీ, జనవరి 16:** అన్నిరంగాల్లోను కృత్రిమమేధ వినియోగం భారీ ఎత్తున పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఇపుడు ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో కూడా ఆయా పార్టీలు దీన్ని వినియోగిస్తున్నాయి. కొన్నిపర్యాయాలు పార్టీలు సృష్టించే తప్పుడు కంటెంట్ ఓటర్ల అభిప్రాయాలను మార్చే అవకాశం ఉన్నందున ఎన్నికల కమిషన్ అప్రమత్తం అయింది. ఈ క్రమంలోనే అన్ని పార్టీలకు సూచనలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఎఐని వినియోగిస్తున్న పార్టీలు వారు సృష్టించే కంటెంట్ పారదర్శకంగా ఉండాలని ఇసి సూచించింది. అభ్యర్థులు వాటిపై జవాబుదారీతనంతో వ్యవహరించాలని అడ్వయిజరీలో పేర్కొంది. ఈ టెక్నాలజీ ద్వారా క్రియేట్‌చేసిన ఆడియో, విడియోలు చిత్రాలపై ఎఐ జనరేటెడ్, సింథటిక్ కంటెంట్ వంటి సంకేతాల లేబుళ్లు ఉండాలి. ప్రచార ప్రకటనలను వ్యాప్తిచేసే సమయంలో సింథటిక్ కంటెంట్ వినియోగించినా దానికి డిస్‌క్లెయిమర్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీలు ఎఐని వినియోగిస్తున్నాయి. దీనితో నకిలీ కంటెంట్ ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలవేళ బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు కీలక నిర్ణయం తీసుకున్న ఈసీ కొత్త నిబంధనలతో అడ్వయిజరీ జారీచేసింది. అయితే సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లు వేదికగా నైతికత బాధ్యతాయుతంగా నడుచుకోవాలని గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ఇసి మార్గదర్శకాలు జారీచేసింది.

# ట్రంప్ బెదరింపులపై ఎదురుదాడికి కెనడా పిఎం యత్నం



**ఒట్టావా, జనవరి 16:** భరించలేని స్థాయిలో టారిఫ్‌లు విధిస్తానని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదరిస్తున్న నేపథ్యంలో కెనడా ప్రధాని ట్రూడో మరోసారి స్పందించారు. తాము వాణిజ్య యుద్ధాన్ని కోరుకోవడం లేదని.. అవసరమైతే మాత్రం దానికి ప్రతిస్పందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. దేశ రాజధానిలో ఆయన ప్రావిన్షియల్, టెరిటోరియల్ నాయకులతో సమావేశమై అమెరికా నుంచి పొంచి ఉన్న టారిఫ్‌ల ముప్పుపై చర్చించారు. ప్రతిస్పందన విషయంలో ఉన్న ప్రతి అవకాశాన్ని చర్చించినట్లు ట్రూడో పేర్కొన్నారు. దీని వల్ల వచ్చే భారాన్ని కెనడాలోని అన్ని ప్రాంతాలు సమానంగా పంచుకోవాలని.. ఏదో ఒక ప్రాంతంపై మాత్రమే మోపకూడదని నిర్ణయించుకొన్నట్లు చెప్పారు. అమెరికా నుంచి జరిగే దిగుమతి చేసుకొనే స్టీల్, గాజు ఉత్పత్తులపై, ఫ్లోరిడా ఆరెంజ్ జ్యూస్‌పైనా టారీఫ్‌లు విధించాలని నిర్ణయించారు. మరోవైపు అల్బార్టా ప్రావిన్స్ ప్రీమియర్ డేనియల్ స్మిత్ స్పందిస్తూ.. అమెరికాకు చమురు, విద్యుత్తు ఉత్పత్తి తగ్గిపోతే ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కెనడాలోని ఆ ప్రావిన్స్ నుంచే అత్యధికంగా చమురు అమెరికాకు ఎగుమతి అవుతుంది. కానీ, ఒంటారియో ప్రీమియర్ మాత్రం దేశం మొత్తం ఒక్కటిగా ట్రంప్‌ను ఎదుర్కోవాలని పేర్కొన్నారు. ఇక అమెరికా-కెనడాలు కీలక వ్యాపార భాగస్వాములు. అమెరికాలోని 36 రాష్ట్రాలకు అత్యధిక ఎగుమతుల కేంద్రంగా కెనడా నిలిచింది. నిత్యం 3.6 బిలియన్ డాలర్ల విలువైన వస్తుసేవలు సరిహద్దులు దాటి వెళుతుంటాయి. ఇప్పటికే కెనడా ప్రభుత్వం సరిహద్దు భద్రతకు బిలియన్ డాలర్లు వెచ్చించాలని నిర్ణయించింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ఈ మొత్తం వినియోగించనుంది. ట్రంప్ సోమవారం అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.



## కాల్పుల విరమణ ఒప్పందం వేళ..

# గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్

**జెరూసలేం, జనవరి 16:** పదిహేను నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలుకుతూ బుధవారం ఇజ్రాయెల్-హమాస్ ఓ అంగీకారానికి వచ్చినట్లు అధికారిక వర్గాలు వెల్లడించిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్ గాజాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. గాజా కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ గాజాపై పెద్దఎత్తున విరుచుకుపడింది. ఈ చర్యలతో స్థానికులు భయభ్రాంతులకు గురయినట్లు సివిల్ ఎమర్జెన్సీ సర్వీస్ వెల్లడించింది. దాడిలో పదుల సంఖ్యలో భవనాలు కుప్పకూలగా.. పలువురు గాయపడినట్లు పేర్కొంది.

అక్టోబరు 7, 2023న సరిహద్దులు దాటి ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించి 1200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చి, 250 మందిని బందీలుగా చేసుకోవడంద్వారా హమాస్ మధ్య ఆసియాలోయుద్ధానికి బీజంవేసింది. హమాస్‌కు మద్దతుగా హెజ్‌బొల్లా, హూతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడులకు దిగాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పరస్పర క్షిపణి దాడులకు పాల్పడ్డాయి. 46 వేల మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారు. ఈ యుద్ధాన్ని నివారించడానికి ప్రపంచ దేశాలు కృషిచేస్తున్నాయి. ఈనేపథ్యంలో కొన్ని నెలలుగా కాల్పుల విరమణ కోసం ఈజిప్టు, ఖతార్ ఇరు పక్షాలతో చర్చలు జరుపుతూ వచ్చాయి.

ఈ ఒప్పందానికి అమెరికా మొదటి నుంచి మద్దతుగా ఉంది. ప్రస్తుతం జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఖతార్ మధ్యవర్తిత్వం వహించింది. ఎట్టకేలకు కాల్పుల విరమణ ప్రతిపాదనకు అంగీకరించినట్లు హమాస్ తెలిపింది. అయితే ఒప్పందం తుది ముసా యిదాపై ఇంకా కసరత్తు జరుగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం పేర్కొంది. మరోవైపు తాజా ఒడంబడికకు నెతన్యాహు కేబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. కొద్ది రోజుల్లోనే ఈ లాంఛనం పూర్తి కావచ్చని భావిస్తున్నారు. ఈ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి వస్తుందని ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ అల్‌థానీ ప్రకటించారు.





# సమాధిని తవ్వి మృతదేహం వెలికితీత

## కేరళలో ఉద్రిక్తంగా మారిన స్వామి జీవసమాధి

**తిరువనంతపురం, జనవరి 16:** రాష్ట్రరాజధాని తిరువనంతపురంలో గోపన్‌స్వామి అనే వ్యక్తి జీవసమాధి అంశం వివాదాస్పదంగా మారింది. ఆ సమాధిని తవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేయడంతోపోలీసులు సమాధిని తవ్వి ఆయన మృతదేహాన్ని వెలికితీసారు. సమాధి వద్దకు ఉదయం ఏడు గంటల సమయంలో చేరుకున్నామని దానిని తవ్వడాన్ని కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించడంతో భారీ భద్రత నడుమ కాంక్రీటుతో నిర్మించిన గోపన్ స్వామి సమాధిని తవ్వామని పోలీసులు పేర్కొన్నారు. లోపల ఆయన మృతదేహం ధ్యాన స్థితిలో ఉందని, ఛాతివరకూ పూజాసామగ్రి నింపి ఉందని తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువనంతపురంలోని మెడికల్ కళాశాలకు తరలించినట్లు వెల్లడించారు. గోపన్‌స్వామి అలియాస్ మణ్యన్ జీవసమాధి అయ్యారని కొన్ని రోజుల క్రితం ఆయన కుటుంబీకులు పోస్టర్లు ప్రచురించారు. బంధువులు స్థానికులకు తెలియకుండా ఆతడిని నెయ్యటింకర లోని ఓ దేవాలయం సమీపంలో పూడ్చిపెట్టడంతో ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఎవరూ చూడకుండా తనను సమాధి చేయాలని గోపన్ చెప్పినట్లు ఆయన కుమారులు సనందన్; రాజేశన్ పేర్కొన్నారు.

ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో సబ్ కలెక్టర్ ఆల్ఫ్రెడ్ ఓవీ తన సిబ్బందితో వెళ్లి సమాధిని తవ్వాలని ఆదేశించారు. ఈ చర్యను గోపన్‌స్వామి భార్య కుమారులు అడ్డుకున్నారు. దీనితో అధికారులు న్యాయపరంగా ముందుకు వెళ్లారు. సమాధిని తవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో మరోసారి ఆప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనపై విచారణ జరిపిన హైకోర్టు సమాధిని తవ్వి తీరాల్సిందేనని ఆదేశించింది.

# నేనేమీ నవాజ్‌షరీఫ్‌ను కాదు!

## మాజీ ప్రధానిపై ఇమ్రాన్ సంచలన వ్యాఖ్యలు

**కరాచి, జనవరి 16:** సైన్యంతో ఒప్పందంచేసుకుని జైలునుంచి బయటకు వచ్చేందుకు తానేమీ నవాజ్‌షరీఫ్‌ను కాదని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. ఎటువంటి వ్యూహాలు పన్నినా సైన్యంతో అంగీకారానికి వచ్చే ప్రసక్తేలేదన్నారు. జైళ్లలో ఉన్న పిటిఐ పార్టీకార్యకర్తలపట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని సైన్యం, ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. పిటిఐ పార్టీకి సైనిక మద్దతుగల షెహబాజ్‌షరీఫ్ సర్కారుకు మధ్య సయోధ్య చర్చలుజరుగుతున్నవేళ ఆయన ఈమేరకు ట్వీట్‌చేసారు. పాకిస్థాన్‌లో రాజకీయ ఖైదీలపట్ల అమానవీయంగా ప్రవరిస్తున్నారు.

సైనిక కస్టడీలో ఉన్న మా పార్టీ కార్యకర్తలను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. నేను కూడా వేధింపులకు లోనయ్యానని మా పార్టీని అణిచివేసేనక్రమంలో మొత్తం వ్యవస్థనే ఉల్లంఘించారని ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలను ఆశ్రయించినా విచారణకు అనుమతించడంలేదన్నారు. అంతర్జాతీయ వేదికలపై గొంతు వినిపించడంతప్ప వేరే మార్గం లేకుండా పోయిందన్నారు.

# ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్

## అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి

### లీకేజీలు, తాగునీరు కలుషితం కాకుండా

### పకడ్బందీ చర్యలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో అన్ని విభాగాల శాఖధిపతులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, డైరెక్టర్ సృజన, టిజిఐఆర్‌డి డైరెక్టర్ నిఖిల, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీలు కృపాకర్ రెడ్డి, కనక రత్నం, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా పనుల పురోగతి, నూతన ప్రణాళికలు, పనితనంలో మెరుగుదలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అధికారుల మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, నిబద్ధతతో పనిచేసి శాఖ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. శాఖకు వన్నె తెచ్చేలా పనిచేయాలని, శాఖపరంగా వాస్తవాలనే నివేదించాలన్నారు. మా మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొదన్నారు. అధికారులు, అమాత్యులు వేరు వేరు కాదు, మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దన్నారు. ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దు అంటూ సూచించారు. మీ కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరపండి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధిశాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. రూ. 300 కోట్ల ఎన్ఆర్‌జిఎస్ బిల్లులను నిన్న విడుదల చేశామన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను విడుదల చేశామన్నారు. పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్‌లైన్‌లో పరిష్కరించే విధానాన్ని అవలంబించాలన్నారు.

ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. వేసవి సన్నద్ధతలో భాగంగా గ్రామస్థాయిలో అన్ని కనెక్షన్లను చెక్ చేయనున్న తెలిపారు. మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ సిబ్బంది లీ కేజీలు, తాగునీరూ కలుషితం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.

**అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారులకు పోషకాహారం అందాలి**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారులకు పోషకాహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గర్భిణీ, బాలింత, చిన్నారికి పోషకాహారం అందేవిధంగా జిల్లా సంక్షేమ అధికారులను ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అంగన్‌వాడి సేవలపై చిన్నారుల పేరెంట్స్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు.

ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. తల్లి దండ్రుల అభిప్రాయాల మేరకు అంగన్‌వాడి సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు. అంగన్‌వాడికి వచ్చే గర్భిణీలు కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారు, వారి ఇబ్బందులను తొలగించే విధంగా అంగన్‌వాడి కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేనట్టుగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో డ్రైవ్‌లో నిర్వహించి దివ్యాం గులకు పరికరాలను అందజేస్తామని తెలిపారు.



గురువారం కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని స్ఫూర్తిస్థల్‌లో ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

## పాలమూరు జిల్లాకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలి

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్ర, దేశ రాజకీయాల్లో మచ్చలేని వ్యక్తిగా ముందువరుసలో కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి నిలుస్తారని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో పివిమార్గ్ స్ఫూర్తిస్థల్‌లో అధికారికంగా నిర్వహించిన మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి 83వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని జైపాల్‌రెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యుడుగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులుగా అలాగే కేంద్రమంత్రిగా చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని అన్నారు. తెలంగాణ సాధనలో భాగంగా పార్లమెంట్‌లో ముఖ్యభూమిక పోషించారని తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు కేంద్రానికి వివరించడంలో సఫలీకృతుడయ్యారన్నారు. అదేవిధంగా జైపాల్‌రెడ్డి పాలమూరు జిల్లా వాసి కావడంతో పాలమూరు జిల్లాకు ఆయన పేరు పెట్టాలని కోరారు.

**గొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జైపాల్‌రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాకాలీన దేశ రాజకీయాల్లో మొదటగా నిలిచేగొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ మంచి విలువలు, నిజాయితీ గల గొప్ప రాజకీయ నాయకుడు మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి అన్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సహకారంలో జైపాల్‌రెడ్డి ముఖ్యపాత్రను ప్రజలు ఎన్నడికి మరిచిపోరన్నారు. నివాళులు అర్పించిన వారిలో ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డి, కుటుంబసభ్యులు, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, వేం నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కౌశిక్‌రెడ్డివి చిల్లర రాజకీయాలు

### గాంధీభవన్‌లో నివాళులర్పించిన మెట్టు సాయికుమార్

**హైదరాబాద్, జనవరి 16,ప్రభాతవార్త:** జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్ర పటానికి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్‌రావ్ తదితరులు పాల్గొన్నారు. స్వర్గీయ జైపాల్‌రెడ్డి ప్రాంతీయ విద్వేషాలు లేని జాతీయవాదిగా గుర్తింపు పొందారని సాయికుమార్ గుర్తుచేసుకున్నారు. హుందాగా రాజకీయాలు నిర్వ హిస్తూ జైపాల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రతి లీడరు ముందుకు పోవాలని ఆయన సూచించారు. జైపాల్‌రెడ్డి లేని లోటు తెలంగాణలో పూడ్చ లేమని అన్నారు. మెట్టు సాయికుమార్ హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ గల్లీలో టిక్ టాక్ చేసేవాళ్లు చిల్లర రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

## జెఎస్‌సిలోని సంఘాలకు ఇతర విధులు

### 8 సంఘాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులకు ఒడి ఇస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(జేఎస్‌సీ)లో ఉన్న సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2025 సంవత్సరానికి సంబంధించి ఆయా సంఘాలకి అదర్ డ్యూటీ(ఓడీ) అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా జీవో నంబర్ 55ను గురువారం జారీ చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్య సంఘాలుగా ఉన్న టీజీవో సెంట్రల్ అసోసియేషన్, టీఎన్‌జీవో సెంట్రల్ అసోసియేషన్, తెలంగాణ క్లాస్-4 ఎంప్లాయీస్ సెంట్రల్ అసోసియేషన్, టీఎస్ యూటీఎఫ్, ఎస్‌టీయూ టీఎస్, టీఆర్‌టీఎఫ్, పీఆర్‌టీయూ టీఎస్, తెలంగాణ రెవిన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) సంఘాలకు సంబంధించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 2025 సంవత్సరానికి సంబంధించిన ఓడీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. మరికొన్ని గుర్తింపు పొందిన సంఘాల ఓడీకి సంబంధించిన అంశాన్ని పెండింగ్‌లో పెట్టారు.

## నర్సింగ్‌లో పిహెచ్‌డికి మార్గదర్శకాల రూపకల్పన

### వాటిపై అభిప్రాయాల సేకరణ

### 20 రోజుల్లో చెప్పాలన్న ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** యూనివర్సిటీల్లో నర్సింగ్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను తీసుకురావడానికి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) చర్యలు ప్రారంభించింది. యూనివర్సిటీల్లో నర్సింగ్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్ చేయడానికి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో పీహెచ్‌డీకి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ రూపొందించిన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలు తెలపాలని కోరింది. ఇందుకు సంబంధించి 20 రోజుల్లో సాధారణ ప్రజలతోపాటు స్టేక్‌హోల్డర్లు మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను చెప్పాలని కోరింది.



## విద్యార్థులకు స్కిల్ స్ప్రింట్ పేరుతో ప్రత్యేక ఇంటర్న్‌షిప్

### ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు టి - వర్క్స్, స్కిల్ యూనివర్సిటీ సంయుక్తాధ్వర్యంలో స్కిల్ స్ప్రింట్ పేరిట ప్రత్యేక ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. తెలంగాణను నైపుణ్య మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చుతాం అన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. స్కిల్ స్ప్రింట్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం వ్యవధి 90 రోజులు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్, రోబోటిక్స్, మేనేజ్ మెంట్, సేల్స్, బిజినెస్ డెవలప్ మెంట్, మార్కెటింగ్ తదితర రంగాల్లో డిగ్రీ, పిజి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని, సంబంధిత పరిశ్రమల నిపుణులు మార్గనిర్దేశం(మెంటర్‌షిప్) చేస్తారన్నారు. టి-వర్క్స్ లోని అధునాతన సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవచ్చు అన్నారు. సొంతంగా ప్రాజెక్టులను రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తాం అన్నారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా అకాడమిక్ క్రెడిట్స్ ఇస్తాం అని తెలిపారు. ఆసక్తి గల కళాశాలలు, విద్యార్థులు టీ - వర్క్స్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## ఫిబ్రవరి 15 నుంచి ఆర్ఆర్‌బి, ఎస్ఎస్‌సి, బ్యాంకింగ్ పరీక్షలకు ఉచిత శిక్షణ

### 100 రోజులపాటు కొనసాగింపు

### బిసి స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్స్ త్వరలో జరగబోయే జాతీయస్థాయి పోటీ పరీక్షలకి ఉచితంగా శిక్షణను ఇవ్వనున్నారు. అందులో భాగంగా ఫిబ్రవరి 15 నుండి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస ఎస్‌సీ)తోపాటు బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ కోసం అన్నిబీసీ స్టడీ సర్కిల్స్‌లో 100 రోజుల పాటు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్టు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్స్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000.. పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000కి మించకూడదని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. రిజర్వేషన్ నియమం ప్రకారం ఎంపిక చేపట్టనున్నట్టు తెలిపారు. ఉచిత శిక్షణకు అర్హత గల అభ్యర్థులకు ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు డైరక్టర్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బీసీ స్టడీ సర్కిల్స్‌లో ఫిబ్రవరి 15 నుంచి ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం ఉచిత కోచింగ్ నిర్వహించ బడుతుందని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

## మూడు యూనివర్సిటీలకు పిహెచ్‌డి అడ్మిషన్లపై బ్యాన్

### ఐదేళ్లపాటు కొనసాగనున్న నిషేధం

### స్టాండింగ్ కమిటీ సిఫారసుల మేరకు యుజిసి నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** దేశంలోని మూడు విశ్వ విద్యాలయాలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సీరియస్ యాక్షన్ తీసుకుంది. మూడు యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లపై నిషేధం విధిస్తున్నట్టు యూజీసీ ప్రకటించింది. రాజస్థాన్‌లోని ఓపీజేఎస్ విశ్వవిద్యాలయం, రాజస్థాన్‌లోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయంతోపాటు రాజస్థాన్‌లోని సింఘానియా విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం నుండి 2029-30 వరకు రాబోయే ఐదు సంవత్సరాల పాటు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో విద్యార్థులను చేర్చుకోకుండా నిషేధం విధించింది. వివిధ యూనివర్సిటీలు చేపడుతున్న పీహెచ్‌డీ అడ్మిషన్లతోపాటు.. వారికి పీహెచ్‌డీ పట్టా జారీ ప్రక్రియపై అధ్యయనం చేయడం కోసం యూజీసీ స్టాండింగ్ కమిటీని నియమించింది. విశ్వవిద్యాలయాలు సమర్పించిన సమాచారాన్ని పరిశీలించిన యూజీసీ స్టాండింగ్ కమిటీ, పీహెచ్‌డీ డిగ్రీల ప్రదానం కోసం మూడు విశ్వవిద్యాలయాలు యూజీసీ పీహెచ్‌డీ నిబంధనలతోపాటు విద్యా సంబంధ నిబంధనలను పాటించలేదని కనుగొన్నది. యూజీసీకి సంబంధించిన పీహెచ్‌డీ నిబంధనలను పాటించడంలో ఎందుకు విఫలమయ్యాయో వివరణ ఇవ్వాలని మూడు విశ్వవిద్యాలయాలకు అవకాశం ఇచ్చారు. అయితే యూనిరవర్సిటీలు సమర్పించిన న వివరణలతో యూజీసీ సంతృప్తికరంగా లేకపోవడంతో.. రాబోయే ఐదు సంవత్సరాల పాటు మూడు యూనివర్సిటీలు పీహెచ్‌డీ విద్యార్థులను నమోదు చేసుకోకుండా నిషేధించాలని స్టాండింగ్ కమిటీ యూజీసీకి సిఫార్సు చేసింది. వాటితోపాటు మరికొన్ని యూనివర్సిటీల్లోని పీహెచ్‌డీ ప్రవేశాల తీరును పరిశీలించాలని యూజీసీ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

# పార్టీ సభ్యత్వం ప్రామాణికంగానే పదవుల పందేరం

### సంస్థ బలోపేతానికి కృషిచేసిన వారికి సముచిత స్థానం

### రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మహిళల మద్దతు కూడగట్టుకొని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఎవరైతే కృషిచేస్తారో వారికి సముచిత స్థానం లభిస్తుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. గురువారం గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే సభ్యత్వంలో ముందంజలో నిలిచిందని చెప్పారు. సభ్యత్వం అనే ప్రమాణాలను తీసుకొని ఎవరు ఎంత ఎక్కువ సభ్యులను పార్టీలోకి క్రియాశీలకంగా తీసు కొస్తారో అలాంటి వారికి వారి సభ్యత్వ నమోదు ఆధారంగా పదవులు ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలి పారు. జిల్లా ప్రెసిడెంట్ల పదవులకు పోటీ పడే మహిళా కాంగ్రెస్ కార్య కర్తలు 500పైన సభ్య త్వాలు చేర్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అదేవిధంగా స్టేట్ వైస్ ప్రెసిడెంట్లకు 500 సభ్యత్వం చేయించాలని లక్ష్యం విధించామని గుర్తు చేశారు. జనరల్ సెక్రెటరీలకు 300, సెక్రెటరీలకు 200 మండల, బ్లాక్ ప్రెసిడెంట్ పదవులకు 100 మెంబర్‌షిప్ చేయించి వారికి పదవులు ఇచ్చామని సునీతారావు అన్నారు. రాష్ట్రంలో 21 డిస్ట్రిక్ ప్రెసిడెంట్లను, స్టేట్ వైస్ ప్రెసిడెంట్లు 11, జనరల్ సెక్రెటరీ సెక్రెటరీలు 6, సెక్రటరీలు 20 మందితో సభ్యత్వాలను బట్టి ఆర్డర్ కాపీలు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు చేతుల మీదుగా ఇచ్చారు. రాబోయే పిసిసి, నామినేటెడ్ పద వులలో మహిళలకు ఎక్కువ స్థానాలు కేటా యించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని. పిసిసి అధ్య క్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసు కుపోతామని తెలిపారు. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడి పనిచేసిన మహిళలకు సముచితమైన స్థానం, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరు తామని తెలియజేశామన్నారు. ఏ పదవులు ఇవ్వా లంటే స్టేట్‌లో కాని జిల్లాలో గాని సభ్యత్వాన్ని బట్టి వారికి పదవులను ఇస్తారు. గురువారం జిల్లాల వారీగా సభ్యత్వాల నమోదును ఆధారంగా జిల్లా కమిటీ మెంబర్లకు ఆర్డర్ కాపీలు ఇచ్చామన్నారు. న్యారి న్యాయ్ సమ్మేళన్ గాంధీ భవన్‌లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో లంచ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జిల్లాకు కిట్స్ ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేయాలని సునీతారావు సూచించారు.



గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీరారావు

# రాష్ట్రంలో ఉన్నత విద్య బలోపేతానికి చర్యలు

### ఉన్నత విద్యారంగంలో సంస్కరణలు

### ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ప్రణాళిక

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్యాను బలోపేతం చేయడానికి ఉన్నత విద్యా మండలి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఉన్నత విద్యలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మార్కెట్ డిమాండ్‌లు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలను సవరించి.. వాటిని అమలు చేయడానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ నేతృత్వంలో కోర్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలకు సిద్ధంగా ఉండేలా మరియు ప్రయోగాత్మక నైపుణ్యాలను నేర్చుకునే విదంగా కొత్త సిలబస్‌ను రూపొందించబడుతుందని కోర్ కమిటీతెలిపింది. త్వరలో కొత్త సిలబస్ అమలు చేయడానికితెలంగాణ ఉన్నత విద్యా మండలి కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ప్రయోగాత్మకంగా నేర్చుకోవడం, పరిశ్రమకు సంబంధించిన జ్ఞానాన్ని నేర్చుకోవడంపై సిలబస్‌లో దృష్టి పెట్టారు. కీలక ఉపాధి సామర్థ్యాలను అభివృద్ధి చేయడం.. గ్లోబల్ పోటీతత్వాన్ని తట్టుకునే విధంగా పరిశ్రమ నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా సిలబస్‌ను రూపొందించారు. ఉన్నత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సంస్కరణలు తీసుకురానున్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు మరియు విధాన రూపకర్తలతో సహా వాటాదారుల నుండి సూచనలను ఉన్నత విద్యా మండలి ఆహ్వానిస్తోంది. ఇటీవల ఉన్నత విద్యా మండలి విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు మరియు ఉన్నత విద్యా నిర్వహణ, విధాన రూపకల్పన మరియు సంస్థాగత నిర్వహణలో యువ నిపుణులను ప్రోత్సహించాలని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తోంది. యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా, అకడమిక్ లెర్నింగ్ మరియు వాస్తవ ప్రపంచ సవాళ్ల మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఇంటర్న్‌షిప్‌ల కోసం పరిశోధన తయారు చేయబడింది.

# వరంగల్-హైదరాబాద్ హైవేపై ఘోరప్రమాదం



### లారీని ఢీ కొట్టిన కారు.. తల్లీకూతురు మృతి

### మరో ఐదుగురికి తీవ్రగాయాలు

**భువనగిరి రూరల్, జనవరి 16, ప్రభాతవార్త:** వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లా కేసముద్రం మండలం వెంకట్రామ్ తండాకు చెందిన భూక్య సంతోష్ సంక్రాంతి పండగ ముగించుకొని తన కుటుంబసభ్యులతోపాటు అక్క బావతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళుతుండగా భువనగిరి పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో గల పల్లెరుచులు హోటల్ సమీపంలో ముందుగా వెళుతున్న లారీని కారు వెనుక నుండి అతి వేగంగా ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న సంతోష్ భార్య అనూష(28) కూతురు చైత్ర(7) ఘటనాస్థలంలోనే మృతి చెందారు. సంతోష్‌తో పాటు మరో కూతురు ప్రాణస్వీని, బావ రవి, అక్క భవాని, కోడలు మోక్షలకు తీవ్ర గాయాలు కాగా స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న భువనగిరి సీఐ చంద్రబాబు, ఎస్‌హెచ్ఓ సంతోష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఎస్ఓ సంతోష్‌కుమార్ తెలిపారు.

# 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు

### ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

### మేడ్చల్ మున్సిపాలిటీలో రూ. 44 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

### పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జనవరి 16, ప్రభాతవార్త :** జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నుండి రాష్ట్రంలో రైతులకు ఎకరాకు రూ 6 వేల రైతు భరోసా, ఇళ్ల స్థలం ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాలను ప్రభుత్వం అమలుపరుస్తుందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో రూ.44 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 26 నుండి సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారెంటీలలో ఎకరాకు రూ 6 వేల రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు తదితర కార్యక్రమాలను అమలు చేయబోతున్నామనీ ఆయన అన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సాగుతున్నాయని మహేందర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మేడ్చల్‌లో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి స్థానిక నేతలతో కలిసి కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ వజ్రేష్ యాదవ్, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింహ్మ యాదవ్, బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మున్సిపల్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, శైలజా హరినాథ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నందారెడ్డి, సాయిపేట శ్రీనివాస్, రమణారెడ్డి, నర్సింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కౌడె మహేష్, చాప రాజు, దేవరాజ్, గణేష్, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రారంభించిన అభివృద్ధి పనులు**

మేడ్చల్ మున్సిపల్ పాలిటీలో రూ 44 కోట్ల అభివృద్ధి పనుల్లో రూ. 38 కోట్ల అమృత్ పథకం నిధులతో 5 మంచి నీటి ట్యాంకులు, రూ. 6 కోట్ల నిధులతో అంతర్గత సిసి రోడ్లు, యూజీడీలు, రూ. 25 లక్షల నిధులతో తుమ్మ చెరువు కట్టకు కంచె తదితర పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభో త్సవాలు చేశారు.



మేడ్చల్‌తో అభివృద్ధి పనులను ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

### హైదరాబాద్ విమానాశ్రయంలో ఫాస్ట్‌ట్రాక్ ఇమ్మిగ్రేషన్ ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్

**వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్రహోంమంత్రి అమిత్‌షా**

**శంషాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసిఐ) కార్డుదారుల కోసం భారత ప్రభుత్వ మార్గ దర్శక ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్‌ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్ ను ప్రారంభించినట్లు జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రకటించింది. ఎంతో ఉత్సాహం వేడుకల మధ్య, హోంమంత్రి అమిత్‌షా ట్రావెలర్ ప్రోగ్రామ్ లబ్ధిదారుల కోసం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ప్రత్యేక కౌంటర్లను వర్చువల్‌గా ఆవిష్కరించడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్ ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్ (ఎఫ్టిఐటిటిపి) అనేది భారత ప్రభుత్వం యొక్క దార్శనిక చొరవ, ఇది భారతీయ పౌరులు మరియు ఓసిఐ కార్డుదారులకు వేగవంతమైన, సులభమైన మరింత సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందించ డానికి రూపొందించబడిందని ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా అందరికీ ప్రయాణ సౌలభ్యం. సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం యొక్క నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేరేందుకు అర్హులైన వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. ఎఫ్టిఐటిటిపి కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఒక నెల వరకు పట్టవచ్చు. దరఖాస్తు సమయంలో తమ పాస్‌పోర్టుకు కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ ఉండేలా చూసుకోవాలి. ఈ కార్యక్రమంలో సభ్యత్వం పాస్ పోర్ట్ వాలిడిటీతో సహటెర్మినస్ గా ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియలో దరఖాస్తుదారులు తమ బయోమెట్రిక్స్ (వేలిముద్రలు ముఖ చిత్రం) తో పాటు దరఖాస్తు ఫారంలో పేర్కొన్న ఇతర అవసరమైన సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైన వెరిఫికేషన్లు, అర్హత నిర్ధారణ తర్వాత ఎఫ్టిఐటిటిపి కింద రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది అని తెలిపారు. పోషించడం గర్వంగా ఉంది. టెక్నాలజీ ఆధారిత ఈ చొరవ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను సులభతరం చేస్తుంది మరియు వేగవంతం చేస్తుంది, ప్రయాణాన్ని వేగవంతం చేస్తుంది.

**ఆర్‌జిఐఎ వద్ద ఎఫ్‌టిఐ టిటిఎఫ్ ఉపయోగించి ఇమ్మిగ్రేషన్/ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ**

బయలుదేరే సమయంలో, వీసా వెరిఫికేషన్ తరువాత బోర్డింగ్ పాస్ పొందడం కొరకు రిజిస్టర్డ్ ప్యాసింజర్ చెకిన్ కౌంటర్ ని సందర్శించాలి. బోర్డింగ్ పాస్ అందుకున్న తరువాత, ప్రయాణికుడు ఇమ్మిగ్రేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టిటిపి ఇగేట్ల వద్దకు వెళతాడు. మొదటి ఈగేట్ వద్ద ప్రయాణికుడు తమ పాస్‌పోర్ట్, బోర్డింగ్ పాస్ను స్కాన్ చేస్తారు. రెండింటినీ సరిచూసుకున్న మొదటి ఈగేట్ తర్వాతి ఈగేటుకు వెళ్లేందుకు వీలు కల్పిస్తుంది. తర్వాతి ఈగేట్ వద్ద ప్రయాణికుడి ముఖాన్ని స్కాన్ చేస్తారు. ధ్రువీకరిస్తే ఎమిగ్రేషన్ ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఇమ్మిగ్రేషన్ కౌంటర్ కు వచ్చే ప్రయాణికులకు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తారు.

## విశాఖ స్టీల్‌కు కేంద్రం భారీ ప్యాకేజి!

**రూ. 11,500 కోట్ల ఆర్థిక సాయానికి కేబినెట్ ఆమోదం**

**విశాఖపట్నం జనవరి 16 ప్రభాతవార్త:** విశాఖ పట్నం స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్యాకేజీ నిధుల రూపంలో కాకుండా, సాంకేతిక సహాయంగా అందించనుం దని తెలుస్తోంది. ప్రస్తుతం ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉన్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా రెండే పనిచేస్తున్నాయి. ఈ పరిస్థితిని మెరుగుపరచేందుకు, కొత్తగా మూడు ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్‌లు ఏర్పాటు చేయాలని కేంద్రం యోచి స్తోంది. ఒక్కో ఫర్నేస్ ఏర్పాటుకు సుమారు రూ.2,500 నుండి రూ.3,000 కోట్ల ఖర్చు ఉండబోతుందని అంచనా. మొత్తం రూ.7,500 కోట్ల వ్యయంతో ఈప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం, ఉత్పత్తి సామ ర్థ్యాన్ని పెంచి, అంతర్జాతీయ మార్కెట్లో నాణ్యమైన ఉక్కును ఎగుమతి చేయాలనే లక్ష్యం ఉంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యి, స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక సహాయం కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం శుక్రవారం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. అయితే, కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు ఈ ప్యాకేజీపై మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌కు ఇది కొత్త ఊపిరి ఇస్తుందనేవారి కంటే, దీని వల్ల ప్రైవేటీకరణకు మార్గం సుగమమవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు. ప్రధాని మోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా ఈ ప్యాకేజీపై స్పష్టత రానున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్లాంట్ భవిష్యత్తుపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. దీనిపై స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకుడు అయోధ్య రామ్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంటుకు ఆర్థిక సహకారం కాకుండా సేయిల్‌లో విలీనం చేయటం ఒకటే మార్గమని అన్నారు.

# ఉపగ్రహాల అనుసంధానం సక్సెస్

**శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్‌కు కేంద్రం ఆమోదం**

**రూ. 3,985 కోట్లతో నిర్మాణం**



**శ్రీహరికోట (తడ), జనవరి 16, ప్రభాతవార్త:** గగనతలంలో మరోసారి ఇస్రో గేమ్ ఛేంజర్ అయింది. ఒకేరోజు భారత జాతి మొత్తాన్ని ప్రపంచం తమ వైపు తిప్పుకునేలా చేసింది. గత నెల 30వ తేదీన శ్రీహరికోట నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి60 రాకెట్ రెండు ఉపగ్రహాలను రోదసిలోకి ప్రవేశపెట్టింది. వాటి అనుసంధాన ప్రక్రియ కొంత ఆలస్యమైనప్పటికీ గురువారం దిగ్విజయంగా ఆ ఘట్టాన్ని మన శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. మూడురోజుల ముందే ఇస్రో నూతన సారథిగా బాధ్యతలు చేపట్టిన నారాయణన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా ముగిసింది. బుధవారం 3,985 కోట్ల రూపాయలను శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర కేబి నెట్ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుతో భవిష్యత్‌లో అతి పెద్ద ఉపగ్రహాలను మానవ రాకెట్ల ద్వారా ప్రయోగించడానికి ఉపయోగం ఏర్పడుతుంది. ఇప్పటికే ఇక్కడ రెండు లాంచ్ ప్యాడ్లు ఉన్నాయి. భవిష్యత్ అవసరాల కోసం మూడవది ఏర్పాటు చేస్తున్నారు. సూళ్లూరుపేట, శ్రీహరికోటతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇప్పటి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని, భారీ ప్రాజెక్టులు వస్తాయని నమ్ముతున్నారు. శ్రీహరికోటలో ఇస్రో కోసం మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ లో రూ.3,985 కోట్ల పెట్టుబడితో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. అంతరిక్ష మౌలిక సదుపాయాల్లో దేశానికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. మొదటి, రెండో లాంచ్ ప్యాడ్లను పరిశీలిస్తే, ఈ రెండింటి కంటే ఇది చాలా ఎక్కువ సామర్థ్యాన్ని కలిగి ఉంది. కొత్త లాంచ్ ప్యాడ్ ఇస్రో నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్స్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీహరికోటలో ప్రయోగ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, రెండో లాంచ్ ప్యాడ్ కు బ్యాకప్ గా పనిచేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ కొత్త లాంచ్ ప్యాడ్ భవిష్యత్తులో భారత మానవ అంతరిక్ష యాత్రలకు ఇస్రో సామర్థ్యాన్ని పెంచుతుందని, నాలుగేళ్లలో ఇది పూర్తవుతుందని ప్రభుత్వ ప్రకటన తెలిపింది. మూడో లాంచ్ ప్యాడ్ కేవలం నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జిఎల్‌వి) మాత్రమే కాకుండా సెమీ క్రయోజెనిక్ స్టేజ్‌తో లాంచ్ వెహికల్ మార్క్ 3 (ఎల్‌విఎం3) వాహనాలకు, అలాగే ఎన్‌జిఎల్‌వి యొక్క స్కేల్అప్ కాన్ఫిగరేషన్లకు సపోర్ట్ చేసేలా డిజైన్ చేయబడుతుంది. ఈ ప్రాజెక్టులో విస్తృతమైన పరిశ్రమ భాగస్వామ్యం ఉంటుంది. మునుపటి లాంచ్ ప్యాడ్లను ఏర్పాటు చేయడంలో ఇస్రో అనుభవాన్ని ఉపయోగించడం, ఇప్పటికే ఉన్న లాంచ్ కాంప్లెక్స్ సౌకర్యాలను గరిష్ఠంగా ఉపయోగించడం కూడా ఇందులో భాగం. ఇస్రో స్పాడెక్స్ మిషన్ ఇస్రో తన స్పేస్ డాకింగ్ ఎక్స్ పెరిమెంట్ (స్పాడెక్స్)లో భాగంగా ఉపగ్రహాల డాకింగ్ ను విజయవంతంగా నిర్వహించింది. డాకింగ్ తరువాత రెండు ఉపగ్రహాలను నియంత్రించడం విజయవంతమైందని సంస్థ ధృవీకరించింది. అంతరిక్ష చరిత్రలో భారత్ పేరు మార్మోగిపోయింది. గుడ్ మార్నింగ్ ఇండియా ఇస్రో స్పాడెక్స్ మిషన్ చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఈ క్షణాన్ని చూసినందుకు గర్వంగా ఉంది అని ఎక్స్‌లో ఇస్రో తెలిపింది. దీంతో అమెరికా, రష్యా, చైనా తర్వాత శాటిలైట్ డాకింగ్ ను విజయవంతంగా నిర్వహించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. శాటిలైట్ డాకింగ్ తోపాటు పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమనౌకలను ఉపయోగించి స్పేస్ డాకింగ్ ను పూర్తి చేసింది. అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక ప్రదర్శన స్పాడెక్స్ మిషన్ అని ఇస్రో తెలిపింది. అంతరిక్షంలో భాగస్వామ్య లక్ష్యాలను సాధించడానికి బహుళ రాకెట్ ప్రయోగాలు అవసరమయ్యే మిషన్లకు డాకింగ్ టెక్నాలజీ కీలకం.

అంతకు ముందు జనవరి 12న ఇస్రో రెండు వ్యోమనౌకలను ఒకదానికొకటి మూడు మీటర్ల దూరంలోకి తీసుకువచ్చి సురక్షిత దూరానికి తరలించే ప్రయోగాన్ని నిర్వహించింది. ఇస్రో 2024 డిసెంబర్ 30న స్పాడెక్స్ మిషన్ను ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి 24 పేలోడ్లతో ఎస్డీఎక్స్01 (ఛేజర్), ఎస్డీఎక్స్ 02 (టార్గెట్) అనే రెండు చిన్న ఉపగ్రహాలను మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. నింగిలోకి దూసుకెళ్లిన 15 నిమిషాల తర్వాత 220 కిలోల బరువున్న రెండు వ్యోమనౌకలను ప్రణాళిక ప్రకారం 475 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టారు.

**ఇస్రో సరికొత్త రికార్డు**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో నూతన ఏడాది ప్రారంభంలోనే మరో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల నింగిలోకి పంపిన రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసింది ఇస్రో. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి అయినట్లు ఇస్రో ఈరోజు (గురువారం) ఎక్స్ వేదికగా వెల్లడించింది. గత డిసెంబర్ 30న షార్ నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సీ 60 పీఎస్ఎల్వీలో జంట ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపించింది.

ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ బయలుదేరిన 15 గంటల 9 నిమిషాలకు స్పేడెక్స్ 1బీ, 15 గంటల12 నిమిషాలకు స్పేడెక్స్ 1ఏ రాకెట్ నుంచి విడిపోయాయి. ఆ తరువాత వీటి డాకింగ్ కోసం మూడు సార్లు ప్రయత్నించగా పలు కారణాల వల్ల ఇది వాయిదా పడుతూ వచ్చింది. చివరకు గురువారం వీటి అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలోనే రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్ల నుంచి 3 మీటర్లకు తీసుకువచ్చారు. అక్కడ ఉపగ్రహాలను హోల్డ్ చేసి డాకింగ్‌ను మొదలుపెట్టారు. ఇది విజయవంతం అయినట్లు ఇస్రో తమ పోస్టులో తెలియజేసింది. దీని కోసం శ్రమించిన సాంకేతిక బృందానికి, యావత్ భారతీయులకు అభినందనలు తెలిపింది. ఇప్పటి వరకు చైనా, రష్యా, అమెరికా మాత్రమే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేస్తున్నాయి. ఈ ప్రయోగంతో ఈ తరహా సాంకేతికతలో భారత్ కూడా వాటి సరసన చేరింది. మొత్తానికి ఇస్రో మరో మైలురాయి చేరింది. రెండు ఉపగ్రహాలను సాంకేతికంగా అనుసంధానం చేసే వరుసలో భారత్ చేరింది. అంతరిక్షంలో స్పేడెక్స్ డాకింగ్ అనేది శాస్త్ర, సాంకేతికపరంగా చాలా క్లిష్టమని చెప్పుకోవచ్చు. కానీ ఇస్రో మాత్రం స్పేడెక్స్ డాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసి అంతరిక్షంలో రెండు శాటిలైట్స్‌ను దగ్గరకు చేర్చి మరోసారి ప్రపంచ దేశాలకు భారత్ సత్తా ఏంటో చూపించింది. చైనా, రష్యా, అమెరికా సరసన భారత్‌ను చేర్చడం గర్వకారణం. దాదాపు వందకిలోల మీటర్ల వేగాన్ని ఒక్కసారిగా 0.013 కిలోమీటర్ల వేగానికి తగ్గించి అనుసంధానం చేయాల్సి ఉంటుంది. 220 కేజీల బరువున్న ఒక్కో శాటిలైట్‌ను ఒక్కచోటకు చేర్చి కలిపారు. రెండు ఉపగ్రహాలను ఒకదగ్గరకు చేర్చడంలో ఇస్రో సక్సెస్ అవడంతో ఇస్రోలో సంబరాలు చేసుకుంటున్నారు. గగనంలో అద్భుత ప్రయోగం విజయవంతం కావడం, మరోపక్క కేంద్రం మూడవ లాంచ్ ప్యాడ్‌కు ఆమోదం తెలపడం ఇస్రో చరిత్రలో మరుపురాని ఘటనలుగా శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఢిల్లీలో అసలు లిక్కర్ పార్టనర్‌ను ఓడిస్తాం



**లిక్కర్ స్కామ్‌పై సిఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**ఢిల్లీ ఎన్నికలు.. కీలక హామీల పోస్టర్లు విడుదల చేసిన రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 16:** లిక్కర్ స్కామ్‌లో పార్టనర్‌ను తెలంగాణలో ఓడించామని, అసలు లిక్కర్ పార్టనర్‌ను ఢిల్లీలో ఓడిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ఉదయం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ ఎన్నికలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ కాంగ్రెస్ పిసిసి చీఫ్ దేవేంద్ర యాదవ్‌తో కలిసి ఎన్నికల హామీల పోస్టర్‌ను విడుదల చేశారు. రెండు ఎన్నికల హామీలను ఈ సందర్భంగా ప్రకటించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్‌తో పాటు, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఉచిత్ రేషన్ కిట్లు, ఏడాది పాటు నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.8500, మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఆర్థిక సాయం,రూ.25లక్షల వరకు ఉచిత ఆరోగ్య భీమా తదితరమైనవి ఎన్నికల హామీగా ప్రకటించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను నెరవేర్చామని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2లక్షల చొప్పున రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. అదే విధంగా పాలనలోకి వచ్చిన ఏడాదిలోపే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. దేశంలో ఉన్న నిరుద్యోగాన్ని కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చిందని. కానీ నెరవేర్చలేదన్నారు. కేంద్రంలో మోడీ మూడు సార్లు అధికారంలోకి వచ్చినా, ఢిల్లీలో కేజ్రీవాల్ మూడు సార్లు అధికారంలోకి వచ్చినా ఢిల్లీకి ప్రయోజనం జరగలేదన్నారు. ఢిల్లీలో మెట్రో రైలు తెచ్చింది కాంగ్రెసేనని పేర్కొన్నారు. వేరే రాష్ట్రాల నుంచి ప్రజలు ఢిల్లీకి రావాలంటే ఇక్కడి కాలుష్యానికి భయపడుతున్నారని, కానీ గతంలో కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇంత సమస్య లేదని సిఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. కావున ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఢిల్లీ ప్రజలను కోరారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు.

## ఇక పంట రుణాలకు పాస్‌బుక్ అక్కరలేదు

**భూభారతి గెజిట్ విడుదల**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** వ్యవసాయ పంట రుణాల నిమిత్తం ఇక నుండ పట్టాదార్ పాస్ పుస్తకాలను బ్యాంకులకు ఇవ్వనవసరం లేదు. భూ భరతిలోని రికార్డుల ప్రకారం బ్యాంకులు పం రుణాలను రైతుకు మంజూరు చేయనున్నాయి. తెలంగాణ భూ భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం2025 గెజిట్ విడుదలయింది. తెలంగాణ భూమి హక్కులు పట్టాదార్ పాస్‌పుస్తకం2020(ధరణి)ను సవరించి, ఇటీవలే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చిన విషయం విదితమే. భూభారతి బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో ఇది చట్టరూపం దాల్చగా తాజాగా ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. కొత్త చట్టం ప్రకారం పంట రుణాల కోసం బ్యాంకుల్లో పట్టాదార్ పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ సమర్పించాల్సిన అవసరం లేదు. ఎలక్ట్రానిక్ రికార్డులను పరిశీలించి, ఆ రికార్డుల్లో బ్యాంకులో పంట రుణం తీసుకున్నట్లు బ్యాంకర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ బ్యాంకర్లు రైతుల నుంచి పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకోనవసరం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు పంట రుణం చెల్లిస్తే, వెంటనే ఆ రికార్డులను నవీకరించాల్సి ఉంటుంది. వ్యవసాయేతర భూముల వివరాలతో పాటు అబాదీ భూముల కోసం ప్రత్యేకంగా పోర్టల్‌ను సిద్ధం చేయనున్నారు. అదే విధంగా ఇక రైతులు తీసుకున్న పంట రుణాలు కట్టకపోతే ఆ రుణం వసూలు కోసం జిల్లా కలెక్టర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. కొత్త చట్టం ప్రకారం రికార్డులను ఎలక్ట్రానిక్ రూపంలోనూ భద్రపరచనున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తారు.

## అంతర్రాష్ట్ర నదీజలాల వివాద చట్టానికి అనుగుణంగా ట్రిబ్యునల్‌లో వాదనలు

**ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సెక్షన్ 89 అనుసరణకు పట్టుబట్టిన ఎపి**

**కృష్ణాలో 70 శాతం నీటివాటా పొందడానికి వీలుగా తెలంగాణ ప్రభుత్వం కసరత్తు**

**ఫిబ్రవరి19 నుంచి 21వరకు మూడు రోజులపాటు కెడబ్ల్యుడిటి-2లో విచారణ**

**హైదరాబాద్, జనవరి 16,ప్రభాతవార్త:** అంతరాష్ట్ర నది జలాల వివాద చట్టం -1956 సెక్షన్ 3 ప్రకారం వాదనలు వినిపించడానికి కృష్ణా జల వివాదల ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. గురువారం తెలంగాణ -ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా నది జలాల పంపిణీ వివాదంపై విచారణ న్యూఢిల్లీలోని కెడబ్ల్యుడిటి-2లో చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్, సభ్యులు రాంమోహన్‌రెడ్డిలు, ఎస్ తాళపత్రలు నిర్వహించారు. తెలంగాణ తరుపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, మాజీ సిడబ్ల్యుసి చైర్మన్‌వోహ్రా, రవీంద్రరావులు వాదనలు వినిపించారు. నీళ్లు, నిధులు,నియమాకాలలో జరగుతున్న అన్యాయాలను పరిష్కరించు కోవడానికే ప్రత్యేక రాష్ట్రం ఇక్కడి ప్రజలుకోరుకున్నారని కృష్ణాబేసిన్ అవసరాలు తీర్చిన తరువాత, నదిపరివాహక ప్రాంతం అనుసరించి సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగానే నీటి పంపకం చేపట్టాలని ఏపి పునర్విభజన చట్టం సెక్షన్89 కేవలం తాత్కాలికంగా పంపిణీ కోసం ఉద్ధేశించినది మాత్రమే అని కెడబ్ల్యుడిటి-2 ముందు సరైన ఋజువులతో వినిపించారు. రిట్‌పిటిషన్ 1230/2023లో ప్రాజెక్టు వారిగా నీటి కేటాయింపులు గతంలో పంపిణీ జరిగిన రీతిలోనే చేపట్టాలని సూచించారు. కృష్ణానదిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టిఎంసిలు కేటాయించారు. ఎపిపునర్విభజనచట్టం 2014సెక్షన్89 ప్రకారం ప్రాజెక్టులవారిగా 512టిఎంసిలు ఆంధ్రప్రదేశ్ కేటాయిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం కృష్ణనది బేసిన్‌అవసరాలుతీర్చడం, నదిపరివాహక ప్రాంతాన్ని ప్రామాణికంగా తీసుకొని నీటిని కేటాయింపులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టులో వాజ్యం కూడా వేసింది. కేంద్రజలసంఘం కేసును వెనక్కి తీసుకొంటే పరిష్కారం చేస్తామని తెలుపడంతో అప్పటి పాలకులు కేసును కూడా ఉపసంహరించారు. ప్రస్తుతం తెలంగాణకు 299 టిఎంసిలు మాత్రమే కృష్ణానది నుంచి నీటి వాటా దక్కుతున్నది. జనవరి 19నుంచి 21 వరకు జరిగే వాదనలతో కెడబ్ల్యుడిటి -2 జస్టిస్‌లు ఏకీభవిస్తే 811 టిఎంసిలతో న్యాయమైన వాటాతోపాటు, అదనంగా 194టిఎంసిల నీటివాటా కలుపుకొని 1005 టిఎంసిలలో 70శాతం నీటి వాటా తెలంగాణకు దక్కే అవకాశాలు మెరుగవుతాయి.

ఆంధ్రప్రదేశ్ మాత్రం ప్రస్తుతం అస్థిత్వంలో ఉన్న ప్రాజెక్టులకు నీటి వసతి కల్పించాకే కొత్త ప్రాజెక్టులను పరిగణలోకి తీసుకోవాలని కోరుతోన్నది. ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డికి నీటి కేటాయింపులు లేవని అది అక్రమ ప్రాజెక్టు అంటూ ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపించారు.

10/2024ను డిస్‌పోజ్ చేశారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా కెడబ్ల్యుడిటి-2కు గురువారం అధికారులు,నీటిపారుదల సలహా బృందంతో వెళ్ళారు. ఉత్తమ్ వెంట అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఆధిత్యనాథ్‌దాస్,ఇ-ఇన్-సి విజయభాస్కర్‌రెడ్డి తదితరులతో కలిసి వెళ్ళి వాదనలతీరును పరిశీలించడమే కాకుండా వారి నైతికస్థైర్యం పెంపొందించేందుకు ప్రయత్నించారు.

## పసుపు రైతులకు రాయితీపై పనిముట్లు ఇవ్వాలి

**వ్యవసాయ శాఖకు రైతు సంక్షేమ కమిషన్ లేఖ**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** యాంత్రీకరణలో భాగంగా రాష్ట్రంలోని పసుపు రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయాలని రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖకు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఒక లేఖ రాశారు. ఈనెల 9వ తేదీన నిజామాబాద్ జిల్లాలో అధికారులతో కలిసి తమ కమిషన్ జరిపిన పర్యటన సందర్భంగా పసుపు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నామని తెలిపారు. పసుపు పంట సాగు పెట్టుబడి పెరుగుతుందని, అదే సమయంలో పసుపునకు న్యాయమైన ధరలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. యాంత్రీకరణ లేకపోవడంతో పండిన పసుపును భూమిలో నుంచి తీయడం, మొక్క నుండి పసుపు వేరు చేసిన తర్వాత పసుపు ఆరబోయడానికి పసుపు రైతులకు కలాలు లేవన్నారు. అంతేకాకుండా పసుపును బాయిల్ చేయడానికి సరైన యంత్రాలు లేక పాత పద్ధతుల్లోనే కట్టెలతో మంటపెట్టి పసుపును మరగబెడుతున్నారని, పసుపు పాలిష్ యంత్రాలు లేక తగినంత మోతాదులో పసుపు పాలిష్ పెట్టలేకపోతున్నారని చెప్పారు. పసుపు పంటలు దేశంలోనే పెద్ద మొత్తంలో సాగయ్యే నిజామాబాద్ జిల్లాలో పాత పద్ధతిలో వ్యవసాయం చేయడంతో కూలీల కొరతతో ఆధునాత యంత్రాలు లేక పెట్టుబడి పెట్ట లేక రైతులు నష్టపోతున్నారని వెల్లడించారు.

## సాగు యోగ్యతపై మొదలైన సర్వే

**25లోపు ప్రక్రియ పూర్తి**


**26 నుండి రైతు భరోసా అమలు షురూ**

**కలెక్టర్ల సారథ్యంలో ఫీల్డ్ వెరిఫికేషన్ బృందాలు**

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రైతు భరోసా పథకానికి సాగు యోగ్యత లేని భూముల గుర్తింపు కార్యక్రమం మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుండి జిల్లా కలెక్టర్ల సారధ్యంలో బృందాలు ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించాయి. ఈ సర్వే కార్యక్రమంలో ఈ నెల 25వ తేదీ కాల్లా పూర్తి చేయాల్సి ఉంటుంది. తదుపరి 26వ తేదీ నుండి రైతు భరోసా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించి, రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని విడుదల చేయనున్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలకు సంబంధించి జరుగుతున్న సర్వేలో భాగంగా గ్రామాల వారీగా సమాచారాన్ని సేకరించి గ్రామ సభల ద్వారా ప్రజలకు వివరించనున్నాయి. సాగు యోగ్యత లేని భూములను గుర్తించేందుకు ఫీల్డ్ వెరిఫికేషన్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నాయి. ఈ బృందంలో రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్ అధికారులు ఉండగా, వీరు సాగు చేయని భూములను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. పంచాయతీ కార్యదర్శి, ఏవోలు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫీల్డ్ వెరిఫికేషన్ బృందానికి లీడర్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ బృందంలో రెవెన్యూ విలేజ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆర్‌ఏ, ఏఈవోలు సభ్యులుగా ఉన్నారురు. జిల్లా కలెక్టర్ సారథ్యంలోని డీఏవోలు, ఎంపీడీవోలు తదితర ఉన్నతాధికారులు ఈ బృందాలను పర్యవేక్షిస్తున్నాయి. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నాన్ అగ్రికల్చర్ (వ్యవసాయేతర) భూములను గుర్తిస్తున్నాయి. సర్వే నెంబర్ల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. ఆర్వోఆర్, పట్టాదారు పాస్ పుస్తకాల జాబితాను పరిశీలిస్తున్నారు. భూ భారతి పోర్టల్ నుంచి జాబితా, విలేజ్ మ్యాప్, శాటిలైట్ మ్యాప్‌ల ఆధారంగా సరిచూడనున్నారు. అన్నింటిని బేరీజు వేసి వ్యవసాయ యోగ్యం కాని భూముల జాబితాను రూపొందించనున్నారు. అధికారులు రూపొందించే జాబితాలు తప్పనిసరిగా గ్రామ సభల ముందు పెట్టాల్సి ఉంటుంది. ఇందులో ఆయా భూముల వివరాలను ప్రదర్శిస్తారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే కూడా పరిశీలిస్తారు. ఈ మొత్తం వివరాల సేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రామ సభ ఆమోదముద్ర వేస్తుంది.

గ్రామాల వారీగా జాబితాలను గుర్తించి వ్యవసాయ యోగ్యంకాని భూముల పట్టికను ఫైనల్ చేస్తారు. ఈ భూములకు రైతు భరోసా నుండి పక్కనపెట్టనుంది. కాగా సాగు యోగ్యత లేని భూములకు రైతు భరోసా స్కీమ్‌లో సాయం అందించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని మార్గదర్శకాల్లో కూడా పేర్కొంది. సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా కింద ఎకరానికి 12 వేల రూపాయలు ఇస్తామని సర్కార్ ఇప్పటికే ప్రకటించింది. అందుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లో ఈ పథకం అందించబోమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. అయితే రైతు భరోసా పథకం పొందాలంటే భూమి సాగు ఉండాల్సి ఉంటుంది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి, సాగులో లేని భూములను రైతు భరోసా స్కీమ్ నుంచి పక్కన పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు భరోసా పథకం కింద సాగు చేసే ప్రతి భూములకు ప్రభుత్వం సాయం అందించనుంది. వ్యవసాయానికి యోగ్యం కాని భూములు, అంటే రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసు కున్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసా వర్తించదని స్పష్టం చేసింది.

## తొమ్మిదిమందితో బిజెపి నాలుగోజాబితా



**న్యూఢిల్లీ, జనవరి 16:** దేశరాజధాని అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భారతీయ జనతాపార్టీ నాలుగో జాబితాను విడుదల చేసింది. నాలుగో జాబితాలో తొమ్మిది మందిని ప్రకటించిన బిజెపి శిఖారాయ్‌ను బిజెపి అభ్యర్థిగా ఢిల్లీమంత్రి సౌరభ్‌భరద్వాజ్‌పై పోటీకి దించింది. ఇక అనిల్ వశిష్ట్ ఆప్ సీనియర్ నాయకుడు గోపాల్ రాయ్‌పై బాబర్‌పూర్ నియోజకవర్గంలో పోటీచేస్తున్నారు. కాంగ్రెస్, అధికారంలోని ఆప్ పార్టీలు ఇప్పటికే 70 సీట్లకు తమ అభ్యర్థులనుప్రకటించాయి. బిజెపి ఇప్పటివరకూ 68 మంది అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన రెండు సీట్లను తమ మిత్రులకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు సమాచారం. బిజెపి తొమ్మిది మంది అభ్యర్థుల్లో వజీర్‌పూర్‌నుంచి పూనమ్ శర్మ, ఢిల్లీ కంటోన్మెంట్‌నుంచి భువన్ తన్వార్, సంగం విహార్‌నుంచి చందన్‌కుమార్ చౌదరి, గ్రేటర్‌కైలాశ్‌నుంచి శిఖారాయ్, త్రిలోక్‌పురి ఎస్సీ సీటునుంచి రవికాంత్ ఉజ్జయిన్‌నుంచి షాహదారానుంచి సంజయ్‌గోయల్, బాబర్‌పూర్‌నుంచి అనిల్‌వశిష్ట్, గోకల్‌పూర్‌ఎస్సీ స్థానంనుంచి ప్రవీణ్ నిమేష్‌లు పోటీలో ఉన్నారు. గురువారమే కాంగ్రెస్‌పార్టీ కూడా తన చివరి జాబితానుప్రకటించింది.

# 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా సంతాన ప్రాప్తిరస్తు. ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. అల్లు శిరీష్ హీరోగా ఏబీసీడీ సినిమా, రాజ్ తరుణ్‌తో అహ నా పెళ్లంట అనే వెబ్ సిరీస్ రూపొందించిన దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాస్తున్నారు. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సంతాన ప్రాప్తిరస్తు సినిమా తెరకెక్కుతోంది. మకర సంక్రాంతి పర్వ దినం సందర్భంగా ప్రేక్షకులకు శుభాకాంక్షలు తెలియ జేస్తూ సంతాన ప్రాప్తిరస్తు సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో హీరో విక్రాంత్, హీరోయిన్ చాందినీ ఆకట్టుకుంటున్నారు. పోస్టర్‌లో ప్రెగ్నెన్సీ కిట్ ఉండటం ఆసక్తికరంగా ఉంది. ఒక కాంటెంపరరీ ఇష్యూను కథలో చూపిస్తూ వినోదాత్మకంగా సంతాన ప్రాప్తిరస్తు సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు సంజీవ్ రెడ్డి. ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నటీనటులు విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిషోర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్, జీవన్ కుమార్, తాగుబోతు రమేష్, రచ్చ రవి తదితరులు, టెక్నికల్ టీమ్: కాస్ట్యూమ్ డిజైనర్స్: అశ్వత్ భైరి, కె ప్రతిభ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: శివకుమార్ మచ్చ, సినిమాటోగ్రఫీ: మహి రెడ్డి పండుగుల మ్యూజిక్ డైరెక్టర్: సునీల్ కశ్యప్, డైలాగ్స్: కళ్యాణ్ రాఘవ్.



# 'ఆర్‌సి 16'లో రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా కలయికలో భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఉప్పెన వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు డైరెక్ట్ చేస్తోన్న సినిమా ఇది. ఆర్‌సి 16గా రూపొందుతోన్న ఈ సినిమా కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. ఆర్‌సి16లో రామ్‌చరణ్‌కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ డాల్ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కరుణడ చక్రవర్తి శివరాజ్‌కుమార్, విలక్షణ నటుడు జగపతి బాబు, మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింత పెంచుతూ జగపతిబాబు ఆసక్తికరమైన విషయాన్ని తెలియజేశారు. తన పాత్రకు సంబంధించి బిహైండ్ ది సీన్ వీడియోను ఆయన షేర్ చేశారు. అంకిత భావంతో తనకిచ్చిన పాత్రలో ఒదిగిపోయే నటుడిగా జగపతిబాబుకి పెట్టింది పేరు. జగపతి బాబు షేర్ చేసిన వీడియో ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ 'చాలా కాలం తర్వాత ఆర్‌సి 16కోసం బుచ్చిబాబు సానా చాలా మంచి పాత్రనిచ్చారు. ఈ సినిమాలో నా లుక్ చూసి నాకెంతో సంతృప్తి కలిగింది' అన్నారు. తాజాగా ఈ వెర్సటైల్ యాక్టర్ సినిమాలో తన లుక్ గురించి చేసిన వ్యాఖ్యలతో అందరిలో మరింత ఆసక్తి, అంచనాలు పెరిగాయి. జగపతిబాబు ఇప్పటి వరకు చూడనటువంటి సరికొత్త అవతార్‌లో మనకు కనిపించబోతున్నారు. ఆర్‌సి 16కు ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రత్నవేలు సినిమాటోగ్రఫీని, ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్ల వర్క్ చేస్తున్నారు. సరికొత్త కథ, కథనాలతో అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఇచ్చేలా ఆర్‌సి 16ను రూపొందిస్తున్నారు. సినిమా షూటింగ్, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని చిత్ర యూనిట్ ప్రకటించింది.



# 'ప్రొడక్షన్ నం.1'లో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్ర




ఆర్‌ఎక్స్ 100 మూవీతో తెలుగు యూత్ గుండెల్లో బాణాలు దింపింది పాయల్ రాజ్‌పుత్. పంజాబి నుంచి వచ్చిన ఈ ముద్దుగుమ్మ తొలి సినిమాతోనే ఇక్కడ రచ్చ రచ్చ చేసింది. అమ్మడు అందాల ఆరబోతతో స్క్రీన్ అంతా షేక్ అయిపోయింది. ఆ తర్వాత "మంగళవారం" మూవీ సూపర్ హిట్‌తో పాయల్ కు ఇండస్ట్రీలో స్పెషల్ క్రేజీ ఏర్పడింది. కుర్రాళ్లకు హాట్ ఫేవరెట్‌గా మారిపోయింది. ఈక్రమంలో మరో పాన్ ఇండియా మూవీతో వస్తోంది ఈ బ్యూటీ. ఈ సారి ఎవ్వరూ ఎక్స్‌పెక్ట్ చేయలేనంత ఫర్ఫామేన్స్‌తో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో సినిమా టికెట్ ఎంటర్టైన్‌మెంట్స్ అండ్ అర్జున్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రొడక్షన్ నం. 1 చిత్రం సిద్ధం కాబోతుంది. డైరెక్టర్ ముని కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అందిస్తున్న ఈ మూవీ జనవరి 24న హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్ పాత్ర చాలా ఎమోషనల్‌గా ఉండబోతోంది. ఈ మూవీ ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరు కానున్నారు. సినిమాకు సంబంధించిన పూర్తివివరాలు ప్రారంభం రోజు మూవీ మేకర్స్ ప్రకటిస్తారు.

# 'కిల్లర్' మూడో షెడ్యూల్ షూటింగ్

శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్ వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీలవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ కిల్లర్ అనే సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా పాత్రలో నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మరో ఇద్దరు హీరోలుగా విశాల్ రాజ్, గౌతమ్ యాక్ట్ చేస్తున్నారు. ఏయు అండ్‌ఐ మరియు మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్‌లో ఉంది. ఈ సినిమా మూడో షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో లీడ్ ఆర్టిస్టులంతా పాల్గొంటున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలను ఈ తాజా షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నారు. లవ్,రొమాన్స్, రివేంజ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, థ్రిల్లర్ అంశాలతో కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ సినిమాను రూపొందుతోంది. సరికొత్త సైఫై యాక్షన్ థ్రిల్లర్‌గా కిల్లర్ పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ సినిమా ప్రేక్షకులకు మెమొరబుల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుంది. నటీనటులు జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, విశాల్ రాజ్, గౌతమ్, తదితరులు. టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, వీఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్ మెర్జ్ ఎక్స్‌ఆర్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), బ్యానర్స్: థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్‌ఆర్, ఏయు అండ్ ఐ. నిర్మాతలు: పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి.







# 'బ్రహ్మ ఆనందం' టీజర్ లాంచ్ ఈవెంట్

మళ్లీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి సూపర్ డూపర్ హిట్ చిత్రాలతో 100శాతం సక్సెస్ రేటుని సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ ఈ ప్రొడక్షన్ నుంచి నుంచి రానున్న నాలుగో సినిమా 'బ్రహ్మ ఆనందం'. హాస్య బ్రహ్మ పద్మశ్రీ అవార్డ్ గ్రహీత బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్స్‌గా నటించారు. శ్రీమతి సావిత్రి, శ్రీ ఉమేష్ కుమార్ సమర్పకులుగా డెబ్యూ డైరెక్టర్ ఆర్.వి.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ మేరకు గురువారం నాడు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో.. 'పద్మశ్రీ' బ్రహ్మానందం మాట్లాడుతూ.. 'బ్రహ్మ ఆనందం చిత్రానికి నిర్మాత రాహుల్ మెయిన్ పిల్లర్. వరుసగా మూడు హిట్లు ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు. సెట్‌లో ప్రతీ పని దగ్గరుండి చేసుకుంటారు. నిఖిల్ వచ్చీ రావడంతోనే లెన్షన్ పడుతూ కాస్త తేడాగా కనిపించాడు. మీ కోసం, మీ పేరు మీదే సినిమా కథను రాసుకున్నాను అని, మీరు ఒప్పుకోకపోతే సినిమాను చేయను అని కాస్త తడబడుతూ చెప్పాడు. హీరో ఎవరు? అని అడిగా. రాజా గౌతమ్ అని చెప్పారు. ఆ తరువాత వెన్నెల కిషోర్ నుంచి ఫోన్ వచ్చింది. సరదాగా, నవ్వుతూ షూటింగ్ చేశాం. మితేష్ ఫోటోగ్రఫీ అద్భుతంగా ఉంటుంది. శాండిల్య మ్యూజిక్ ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. వెన్నెల కిషోర్ అద్భుతంగా నటించారు. సెట్‌లో యాక్టింగ్ చేసేటప్పుడే నాకు నవ్వొచ్చేది. ఈ చిత్రంలో అందరూ గొప్పగా నటించారు. నా లెగసీని కంటిన్యూ చేసే వారిలో కిషోర్ ఒకరు. దివిజ ఎంతో సహజంగా నటించింది. ఈ సినిమాకు ఓరూపం రావడానికే ఎన్నెన్నో ట్విస్టులు వచ్చాయి. వాటిపైనే ఓ సినిమా చేయొచ్చు. టీం అందరికీ ఆల్ ది బెస్ట్' అని అన్నారు. వెన్నెల కిషోర్ మాట్లాడుతూ, 'బ్రహ్మ ఆనందం వంటి మంచి చిత్రంలో మంచి పాత్రను నాకు ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. బ్రహ్మానందం అంటేనే కింగ్ ఆఫ్ కామెడీ. గాడ్‌ఆఫ్ కామెడీ. అన్నం ఉడికిందో లేదో ఒక్క మెతుకు చూస్తే చాలన్నట్టు.. ఈ మూవీ ఎలా ఉంటుందో చెప్పడానికి ఈ టైటిల్ చాలు. బ్రహ్మానందంతో షూటింగ్ అంటే.. ఎంతో సరదాగా ఉంటుంది అన్నారు. రాజా గౌతమ్ మాట్లాడుతూ, 'బ్రహ్మ ఆనందం టీజర్‌లోని లాస్ట్ షాట్ ఒక్కటి చూస్తే ఈ సినిమా నాకు ఎందుకు అంత స్పెషల్ అన్నది అందరికీ అర్థం అవుతుంది. మా నాన్నతో ఇలా ఈ సినిమాతో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్న, వెన్నెల కిషోర్‌తో చాలా కంఫర్టబుల్‌గా పని చేశాను. నేను ఈ పాత్రను చేయగలను అని నమ్మకంతో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్ అన్నారు. డైరెక్టర్ ఆర్వీఎస్ నిఖిల్ మాట్లాడుతూ, 'బ్రహ్మ ఆనందం కథను పట్టుకుని తిరుగుతున్న టైంలో రాహుల్ దొరకడం నా అదృష్టం. నా డైరెక్షన్ టీం ఎంతో సపోర్ట్‌గా నిలిచింది. హీరోయిన్లంతా కూడా చక్కగా నటించారు. వెన్నెల కిషోర్ ఈ చిత్రానికి బ్యాక్ బోన్‌లా నిలిచారు. హీరో రాజా గౌతమ్ అద్భుతంగా నటించారు అన్నారు. ప్రియా వడ్లమాని మాట్లాడుతూ, 'ఇంత మంచిచిత్రంలో నేను నటించినందుకు చాలా ఆనందంగా అనిపిస్తుంది. ఈ మూవీ డెస్టినీ వల్లే నాకు వచ్చింది. ఈ చిత్రం మీ అందరి ఆశీస్సులతో పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.





# ఫిబ్రవరి 26న 'రాక్షస' విడుదల

కన్నడ డైనమిక్ ప్రిన్స్ ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం రాక్షస. ఈ చిత్రాన్ని శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఒరిజినల్ వెర్షన్ కన్నడతో పాటు తెలుగులోనూ రిలీజ్ చేయనున్నారు. గతంలో శివరాజ్ కుమార్ నటించిన వేద చిత్రాన్ని విడుదల చేసిన ఎంవీఆర్ కృష్ణ రాక్షస ట్రైలర్ నచ్చి తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. కంచి కామాక్షికోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా హీరో ఫస్ట్ లుక్‌ను పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో ప్రజ్వల్ దేవరాజ్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. లోహిత్ హెచ్ దర్శకత్వం వహించిన ఈ టైమ్ లూప్ హారర్ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది.



ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్ కృష్ణ మాట్లాడుతూ, ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. సంక్రాంతి సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే టీజర్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేస్తాం. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. బాగా ఈ చిత్రానికి కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతుందని నమ్మకం ఉంది" అని చెప్పారు. ఈ చిత్రంలో అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్ కృష్ణ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: నోబిన్ పాల్, సినిమాటోగ్రఫీ: జైబిన్ పి జాకబ్. చిత్రం: రాక్షస నటీనటులు: డైనమిక్ ప్రిన్స్ ప్రజ్వల్ దేవరాజ్, అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్ కృష్ణ, జయంత్ తదితరులు. బ్యానర్: కంచి కామాక్షి కోల్‌కతా కాళి క్రియేషన్స్ నిర్మాత: ఎం వి ఆర్ కృష్ణ సినిమాటోగ్రఫీ: జైబిన్ పి జాకబ్, సంగీత దర్శకుడు: నోబిన్ పాల్ దర్శకుడు: లోహిత్ హెచ్, పీఆర్వో: హర్ష.

# 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' నుంచి మెలోడీ సాంగ్

దక్షిణాది సినీరంగంలోని ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటిగా ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ వరుసగా బ్లాక్ బస్టర్ చిత్రాలను నిర్మిస్తోంది. ఇక వీరి నిర్మాణంలో వచ్చిన 'లవ్ టుడే'తో దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా పరిచయం అయిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఈ హిట్ కాంబినేషన్ చేతులు కలిపి రూపొందిస్తోన్న చిత్రమే 'రైజ్ ఆఫ్ ది డ్రాగన్'. ఈ చిత్రానికి కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తోన్న ఈ మూవీని 'ఓరి దేవుడా' ఫేమ్ అశ్వత్ మారిముత్తు డైరెక్ట్ చేస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో 26వ సినిమాగా 'రైజ్ ఆఫ్ ది డ్రాగన్' రూపొందుతోంది. ఇంతకు ముందు రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమా అనౌన్స్‌మెంట్‌కు సంబంధించిన వీడియో, రీసెంట్‌గా రిలీజ్ చేసిన రైజ్ ఆఫ్ డ్రాగన్ అనే ఎనర్జిటిక్ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి ఓ మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. లియోన్ జేమ్స్ అందించిన బాణీ, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం, శరత్ సంతోష్, శ్రినిష జయసీలన్ గాత్రం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటను యూరోప్‌లో షూట్ చేసినట్టుగా లిరికల్ వీడియోని చూస్తే అర్థం అవుతోంది. ఇక ఈ పాట వినడానికే కాకుండా చూడటానికి కూడా ఎంతో ప్లెజెంట్‌గా కనిపిస్తోంది. ఈ ఎమోషనల్ మూవీకి అర్చనా కల్పాతి క్రియేట్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తుంటే ఐశ్వర్యా కల్పాతి అసోసియేట్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. లియోన్ జేమ్స్ సంగీతాన్ని అందిస్తున్నారు. నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ప్రదీప్ ఇ.రాఘవ్ ఎడిటర్‌గా, ఎస్.ఎం.వెంకట్ మాణిక్యం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో కె.ఎస్.రవికుమార్, మిస్కిన్, వి.జె.సిద్ధు, హర్షత్ ఖాన్, అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహర్, మరియం జార్జ్, ఇందుమతి మణికందన్, తేనప్పన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో మెప్పించనున్నారు.



# 'డియర్ కృష్ణ' ట్రైలర్ లాంచ్

పి.ఎన్.బి సినిమాస్ బ్యానర్‌పై రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ డియర్ కృష్ణ చిత్రం ట్రైలర్‌ను తాజాగా రైటర్ అండ్ డైరెక్టర్ విజయేంద్ర ప్రసాద్, హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌కు సర్వత్ర మంచి స్పందన వస్తుంది. పీఎన్ బలరామ్ రచయిత, నిర్మాతగా, దినేష్ బాబు డైలాగ్స్, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధం అయింది. అక్షయ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో ప్రేమలు చిత్రంతో తెలుగు వారి హృదయాన్ని కొల్లగొట్టిన బ్యూటీ మమిత బైజు కీలక పాత్రలో నటిస్తుండగా మరో బ్యూటీ ఐశ్వర్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, డియర్ కృష్ణ ట్రైలర్ చాలా బాగుందన్నారు. ట్రైలర్‌లో ప్రతి షాట్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తుందని అని పేర్కొన్నారు. ఈ సినిమాలో ప్రేమలు హీరోయిన్ మమతా బైజు హీరోయిన్‌గా నటించడంతో మంచి అంచనాలు ఏర్పడ్డాయి అన్నారు. ఈ సినిమా కచ్చితంగా ఘన విజయం సాధించాలని దర్శక నిర్మాతలకు శుభాకాంక్షలు తెలిపారు. సినీ నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ, డియర్ కృష్ణ ట్రైలర్ చాలా బాగుందని, వినూత్నమైన కథతో, వినూత్నమైన రీతిలో ప్రమోషన్స్ చేయడం నచ్చింది అని అన్నారు. రియల్ ఇన్సూరెన్స్ ఆధారంగా ఈ చిత్రాన్ని తలకెక్కించడం మెచ్చుకోదగ్గ విషయం అన్నారు. ఈ చిత్రం మలయాళం తెలుగులో ఒకేసారి విడుదల చేస్తున్నారని ఇలాంటి చిత్రాలు మరెన్నో చేయాలని చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు విశ్వ హిందూ పరిశత్ వాళ్లు కూడా ట్రైలర్ చూసి మేకర్స్‌ను కొనియాడరు. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయని, కచ్చితంగా డియర్ కృష్ణ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేస్తారని చెప్పారు. కథాకథనాలలో మాత్రమే కాకుండా, ప్రచార కార్యక్రమాల్లోనూ కొత్తదనాన్ని చూపిస్తోంది టీమ్. తాజాగా మరోక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. సినిమా టికెట్ బుకింగ్ చేస్తే అక్షరాల పదివేలు గెలుచుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో ఒక టికెట్‌ను ఎంపిక చేసి ఆ టికెట్ దారుడికి రూ. 10000 క్యాష్ బ్యాక్ కింద బహుమతిగా అందించనున్నట్ల చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ ప్రక్రియను వారం రోజుల పాటు కొనసాగించనున్నట్లు చెప్పారు. యధార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. శ్రీ కృష్ణుడికి, కృష్ణ భక్తుడికి మధ్య జరిగిన ఒక మిరాకిల్ సంఘటనను ప్రేరణగా తీసుకొని ఈ చిత్రాన్ని రూపొందించారు. నిర్మాణంతర పనులు పూర్తి చేసుకున్న డియర్ కృష్ణ జనవరి24న ప్రేక్షకుల ముందుకు వస్తుంది. సినిమా టికెట్లను బుక్ చేసుకొని మీ అదృష్టాన్ని పరీక్షించుకుంటారని మేకర్స్ అభిప్రాయపడుతున్నారు. చిత్రం: డియర్ కృష్ణ, నటీనటులు: అక్షయ్, మమిత బైజు, ఐశ్వర్య, రచయిత, నిర్మాత: పి.ఎన్. బలరామ్, డైలాగ్స్, స్క్రీన్ ప్లే, డైరెక్షన్: దినేష్ బాబు, సినిమాటోగ్రఫీ: దినేష్ బాబు ఎడిటర్: రాజీవ్ రామచంద్రన్, సంగీతం: హరి ప్రసాద్, లిరిక్స్: గిరిపట్ల, చీఫ్ అసోసియేట్ అండ్ అడిషనల్ డైలాగ్స్: నాగ నందేశ్వర్ గిడుతురి (నందు).



# ఆడపిల్లలకు ఆత్మస్థైర్యం నేర్పుతూ..



గీతిక తల్లి చనిపోయింది. నాన్న మద్యానికి బానిసయ్యాడు. మురికివాడలో నివాసం. ఆమె నిస్సహాయతను ఆసరాగా తీసుకుని పక్కింటి వ్యక్తి తనతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో చలాకీగా ఉండే గీతిక ముభావంగా ఉండటానికి కారణాలు తెలుసుకున్నారు ఆమె స్నేహితు రాళ్లు. ధైర్యం చేసి అతడి దుర్బుద్ధిని అందరికీ తెలిసేలా చేశారు.

ఈ అమ్మాయిలంతా ముంబయి, థానే పరిసర ప్రాంతాల మురికివాడల పిల్లలు. అయితేనేం, అన్యాయం జరిగితే ప్రశ్నిస్తారు. ఆడపిల్లల హక్కులకోసం అనర్గళంగా మాట్లాడతారు. తోటి ఆడపిల్లల ఆత్మాభిమానం దెబ్బ తింటే ఆడ పులులైపోతారు. ఇంత ధైర్యం వీరికెక్కడిది అంటారా?. ముంబయిలోని అంధేరీ ప్రాంతంలో ఉన్న "వచా" ట్రస్ట్ ఇచ్చిన భరోసా ఇది.1980లో మహిళల హక్కుల ఉద్యమంలో చురుకుగా ఉన్న కొందరు ఉద్యమకారిణులు కలిసి 'వచా'ను ఏర్పాటు చేశారు.

ఈ బృందానికి సోనాల్ శుక్లా నాయకత్వం వహించారు. 1990లో ఇది ట్రస్ట్ మారింది. అది మొదలు 3 దశాబ్దాలుగా బాలికల హక్కులకు గొంతుక విద్య, ఆరోగ్యం వంటి విషయాలపై పనిచేస్తోంది. నిజానికి ఇది మొదట ఓ గ్రంథాలయం. దీన్నే సాంస్కృతిక కేంద్రంగా, చర్చలు, ఉపన్యాసాలు నిర్వహించుకునే హాలుగానూ ఉపయోగించుకునేవారు. ఇప్పుడదే అనేకమంది మహిళలు, బాలికలకు పునరావాస కేంద్రంగా మారింది.

**సురక్షిత ప్రదేశాల ఏర్పాటుతో...** దోపిడీ, అణచివేత, వివక్షలేని సమాజం... ఏర్పాటు చేయాలనేదే మా లక్ష్యం. అవిద్య, ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడమే ఆడపిల్లల వెనుకబాటుకి కారణమని గుర్తించి వారికి చదువు చెప్పాలనుకుంది. ఇందుకోసం ధారావీతో పాటు మరికొన్ని బస్తీల్లో పనిచేయడం ఆరంభించారు. మహిళలు ఒకరికొకరు చేయూతనిచ్చుకునేందుకు నెట్వర్క్ను ఏర్పాటు చేసిందీ సంస్థ. ఓ పక్క స్త్రీ హక్కులకోసం పోరాడు తూనే, మరోపక్క వారికి జీవననైపుణ్యాలు నేర్పుతోంది. ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. ఎదిగే ఆడపిల్లల భవిష్యత్తుకి బంగారు బాటు వేసేందుకు చదువులు చెప్పిస్తోంది. ఈ క్రమంలోనే వారికి ఎన్నో సమస్యలు కనిపించాయి. ఇరుకు గదుల్లో లెక్కకు మించి నివసించడం, పోషకాహార లేమి, లైంగికహింస వంటి సమస్యలను తీర్చేందుకు తన వంతుగా పరిష్కారాలను వెతికింది. అంగన్వాడీలతో పనిచేయడంతోపాటు స్థానిక కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలను అద్దెకు తీసుకుని బస్తీల్లోని కొన్ని ప్రదేశాలను సేఫ్ హౌస్గా తీర్చిదిద్దింది. కష్టంలో ఉన్న ఏ మహిళైనా ఇక్కడికి నిర్భయంగా రాగలిగే పరిస్థితులను కల్పించింది. ముంబయి, థానేలతో సహా 18 రిసోర్స్ సెంటర్లు నిర్వహిస్తున్నారు మొబైల్ లైబ్రరీ ఏర్పాటు చేసి హిందీ.. ఇంగ్లిష్, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, తమిళ్, తెలుగు భాషల్లో 3380కి పైగా పిల్లల పుస్తకాలను అందుబాటులో ఉంచారు.

# మీరు సరైన నీళ్లే తాగుతున్నారా ?



**డీహైడ్రేషన్... పరిగా నీళ్లు తాగట్లేదు! చాలామంది మహిళల విషయంలో వినిపించే ఫిర్యాదే ఇది. కానీ రజతీ కాలిముత్తని 'మీరు సరైన నీళ్లు తాగలేదు' అన్నారు వైద్యులు. ఆ మాటే ఆశ్చర్యం కలిగించిందావిడకి. అదేంటో తెలుసుకుందామని పరిశోధన మొదలు పెట్టిన ఆమె. నీటి ఆంత్రప్రెన్యూర్ అయ్యారు..**

దీంతో ఆ కాస్మెటాలజిస్ట్లో చేతులు కలిపాను. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు సహా దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలన్నింటిలో శాఖలు ఏర్పాటు చేయబడ్డాయి. చర్మసంబంధిత అంశాల్లో సాయం చేస్తుంది. ఇదే కాదు నిరుపేద అమ్మాయిల చదువుకు సాయపడటం, ఉద్యోగాల కల్పన వంటివీ చేసేవారు. వీటన్నింటితో రజతీ తీరిక లేకుండా గడిపేవారు. కోరుకున్న పనిలో ఎంత తీరిక లేకుండా గడిపినా అది కష్టమనిపించదు. అందుకే అలుపే లేకుండా పనిచేసేవారు. కానీ తట్టుకోవడానికి శరీరమేమీ మెషీన్ కాదు కదా! మొరాయించింది. వైద్యుల సూచన మేరకు పరీక్షలు చేయించుకున్నారు. అప్పుడు 'మీ వయసు కంటే మీ బయలాజికల్ ఏజ్ రెండింతలు ఎక్కువగా ఉన్నాయి' అన్నారట వైద్యులు. అంతే కాదు, డీహైడ్రేషన్ ఎక్కువగా ఉందనీ చెప్పారట. మంచినీళ్లు సరిగ్గా తాగితే చాలనుకునేలోపే... సరిగ్గా కాదు, సరైన నీటిని తీసుకోవాలి అనడంతో షాకయ్యారు. నిపుణులతో మాట్లాడాక అసలు విషయం అర్థమైందామెకు. దీనితో నీటిపై ఆసక్తి కలిగి పరిశోధనలు చేయాలనుకున్నారు. దీనికి సంబంధించి కోర్సులేమైనా ఉన్నాయా అని జర్మనీలో పూర్తి చేశారు. 'వాటర్ సమలీయర్'గా మారారు.

**ఏమిటీ కెరియర్?** నీళ్ల రుచి అంటే ఏం చెబుతాం? మహా అయితే తీపి, ఉప్పు అంతే కదా! కానీ ఇంకా చాలా రుచులే ఉంటాయి. వాటిలో ఉన్న మినరల్ శాతం, అవి లభించే ప్రదేశం, కార్బోనేషన్... ఇలా చాలా వస్తువులను బట్టి అది మారుతుంటుంది. విదేశాల్లో ఏ వంటకానికి జోడీగా ఏ నీళ్లు సరి పోతా యో చెప్పడానికి ప్రత్యేక నిపుణులు ఉంటారు. వాళ్లనే వాటర్ సమలీయంగా పిలుస్తారు. అయితే నేను ఎంచుకున్న మార్గం వేరు. నీళ్లు లభించే ప్రదేశాన్ని బట్టి కూడా ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. ఎవరికి ఏవి మంచివో సూచించాలనుకున్నా అంటారు రజతీ. అందుకే హిమాలయాల్లో దొరికే నీటిని అందరికీ చేరువ చేయాలనుకున్నారు. 'రిథమ్' పేరుతో వాటిని మార్కెట్లోకి తీసుకొచ్చారు. దీనికోసం నాలుగేళ్లపాటు పరిశోధనలు జరిపారు. ఏడు దేశాల్లో 36 వేలకుపైగా కి.మీ.లు ఉన్నారు. పదుల నిపుణులను కలిశారు. బ్యాక్టీరియా వృద్ధి ఉండకూడదు. హైడ్రేషన్ని అంద జేయడంతోపాటు సహజ మినరల్స్ కలిగిన నీటిని తీసు కుంటే ఆరోగ్యం. ఇవి కృత్రిమ పద్ధతిలో దొరకవు. అందుకే సహజ ఫిల్టరేషన్ అయిన, కాల్షియం, పొటాషియం, సోడియం వంటి మినరల్స్ ఉన్న నీటిని అందరికీ అందుబాటులోకి తేవాలనుకున్నా. ఆ గుణాలన్నీ హిమాలయాల్లో ప్రవహించే గంగ నీటిలో కనిపించాయి. భూమిమీద మూడొంతులు నీళ్లే కానీ తాగగలిగినవి 1.2 శాతమే. సమలీయర్ అంటే నీటిని తాగి రుచిని చెప్పలేదు. నీళ్లు ఎక్కడినుంచి వస్తున్నాయి. వాటినెలా శుద్ధి చేసుకోవాలి, వనరులను ఎలా కాపాడుకోవాలి వంటివీ చెప్పాలి. అందుకే వీటిపైనా దృష్టి పెడుతున్నా అం టోన్న రాజతి మార్వెల్లే పేరుతో స్కిన్, హెల్త్కేర్ సంస్థనీ ఉన్నారు. కెరియర్, లక్ష్యా లంటూ పరుగెడతాం. వాటి మధ్య మన మనసునీ, శరీరాన్ని పట్టించుకోవాలి. వాటి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి. అప్పుడే మన విజయాలకీ విలువ. వాటినీ మనస్ఫూర్తిగానూ ఆస్వాదించగలం అన్న సలహా ఇస్తున్నారు దేశం.

# చర్మాన్ని మెరిపించుకోవడానికి..



**ముఖానికి ప్యాక్ వేసుకోవడం** మనకు అలవాటే అయితే వాటితో పాటు అప్పుడప్పుడూ ఫేస్ పీల్స్ కూడా మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. ఇంట్లో లభించే కొన్ని పదార్థాలను ఉపయోగించే పీల్స్తోనూ ముఖాన్ని మెరిపించుకోవచ్చంటున్నారు. ఆమెంటో తెలుసుకుందాం రండి.. అరకప్పు కీరాదోస గుజ్జు తీసుకుని అందులో గుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి, తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇందులో ఉన్న కీరాదోస. పిగ్మెంటేషన్ సమస్యను తగ్గించడంతో పాటు ముడతలు, గీతల్ని కూడా దూరం చేస్తుంది.



పైనాపిల్ బొప్పాయిఅరకప్పు పైనాపిల్ ముక్కలు, పావు కప్పు బొప్పాయి ముక్కలు తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. అందులో అరచెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్ వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ఓసారి, చల్లని నీటితో మరోసారి ముఖాన్ని శుభ్రం చేసుకుని పొడి వస్త్రంతో తుడుచు కోవాలి. ఇలా చేస్తుంటే ఫలితం ఉంటుంది. పాలల్లో కొద్దిగా ఓట్స్ వేసి ఉడికించాలి. తర్వాత ఇందులో కాస్త పెరుగు, తేనె వేసి బాగా కలపాలి. మిశ్రమం కాస్త చల్లబడిన తర్వాత బ్లాక్స్ ఉన్నచోట అప్లై చేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత మీ చర్మానికి నప్పే క్లెన్సర్తో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ పీల్ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉంటే బ్లాక్స్ సులభంగా తొలగి పోతాయి.




బాగా గిలక్కొట్టిన కోడిగుడ్డులోని తెల్లసొనలో మెత్తగా చేసుకున్న అరచెంచా అవకాడో గుజ్జు, రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్ అప్లై చేయాలి. 30 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ ముసుగు చర్మంలోని తేమను అధిక సమయం ఉంచేందుకు తోడ్పడుతుంది. ఫేస్ పీల్స్ వేసుకున్న తర్వాత ఎండలోకి వెళ్లే ముందు సన్ స్క్రీన్ లోషన్ తప్పనిసరిగా రాసుకోవాలి. లేదంటే ట్యాన్ ఏర్పడే ప్రమాదం ఉంటుందం టున్నారు నిపుణులు.

# చలిని తగ్గించేవి..



చలికాలంలో వెచ్చదనాన్ని పెంచే పరిష్కారాల కోసం ఎప్పటికప్పుడు కొత్తగా వెతుకుతుంటాం అలాంటి వారికోసమే ఇవి..

చలి పెరిగిపోయింది. ఎంత ముసుగు కప్పి పడుకున్నా... అటూ ఇటూ కదిలేసరికి దుప్పటి కాస్త పక్కకెళ్లిపోతుంది. ఒంట్లోకి చలి చేరి వణుకు పుట్టిస్తుంది. దీనికి తోడు నిద్రమత్తులో ఉన్న శ్రీవారు... మధ్యలో ఆ దుప్పటిని తన వైపునకు లాక్కొని కబ్జా చేస్తున్నారు. దీనితో అసలే అంతంత మాత్రంగా పట్టిన నిద్ర నుంచి మెలకువ వచ్చేస్తుంది. ఈ పరిస్థితి లేకుండా ఉండేందుకు చిన్నా, పెద్దా అందరికీ వేరబుల్ బ్లాంకెట్స్ వచ్చేశాయి. ఎంచక్కా దాన్ని డ్రెస్లో తొడుక్కుంటే చాలు హాయిగా నిద్ర పోవచ్చు. సోఫాలో కూర్చుని టీవీ చూస్తున్నా, కుర్చీలో కూర్చుని పని చేస్తున్నా కూడా ఇవి అనుకూలంగా ఉంటాయి. ఇదంతా విన్నాక వెంటనే ఒకటి కొని తెచ్చుకోవాలనిపిస్తోంది కదూ! ఈ సమయంలో వేడి నీళ్లతో స్నానం చేసినా, టవల్ చుట్టుకునే సరికి చలిగా అనిపిస్తుంది. దీనికి పరిష్కారంగా టవల్ వార్మర్ అక్కడకి వచ్చే సింది. లో కార్బ న్ స్టీల్తో వీటిని తయారు చేయడం వల్ల షాక్ కొట్టదు. అవసర మైనప్పుడు టవల్ని వార్మర్ పై వేసి, టెంప రేచర్ని ఎంపిక చేసుకుని ఆన్ చేసుకుంటే చాలు. స్నానం పూర్తయ్యే పుటికి అవి వెచ్చగా అయి పోతాయి. వీటిలో వాయిస్ కంట్రోల్, వైఫై సౌకర్యాలు అందుబాటు లో ఉన్నాయి.



# 'పాసివ్ అగ్రెసివ్' ప్రవర్తన ..

**వైవాహిక జీవితంలో గత పదేళ్లగా భర్తను సింధు అర్థం చేసుకోలేకపోతోంది. కోపాన్ని తనలో దాచుకుని మాటలతో వ్యంగ్యాన్ని ప్రద ర్శించే భర్తతో వేగలేక సతమత మవుతోంది. ఇలా పిండి ఎదుటి వారిపై కోపం ఉంటే దాన్ని చూపించకుండా మరో మార్గంలో ప్రదర్శించ డాన్నే... 'పాసివ్ అగ్రెసివ్' ప్రవర్తన అంటున్నారు నిపుణులు. ఇటువంటి వారితో ఎలా నడుచుకోవాలో చెబుతున్నారిలా...**

జీవితభాగస్వామిపట్ల కొన్నిసార్లు ఎదుటి వారికి కోపం, ప్రతికూలత వస్తుంటాయి. కానీ వాటిని పైకి వ్యక్తీకరించరు. అలాగని కోప్పడరు. తమకు నచ్చిన పరోక్ష విధానాన్ని ఎంచుకుంటారు. వ్యంగ్య సంభాషణ, అవతలి వారిని నిరక్ష్యంగా చూడటంతోపాటు తమ ఆలోచనలను పైకి చెప్పరు. పూర్తిగా నిశ్శబ్దాన్ని ఆశ్రయిస్తారు. పైగా తమకు నచ్చినట్లుగా ఎదుటివారు ఉండటం లేదనుకుంటూ లోలోపల వాళ్లపై ద్వేషాన్ని పెంచుకుంటారు. సందర్భం కోసం ఎదురుచూసి మరీ విమర్శిస్తారు. ఈ ' పాసివ్ అగ్రెసివ్ బిహేవియర్ దంపతుల్లో ఏ ఒక్కరికున్నా ఎదుటివారికి అది తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. సంసారంలో ఎప్పు డైనా ఏదైనా సమస్య వచ్చిన ప్పుడు ఈ ప్రవర్తన ఉన్నవాళ్లు పరిష్కారాన్ని ఆలోచించడానికి కూడా ముందుకురారు. అయితే సమస్య పెద్దదై నష్టం వస్తే మాత్రం ఎదుటి వారే కారణ మని విమర్శించ డానికి వెనకా డరు. పైగా ఈ బిహేవియర్ ఉన్నవాళ్లు సంతోషంగానూ ఉండలేరు. తమలో తాము ఒంటరి తనాన్ని అనుభవిస్తూ, తీవ్ర కుంగుబాటుకు లోనవుతారు. ఇవన్నీ దాంపత్య బంధాన్ని బీటలు వారేలా చేస్తాయి. ఇటువంటి వారిపట్ల ఎలా వ్యవహరించాలంటే, ముందుగా వారి ప్రవర్తనా విధానం, దాని వెనక ఉన్న కారణాలను తెలుసుకోవాలి. వారి చర్యల వెనక ఉన్న ఆలోచనలనూ అర్థం చేసుకోవాలి. ఆయా సమ యాల్లో ఆలస్యం చేయకుండా వాళ్ల ప్రవర్తన గురించి వాళ్లతోనే సున్నితంగా వివరించాలి. వాదన లేదా కోపం వ్యక్తం చేయడానికి భయపడు తున్నారేమో తెలుసుకోవాలి. ఏం కావాలను కుంటున్నారు, భాగ స్వామి ఎలా ఉండాలని కోరుకుంటారు వంటివాటితోవాళ్ల అవసరాలేంటో కూడా అడగాలి. అభిప్రాయ భేదాలెన్ని ఉన్నాయో చర్చించడానికి అవతలి వారిని సిద్ధం చేయాలి. దంపతులిద్దరూ తమ కోసం కొంత సమ యాన్ని కేటాయించుకోవడం, ఎదుటివారు చెప్పేది పూర్తిగా వినడం భాగస్వామిలో భరోసా నింపుతాయి. వాళ్ల మనసులో ఏముందో స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఈ రకమైన ప్రవర్తనను తగ్గించొచ్చు.



# ఆఫీస్‌లో ఫ్రెండ్లీగా, సంతోషంగా..



**మనలో చాలామందికి రోజులో సగం కంటే ఎక్కువ సమయం ఆఫీస్లోనే గడిచి పోతుంది. అలాంట ప్పుడు ప్రదేశాన్ని ఆనందంగా, ఆనందంగా మార్చుకుంటేనే ప్రశాంతంగా పనిచేసుకోగలుగుతాం.. పనిలో నాణ్యత, ఉత్పాదకతను అందించగలుగు తాం. ఆఫీస్లో సహోద్యోగులతో స్నేహం పెంచుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసు కుందాంరండి..**

✦ కొంతమంది మన పనేదో మనది.. ఇతరులతో అవసరం లేదన్నట్లుగా వ్యవహరిస్తారు. కానీ కొన్ని పనులకు ఇతరుల సహాయం అవసరం ఉన్నా, లేకపోయినా.. ఆ పనుల బృందంతో కలిసి చేయాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు సహోద్యోగులతో సులభంగాపోతేనే పనులు విజయవంతంగా పూర్తవుతాయి. కాబట్టి అందరితో కలిసిపోతూ మీకు సందేహం ఉన్న విషయాల్లో సహోద్యోగుల సలహాలు తీసుకోవడం మంచిది. వాళ్లతో చెలిమి పెరుగుతుంది. పనిలో అనుభవమూ గడిస్తారు.

✦ ఆఫీస్ పనుల్లో కొంతమంది ఉద్యోగులు చురుగ్గా ఉన్నారు. యాజ మాన్యం నిర్వహించే కొన్ని రకాల యాక్టివిటీల్లో మాత్రం పాల్గొనడానికి ఆసక్తి చూపారు. కానీ సహోద్యోగుల మధ్య స్నేహం పెరగాలంటే అవి ముఖ్యమే అంటున్నారు నిపుణులు. ఈ నెలకోసారి బృంద సభ్యులంతా కలిసి లంచ్/డిన్నార్కి వెళ్లడం, క్యాజువల్గా నిర్వహించే డిబేట్స్ లో పాల్గొనడం, ఆటలు వ్యాయామాల్లో పాల్గొనడం.. అక్కడ చేయాలి. అప్పుడే సహోద్యోగుల మధ్య కమ్యూనికేషన్ పెరిగి స్నేహ బంధం ఏర్పడుతుంది. ఆఫీస్లో వివిధ విభాగాలుంటాయి. కొన్నిసార్లు వాళ్లతోనూ కలిసి పని చేయాలి. కాబట్టి వాళ్ల ఈ కార్యక్రమాలను నిర్వహించడం వల్ల మీరు హాజరు కావడం, మీ బృందం ఏదైనా హాలిడే పార్టీ చేసుకున్నా వాళ్లను ఆహ్వానించడం.. నగరంలో చేస్తే ఆయా విభా గాలకు చెందిన ఉద్యో గులనూ స్నేహం పెంచుకోవచ్చు. !! ఆటలు, వినోదం, వంట చేయడం, పుస్త కపఠనం.. ఇలా ఇద్దరు వ్యక్తుల మధ్య ఏదో ఒక ఉమ్మడి ఆసక్తి ఉంటుంది. లేదంటే బృంద సభ్యుల్లో ఉన్న ఉమ్మడి ఆసక్తేంటో గుర్తించాలి. దీని గురించి పదే పదే సహోద్యోగులతో చర్చించడం, ఒకరి అభిప్రాయాలు మరొకరు పంచుకోవడం.. నిలదీస్తే వాళ్లతో బంధం మరింతగా బలపడుతుంది.

**చేసే పనిలో కావచ్చు..** లేదంటే వ్యక్తిగతంగా కావచ్చు.. కొంతమంది సహోద్యోగులు ఇబ్బంది పడడం గమనిస్తుంటాం. అలాంటప్పుడు చూసీ చూడనట్లుగా కాకుండా.. మీకు చేతనైనంత సహాయం చేయండి. వాళ్ల ఆ సమస్య నుంచి బయటపడే మార్గం చూపండి ఇలా మీరు చేసిన సహాయాన్ని వాళ్ళు తప్పకుండా గుర్తుపెట్టుకుంటారు. ఇద్దరి మధ్య స్నేహం పెరగడానికి ఇదీ ఓ మార్గమే!

✦ టీమ్తో కలిసి బయటికి డిన్నర్/లంచ్కి వెళ్లడమే కాకుండా.. మీరూ మీ ఇంట్లో అకేషనల్గా ఓ చిన్న పార్టీ ఏర్పాటుచేయచ్చు.. లేదంటే అందరూ కలిసి పాట్లక్ పార్టీ ప్లాన్ చేసుకోవచ్చు. దీనికి కాస్త వినోదాన్ని జోడిస్తే సహోద్యోగుల మధ్య దూరాలన్నీ తొలగిపోయి స్నేహం పెరుగుతుంది.



✦ ఇంట్లో ప్రత్యేక వంటకాలు, స్నాక్స్ ఆఫీస్కు తెచ్చుకుంటారు కొందరు. అయితే అందరి ముందు తినడానికి మొహమాటపడుతుంటారు. అదే వాటిని తలా కొంచెం సహోద్యోగులతో పంచుకుంటే ఇబ్బంది పడాల్సి న అవసరం ఉండదు.. అప్పుడు ఒక రకమైన ఆహ్లాద కరమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాగే దానివల్ల సహోద్యోగులతో స్నేహం కూడా పెరుగుతుంది.

✦ ఒకరు అందంగా తయారై ఆఫీసక్కు రావచ్చు.. మరొకరు ఫ్యాషనబుల్ డ్రస్ వేసుకొని రావచ్చు.. ఇంకొకరు పనిలో చక్కటి ప్రతిభ కనబర్చచ్చు.. ఇలాంటి వాళ్లను చూసి ఈర్ష్య పడ కుండా.. చక్కటి కాంప్లిమెంట్ ఇవ్వండి. వాళ్లూ హ్యాపీగా ఫీలవుతారు. మీతో సులభంగా కలిసి పోతారు. 1 కొన్ని సంస్థలు 'ఓపెన్ ఆఫీస్ వర్క్ స్పేస్ పద్ధతి'ని పాటిస్తుంటాయి. అంటే, హోదా లతో సంబంధం లేకుండా అందరూ కలిసి ఒకే చోట కూర్చొని పనిచేయడమన్న మా! దీనివల్ల కూడా ఉద్యోగుల మధ్య వాతావరణం పెరుగుతుందంటున్నారు నిపుణులు. అలాగే చేసే పనుల్లో వచ్చిన ఆలోచనల్ని అప్పటికప్పుడే పంచుకోవచ్చు. సందేహాల్ని వెంటనే నివృత్తి చేసుకోవచ్చు. ఇలాంటి స్నేహపూర్వక వాతావరణం మన చుట్టూ ఉంటే ప్రశాంతంగా పని చేసుకోగలుగుతాం. వచ్చే పనిలో నాణ్యత, ఉత్పాదకత పెరుగుతాయి. కెరీర్లోనూ ఉన్నత స్థానానికి చేరుకోగలుగుతాం.

# ఆచార, సంప్రదాయాలు

**సంక్రాంతి పండుగను** ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆచార, సంప్రదాయ రీతుల్లో జరుపుకొంటారు. తమిళనాడులోని శివగంగై జిల్లా సలుగైపురం గ్రామంలో మాత్రం కాస్త వైవిధ్యంగా చేసుకుంటారు. అక్కడ ఒక వర్గం ప్రజలు పచ్చైనాచ్చిచిటారి, పొన్నగి అమ్మవార్లను కులదైవాలుగా భావిస్తున్నారు. ఇక్కడి మహిళలు కనుమ రోజున మెట్టెలు, గాజులు... ఇలా ఏ ఆభరణాలు ధరించకుండా కేవలం తెల్లచీర కట్టుకొని, కుండలు తలపై పెట్టుకొని ఆ అమ్మవారి ఆలయాల ముందు పొంగళ్లు డతారు. దేవతల ముందు ధనిక, పేద తేడా లేదు, అందరూ సమానమే అని చాటడమే ఈ ఆచారం వెనక ఉద్దేశమట. అంతే కాదు, ఇక్కడ గుడి ముందు చెరకుతో ఊయల కట్టి అందులో నిమ్మ కాయలు పెట్టి మొక్కులు చెల్లిస్తారు. ఆ తర్వాత వాటిని అక్కడే వేలం వేస్తారు. ఆ కాయలు కొంటే అనుకున్న పనులు జరుగుతాయని ఇక్కడివారి నమ్మకం. దీనితో ఒక్కో నిమ్మకాయ సుమారు రూ. 40 వేలు, చెరకుగడ సుమారు రూ.16 వేలు పలుకుతాయట.అదేవిధంగా సేలం జిల్లా నత్తకరై గ్రామంలో 300ఏళ్ల పురాతన నల్లసేవన్ ఆలయంలో ఐదేళ్లకోసారి పొంగల్ పండుగ రోజున చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వివాహిత స్త్రీలు... వింత వేషంలో సూర్యోదయానికి ముందు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. ఆడపిల్లలతో కుమ్మీకూడి ఆడిస్తారు పుదుకోట్టై జిల్లా సెరియలూరు గ్రామంలో ఉన్న ఆడపిల్లలు... బతుకమ్మ తరహా 'కుమ్మీ' అనే జానపద నృత్యాన్ని ఆడతారు. రజస్వల కానీ ఆడపిల్లలు ముందుగా వ్రతం చేసి... సంక్రాంతి రోజున పొంగళ్లు వండి, వాటితో పాటు పువ్వులు, వేప, చెరకు, బెల్లం తదితర పదార్థాలను పెట్టిన వెదురు బుట్టను తలపై పెట్టుకొని ఊరేగింపుగావెళ్లి... సమీప ప్రాంతంలో ఉన్న రాకాచ్చి అమ్మవారి వద్ద పెట్టి కుమ్మీ ఆడతారు. ఆపై పొంగలి తప్ప మిగిలిన వస్తువులను గొయ్యి తీసి పూడ్చి పెడతారు.

ఆధ్యాత్మికం


# సేమియా బొబ్బట్లు



**కావలసినవి:** సేమియా, గోధుమపిండి కప్పుల చొప్పున, పంచదార, కొబ్బరి తురుము ముప్పావు కప్పు చొప్పున, నూనె రెండు స్పూన్లు, నెయ్యి తగినంత, ఉప్పు రుచికి సరిపడా, బాదం, జీడిపప్పు రెండు టేబుల్స్పూన్ల చొప్పున, యాలకుల పొడి అర చెంచా.

**తయారీ** ఒక గిన్నెలో గోధుమపిండి, తగినన్ని నీళ్లు, ఉప్పు, నూనె వేసి కలిపిన పిండి మెత్తగా అయ్యిందనుకున్నాక పక్కన పెట్టండి బాదం, జీడిపప్పులను గ్రైండ్ చేయండి కడాయిలో నెయ్యి వేడయ్యాక.. సేమియాను వేయించి.. లేతరంగులలోకి మారాక పళ్లెంలోకి తీయండి. అదే కడాయిలో రెండు కప్పుల నీళ్లను మరిగించి.. అందులో వేయించిన సేమియా, పంచదార వేసి దగ్గర వరకు ఉడికించండి. సెగ తగించి.. కొబ్బరి తురుము, బాదం, జీడిపప్పుల పొడి, యాలకుల పొడి వేసి కలియబెట్టి. నిమిషం తర్వాత సెగ తీసేయండి. సేమియా మిశ్రమం చల్లారాక.. చిన్న బాల్స్ చేయండి గోధుమపిండితో చపాతీ చేసి.. మధ్యలో సేమియా ముద్ద ఉంచి మరోసారి రోల్ చేయండి అన్నీ అయ్యాక.. నేతితో రెండు వైపులా కాల్చుకోండి. అంతే టెస్ట్ సేమియా బొబ్బట్లు తయారై పోతాయి. వీటి మీద కాస్త నెయ్యి రాసుకొని తింటే.. మరింత రుచిగా ఉంటాయి. పంచదార వద్దనుకుంటే బెల్లం వేయొచ్చు. ఒకసారి చేసి చూడండి.. మీకు తప్పకుండా నచ్చుతాయి.

# అరటితో బిపికి చెక్



ఆధునిక జీవనశైలి కారణంగా చాలామంది నడివయసుకు చేరుకునే సరికే అధిక రక్తపోటు (బీపీ) బారినపడుతున్నారు. అయితే, ఫ్రాంటియర్స్ న్యూట్రిషన్ అనే జర్నల్లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం అరటి, యాపిల్ పండ్లు తినేవారిలో ఏ కారణంతోనైనా మరణించే ముప్పు దాదాపు 40 శాతం తక్కువని తేలింది. వారంలో మూడు నుంచి ఆరుసార్లు అరటి, యాపిల్ తింటే మంచిదని ఈ అధ్యయనంలో వెల్లడైంది. అరటిపండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది కాబట్టి బీపీ నియంత్రణకు దోహదపడుతుండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. కానీ పియర్స్, ద్రాక్ష, పైనాపిల్ పండ్ల నుంచి మాత్రం ఇలాంటి ప్రయోజనాలు ఆశించలేమని పరిశోధకులు తెలిపారు.



## విజయ్ హజారే ట్రోఫీలో
# ఫైనల్‌కు కర్ణాటక

**ఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ 2024-25లో కర్ణాటక ఫైనల్‌కు చేరింది. తొలి సెమీ ఫైనల్లో ఆ జట్టు హర్యానాపై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హర్యానా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. హర్యానా ఇన్నింగ్స్‌లో ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. కెప్టెన్ అంకిత్ కుమార్ (48) టాప్ స్కోరర్‌గా నిలువగా, హిమాన్షు రాణా (44), అనుజ్ థక్రాల్ (23 నాటౌట్), రాహుల్ తెవాటియా (22), సుమిత్ కుమార్ (21), దినేశ్‌బనా(20), అమిత్‌రాణా(15 నాటౌట్), ఆర్ష్‌రంగా (10), నిషాంత్ సంధు (10) రెండంకెల స్కోర్లు చేశారు. కర్ణాటక బౌలర్లలో అభిలాష్ శెట్టి 4 వికెట్లు పడగొట్టగా, ప్రసిద్ధ్ కృష్ణ, శ్రేయస్ గోపాల్ తలో 2 వికెట్లు, హార్దిక్ రాజ్1వికెట్ దక్కించుకున్నారు. 238 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కర్ణాటక, 47.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. దేవదత్ పడిక్కల్ బ్యాటింగ్‌లోనూ సత్తా చాటాడు. పడిక్కల్ 113 బంతుల్లో 8 ఫోర్లు, సిక్సర్ సాయంతో 86 పరుగులు చేశాడు. పడిక్కల్‌కు జతగా స్మరణ్ రవిచంద్రన్ కూడా రాణించాడు. స్మరణ్ 94 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్ల సా యంతో 76 పరుగులు చేశాడు. కర్నాటక కెప్టెన్ మయాంక్ అగర్వాల్ ఈ మ్యాచ్‌లో డకౌటయ్యాడు. అనీశ్ 22, కృష్ణణ్ శ్రీజిత్ 3 పరుగులు చేసి ఔట్ కాగా, శ్రేయస్ గోపాల్ 23 నాటౌట్‌గా, అభినవ్ మనోహర్ 2 నాటౌట్‌గా కర్నాకటను విజయతీరాలకు చేర్చారు. హర్యానా బౌలర్లలో నిషాంత్ సంధు 2 వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కంబోజ్, అమిత్ రాణా, పార్త్ వట్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

# టీమిండియాకు ఏమైంది?

## స్టార్ల ఫ్లాప్ వెనుక కారణాలు
## హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్ ప్లేయర్ల మధ్య గ్యాప్
## భారత్ క్రికెట్ బోర్డు పోస్టుమార్టం

**ఢిల్లీ:** ఆటీమ్ ఇండియాకు అసలేమైంది? ఏరికోరి తెచ్చుకున్నోడే ఎసరు పెట్టేస్తున్నాడా? సమ్‌థింగ్ ఈజ్ గోయింగ్‌రాంగ్. టీం ఇండియాలో ఏదో జరుగుతోంది. ఆసీస్‌తో ఘోర పరాజయం కారణం పేలవమైన ఆట తీరునా? జట్టు రాజుకున్న జగడమా? వీటిపై ఇప్పుడు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)పోస్ట్‌మార్టమ్ చేపట్టింది. ఆస్ట్రేలియాలో ఘోర పరాజయానికి సెంచరీలు సరే టీమ్ స్పిరిట్ లోపంగా గుర్తించింది. స్టారాధిస్టార్ క్రికెటర్ల ఫ్లాప్ షోకు కారణాలేంటనేదానిపై లోతుగా అధ్యయనం జరుగుతోంది. బోర్డ్ గవాస్కర్ ట్రోఫీ ఆసీసు కైవసం చేసుకుంది. రికార్డుల రారాజులున్న టీమ్ ఇండియాకు ఇంత పేలవ పరిస్థితి ఎందుకని దాపురించిందనేదానిపై ఇప్పటికే సీరియస్‌గా ఉంది. అంతకు ముందు కివిస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లోనూ అదే టీమిండియా ఫెయిల్ తీరు. బౌండరీలు, సిక్సర్లు బాదుతూ సెంచరీలు కొట్టే హేమాహేమాలున్నా సరే సిరీస్ న్యూజీలాండ్ పరం కావడం, టీం ఇండియా పరాజయంలో ఎందుకు ఉందనేది ఇప్పుడు బీసీసీఐ ముందున్న పెద్ద ప్రశ్న. వీటన్నింటికి కారణం టీమిండియా హెడ్ కోచ్‌కు ప్లేయర్లకు మధ్య గ్యాప్ అనేది గుర్తించింది. రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ వైఖరితో పాటు, గంభీర్ మోనార్క్‌లా వ్యవహరించడం ఇలా భారత్ క్రికెట్ బోర్డు లోతుగా పరిశీలన చేస్తోంది. అంతేకాకుండా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌తో గంభీర్‌కు విభేదాలు తలెత్తినట్లు వెల్లడవుతోంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఓ ప్రాక్టీస్ సెషన్‌కు మోర్నీ మోర్కెల్ లేటుగా రావడం గంభీర్‌కు నచ్చలేదట. దీంతో మైదానంలోనే దక్షిణాఫ్రికా పాస్ట్ బౌలర్‌ను గంభీర్ మందలించాడట. గంభీర్ ప్రవర్తనతో మోర్నీ మనస్థాపం చెందాడని, ఈ క్రమంలో అతడు మిగిలిన సిరీస్‌లో టీమ్‌తో అట్టీ ముట్టనట్లుగా ఉన్నాడు. ఇక సీనియర్లు కొత్త వాళ్లతో కలిసిపోవడం లేదని, స్టార్ ప్లేయర్స్ తమకు ఫలనా హోటల్‌లోనే బస ఏర్పాటు చేయాలని పట్టుపట్టారని, కొందరు ఆటగాళ్ల గొంతెమ్మ డిమాండ్లు హెడ్ వెయిట్ వైఖరితో హెడ్ కోచ్ గంభీర్‌కు చిర్రెత్తిందనే వాదన ఉంది. డ్రెస్సింగ్ రూమ్‌లోకి ఫ్యామిలీ మెంబర్స్‌ను అనుమతించకపోవడం వల్లే సీనియర్లకు కోపం తెప్పించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి టీమ్‌ను ఇచ్చేదని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు, గంభీర్‌కు మధ్య అంతర్యుద్ధం రాజుకుందని ఇలా వివిధ అంశాలు, విమర్శలు, వారి పనితీరుపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం. టీమ్ ఇండియాలో సఖ్యత కొరవడటంతోనే ఆస్ట్రేలియా టూర్‌లో చెత్తగా ఆడారనేది బీసీసీఐ నిర్వహించిన రివ్యూలో బలంగా విశ్వాసం వ్యక్తమ ఐంది. దాంతో టీం ఇండియాలో స్పిరిట్ కొరవడిందనే లుకలుకలు ఉన్నాయనే క్లారిటీకి వచ్చింది. ఇదే సమయంలో కొందరు సీనియర్లు కావాలని తనకు సహకరించడంలేదని గంభీర్ బీసీసీఐ వద్ద వాపోయినట్టు తెలుస్తోంది. ఎట్ ది సేమ్ టైమ్ గంభీర్ వ్యవహార శైలిపై సీనియర్లు గుర్రుగా వున్నారట. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ-గంభీర్‌కు కొరకాని కొయ్యలుగా మారినట్లు, ఫలితంగా టీమ్‌ను నడిపించడంలో గంభీర్ ఆశించినంత సక్సెస్ కాలేదనేది తెరముందుకు వచ్చింది. ఇవన్నీ కాదన్నట్టు మరో రకమైన చర్చ రచ్చగా మారింది. ప్రతిభ వున్న సరే అంబటి రాయుడిలాంటి వాళ్లకు టీమ్‌లో చోటు దక్కకపోవడానికి కారణం కొందరు సీనియర్లు, వాళ్లకు వంతపాడే సెలక్టర్లే అనే విమర్శలు రావడంతో ఆ దిశగా కూడా అధ్యయనం చేస్తోంది.





## ఖో ఖో ప్రపంచ కప్‌లో..
# భారత్ మహిళల జట్టు విక్టరీ
## పురుషుల జట్టు హ్యాట్రిక్ విజయం

**ఢిల్లీ:** ఖోఖో ప్రపంచ కప్-2025 లో భారత మహిళల, పురుషుల జట్లు జైత్ర యాత్ర కొనసాగిస్తున్నాయి. న్యూఢిల్లీలో ఇరాన్‌పై భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో మరో విజయం సాధించింది. ప్రియాంక ఇంగ్లే నేతృత్వంలోని భారత జట్టు దక్షిణ కొరియాపై ఘన విజయంతో ప్రారంభించింది. తదుపరి భారత మహిళల జట్టు ఆధిపత్యం ఇరాన్‌పై కూడా కొనసాగింది. టాస్ గెలిచిన తర్వాత టర్న్ 1లో భారత్ అటాక్ చేయాలని నిర్ణయించుకుంది. భారత అటాకర్స్ అద్భుతంగా ఆడి 15 మంది ఇరానియన్ డిఫెండర్లను ఔట్ చేసి 48 పాయింట్లు సాధించారు. ఇరాన్ టర్న్ 2లో కేవలం 10 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. భారత్ డిఫెండింగ్‌తో ఇరానియన్ అటాకర్స్‌కు ఎలాంటి ఛాన్స్ ఇవ్వలేదు. టర్న్ 2 ముగిసే సమయానికి, భారత్ ఇరాన్‌పై 52-10 ఆధిక్యంలో ఉంది. మొదటి అర్ధభాగంలో 42 పాయింట్ల ఆధిక్యం సంపాదించింది. రెండో అర్ధభాగం ప్రారంభమైన టర్న్ 3లో, భారత్ మళ్లీ అటాక్‌కు దిగి ఇరానియన్ డిఫెండర్లను దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేసింది. భారత్ అదనంగా 44 పాయింట్లు సాధించి, టర్న్ 3 ముగిసే సమయానికి తమ ఆధిక్యాన్ని 92-10కి పెంచుకుంది. టర్న్ 4లో, ఇరాన్ తమ మొత్తం 16 పాయింట్లతో కేవలం ఆరు పాయింట్లు మాత్రమే జోడించగలిగింది. భారత మహిళల జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో 100 పాయింట్లు సాధించింది. అంతకు ముందు జరిగిన తొలి మ్యాచ్‌లో దక్షిణ కొరియాను 157 పాయింట్ల తేడాతో ఓడించింది. టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయంతో భారత మహిళల జట్టు గ్రూప్ ఎ లో ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇక భారత పరుషుల జట్టు గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. 9 పాయింట్లతో నాకౌట్ దశకు దాదాపుగా అర్హత సాధించింది. భారత్ పెరూపై వరుసగా మూడో విజయం సాధించింది. గ్రూప్ దశలో నేపాల్, బ్రెజిల్‌పై గెలిచింది. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లలో భారత్ అంచనాలకు తగ్గట్టుగా ఆటను కొనసాగిస్తోంది. పెరూతో జరిగిన గ్రూప్ ఎ మ్యాచ్‌లో ప్రతీక్ వైకర్ నాయకత్వంలోని భారత జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన భారత్ మొదటి టర్న్‌లో అటాకింగ్ ను ఎంచుకుంది. భారత అటాకర్స్ ఏడు నిమిషాలలో 15 పెరూ డిఫెండర్లను ఔట్ చేశారు. ఆ తర్వాత కూడా మొదటి టర్న్ ముగిసే సమయానికి భారత్ 36 పాయింట్లు సాధించింది. రెండో సగం ముగిసే సమయానికి భారత్ తన ఆధిక్యాన్ని 20 నుంచి 32 పాయింట్లకు పెంచుకుంది. వరుస విజయాలతో భారత్ గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## మహిళల టెన్నిస్ టోర్నీలో..
# భాటియా శుభారంభం





**ఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ 50 మహిళల టోర్నమెంట్లో ఒక్కరు మినహా మిగిలిన భారత క్రీడాకారిణులకు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లోనే ప్రత్యర్థుల చేతుల్లో ఓటమి పాలయ్యారు. సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి ఏడుగురు బరిలోకి దిగగా రియా భాటియా మినహా, మిగతా ఆరుగురు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక్య, అంకితా రైనా, కర్మన్ కౌర్, ఆకాంక్ష, వైదేహి, వైష్ణవి తొలి రౌండ్లోనే నిష్క్రమించారు. తొలి రౌండ్ మ్యాచ్లో హైదరాబాద్ ప్లేయర్ రష్మిక 1-6, 3-6తో రష్యాన్యకు చెందిన మరియా కొజిరెవా చేతిలో, అంకిత రైనా 1-6, 3-6తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన లౌరా సామ్సన్ చేతిలో, కర్మన్ కౌర్ 4-6, 1-6తో హంగేరికి చెందిన పన్నా ఉద్వార్డి చేతిలో, వైదేహి 4-6, 4-6తో రష్యాకు చెందిన తాతియానా ప్రొజోరోవా చేతిలో, వైష్ణవి 6-7 (3/7), 2-6తో స్లొవేనియాకు చెందిన దాలియా జకుపోవిచ్ చేతిలో, ఆకాంక్ష 0-6, 1-6తో చైనాకు చెందిన ఫ్రాన్గాన్ టియాన్ చేతిలో ఓటమి చవిచూశారు. రియా భాటియా 7-6 (7/3), 2-6, 7-5తో జపాన్‌కు చెందిన ఎరి షిమిజుపై విజయం సాధించింది.

## ఓపెన్ వరల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో
# సింధు, అనుపమ





**ఢిల్లీ:** ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, అనుపమ ఉపాధ్యాయ్‌లు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించి ముందంజలో కొనసాగుతున్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో మాజీ చాంపియన్ సింధు 21-12, 22-20తో చైనీస్ తైపీకి చెందిన షువో యున్ సుంగ్‌పై గెలిచింది. ఇక భారత్‌కే చెందిన అనుపమ ఉపాధ్యాయ్ ముందంజ వేయగా, మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్లోనే ఓటమిపాలయ్యారు. అనుపమ 21-17, 21-18తో భారత్‌కే చెందిన రక్షిత శ్రీ పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఇక మాళవిక బన్సోద్ 22-20, 16-21, 11-21తో చైనాకు చెందిన హాన్ యువె చేతిలో, ఆకర్షి కశ్యప్ 17-21, 13-21తో థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పవీ చోచువోంగ్ చేతిలో ఓటమి చవిచూశారు. కాగా పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా, కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 15-21, 10-21తో చైనీస్ తైపీకి చెందిన చున్ యి లిన్ చేతిలో, ప్రణయ్ 21-16, 18-21, 12-21తో చైనీస్ తైపీకి చెందిన లీ యాంగ్ సు చేతిలో, ప్రియాన్షు 16-21, 22-20, 13-21తో జపాన్‌కు చెందిన కొడాయ్ నరోకా చేతిలో పరాజయం పాలయ్యారు. కిరణ్ జార్జి 21-19, 14-21, 27-25తో జపాన్‌కు చెందిన యుషీ తనాకాపై గెలిచాడు. కాగా పురుషుల డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ జంట 23-21, 19-21, 21-16తో మలేషియాకు చెందిన వె చోంగ్ మాన్-కాయ్ వున్ తీ జోడీపై నెగ్గారు. అలాగే మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత్‌కు చెందిన ఐదో సీడ్ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-23, 19-21తో జపాన్‌కు చెందిన అరీసా ఇగారిషి-అయాకో సకురామోటో ద్వయం చేతిలో ఓటమిపాలైంది.


# 20% పెరగనున్న రైల్వే బడ్జెట్!

**న్యూఢిల్లీ, జనవరి 16:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఫిబ్రవరి 1న బడ్జెట్ (యూనియన్ బడ్జెట్ 2024) ప్రవేశపెట్టబడుతుంది. ఇప్పటికే బడ్జెట్‌లో ఏయే రంగాల్లో కేటాయింపులు పెరుగుతున్నాయి, సువేటికి ప్రోత్సాహకాలు లభించే అవకాశం ఉందనే విషయంపై చర్చలు మొదలయ్యాయి. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా రైల్వే అభివృద్ధికి సహకరించేలా బడ్జెట్ రూపకల్పన ఉండనుందని అంచనాలు ఉన్నాయి. భద్రత, రైళ్ల సామర్థ్యం పెంపుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, ఈసారి బడ్జెట్ భారతీయ రైల్వే కేటాయింపుల్లో పెంపు ఉండొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతీయ రైల్వేకు సంబంధించి రానున్న బడ్జెట్‌లో ప్రత్యేక ప్రకటనలు ఉండే అవకాశం ఉంది. మూలధన వ్యయం కేటాయింపులో 15 20 శాతం పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందించిన రూ.2,65 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్లకు పెరగొచ్చని తెలుస్తోంది. రైల్వే స్టేషన్‌లను ఆధునీకీకరించడం, రైళ్లను ప్రవేశపెట్టడం వంటి అంశాలను తీసుకోవచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వేకు కేటాయించిన రూ.2.65 లక్షల కోట్లలో రూ.2 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మిగిలిన మొత్తం ఖర్చు చేస్తాం అని రైల్వే అధికారి తెలిపినట్లు సమాచారం. కొత్త ట్రాక్‌ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న వాటిని అప్ చేయడం కోసం అధిక కేటాయింపులు జరుగుతాయి. లోకోమోటివులు, వ్యాగన్లు, కోచ్‌లతో పాటు ముంబయి-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని, దేశీయ ఆర్థికవృద్ధి 2024 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.4 పరిమితి కావొచ్చని అంచనాలు ఉన్నాయి.



# ఏడేళ్లలో 7 సంస్థలను టార్గెట్ చేసిన హిండెన్‌బర్గ్


**వాషింగ్టన్, జనవరి 16:** అమెరికాకు చెందిన పెట్టు బడి, రీసెర్చ్ సంస్థ హిండెన్ బర్గ్ ప్రస్తుతం క్లోజ్ చేయాలని నిర్ణయించబడింది. సంస్థ వ్యవస్థాపకుడు నాటె యాండర్సన్ దీనికి సంబంధించిన ప్రకటనను వెలువరించారు. ప్రస్తుతం తాము పనిచేస్తున్న ప్రాజెక్టులు ముగిసిన తరుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేవలం 10మంది ఉద్యోగులతో 2012లో స్థాపించబడిన ఈ సంస్థ అనేక కంపెనీలు అకౌంటింగ్ లోపాలు లేదా చేస్తున్న తప్పులను బయటపెట్టింది. ఈ క్రమంలో టార్గెట్ చేయబడిన అనేక కంపెనీల మార్కెట్ విలువను కరిగించేది. 1937లో జర్మనీకి చెందిన హిండెన్‌బర్గ్ ఎయిర్‌షిప్ న్యూజెర్సీలోకి ఎగురుతున్నప్పుడు మండిన హైప్రొఫైల్ ప్రమాదం పేరు మీద హిండెన్‌బర్గ్ అనే పేరు పెట్టారు. హిండెన్‌బర్గ్ కంపెనీ టార్గెట్ చేసిన 7పెద్ద కేసుల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.. ముందుగా 2023 జనవరి చివరిలో భారతీయ వ్యాపార దిగ్గజం అదానీ గ్రూప్ కంపెనీల వ్యాపారాలపై హిండెన్ బర్గ్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఇది అదానీ కంపెనీల మార్కెట్ విలువను వేల కోట్ల మేర కరిగించేసింది. అయితే తర్వాతికాలంలో పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపటంతో స్టాక్స్ తిరిగి నష్టాల నుంచి





పుంజుకోగలిగాయి. అలాగే భారతీయ స్టాక్ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ చీఫ్ మాదబీ పూరీబుచ్, ఆమె భర్త దవెల్ బుచ్ అదానీకి సహకరించారంటూ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 2020లో నికోలాకంపెనీ ఎలక్ట్రిక్ ట్రక్కుల తయారీలో తన వద్ద టెక్నాలజీ ఉందని పెట్టుబడిదారులను మోసం చేసినట్లు హిండెన్ బర్గ్ బయటపెట్టడంతో సఫలమైంది. కంపెనీ విడుదల చేసిన వీడియోలో అధిక వేగం సాధించి నట్లు చూపటాన్ని అబద్ధంగా రుజువు చేసింది. అలాగే 2023లో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఇకాన్ ఎంటర్‌ప్రైజెస్ ఆర్థికనివేదికలపై విమర్శించింది. కంపెనీ తన పెట్టుబడిదారులకు అతిగా అంచనా వేసి డివిడెండ్‌లను చెల్లించడానికి పోంజీ లాంటి నిర్మాణంపై ఆధారపడిందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. దీంతో కంపెనీ షేర్ల పతనం దాదాపు 3 బిలియన్ డాలర్ల మేర ఇకాన్ నికర విలువ తగ్గటానికి దారి తీసింది. 2023లో కంపెనీ బ్రాక్ ఇంక్ కంపెనీలో కలిగి ఉన్న షార్ట్ పొజిషన్లను బహిర్గతం చేసింది. ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సే నేతృత్వంలోని చెల్లింపుల సంస్థ తన వినియోగదారుల సంఖ్యను ఎక్కువగా చూపించిందని, కస్టమర్‌అక్విజిషన ఖర్చులను తక్కువగా చూపించిందని ఆరోపించింది. క్రెడిట్ కార్డ్ పరిశ్రమను కదిలించే లక్ష్యంతో 2009లో తన శాన్‌ఫ్రాన్సిస్కో అపార్ట్‌మెంట్‌లో బ్లాక్‌ను సహ స్థాపించిన డోర్సేకి ఈ చర్య ఒక సవాలుగా భావించబడింది. 2022లో హిండెన్‌బర్గ్ ట్విట్టర్ ఇంక్‌లో షార్ట్, లాంగ్ పొజిషన్లను కలిగి ఉంది.

# ఒక్క రోజులో వేల కోట్లు పోగొట్టుకున్న శివ్ నాడార్

**ముంబై, జనవరి 16:** భారత దేశంలో ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి చాలా మంది బిలియనీర్లు ప్రపంచపు అత్యంత సంపన్నుల లిస్టులో చోటు దక్కించుకున్నారు. అయితే శివ్ నాడార్ మాత్రం దాతృత్వానికి అతీతంగా నిలిచే వ్యాపారవేత్త. శివ్ నాడార్ హెచ్‌సిఎల్ టెక్ ఛైర్మన్. తాజాగా హెచ్‌సిఎల్ టెక్ కంపెనీ షేరు ధర పడిపోవడంతో శివ నాడార్ మొత్తం సంపద విలువ కూడా భారీగా క్షీణించింది. దీంతో 14 జనవరి మంగళవారం రోజున అతని సంపద విలువ రూ.46,485 కోట్లకు తగ్గింది. హెచ్‌సిఎల్ టెక్ షేరు ధర 9శాతం తగ్గడంతో శివ్ నాడార్ సంపద విలువ కూడా భారీగా క్షీ ణించింది. దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సిఎల్ టెక్ డిసెంబర్ 2024 త్రైమాసికఫలితాలను ప్రకటించిన తర్వాత షేర్లు పడిపోయాయి. షేర్‌మార్కెట్ ఆశించిన స్థాయిలో బిజినెస్ గ్రోత్ లేకపోవడమే ఇందుకు ప్రధానకారణం. బిఎస్ఇలో షేరు ధర 8.63శాతం తగ్గి రూ.1,813.95కి చేరుకుంది. నేషనల్ స్టాక్ఎక్స్ఛేంజీలో ఈ షేరు 8.51శాతం పడి పోయి రూ.1,819.95 వద్ద ముగిసింది. దీనితో బిఎస్ఇని అండ్ ఎన్ఎస్ఇలలో లిస్టెడ్ కంపెనీలలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ అతిపెద్ద క్షీ ణత నమోదు చేసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.4,92,245.28 కోట్లకు పడిపోయింది. హెచ్‌సిఎల్ మార్కెట్ క్యాప్ రూ.4,92,475 కోట్లకు పెరిగింది. ఇంత భారీ తగ్గుదల ఉన్నప్పటికీ ఫోర్బ్స్ నివేదిక ప్రకారం శివ నాడార్ రియల్ టైం మొత్తం సంపద విలువ 39.4 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 3,40,793 కోట్లు. 79 సంవత్సరాల వయస్సుగల శివ్ నాడార్ కేవలం టెక్ మాగ్నెట్ మాత్రమే కాదు, భారతదేశ అత్యంత ఉదారమైన పరోపకారి కూడా. నవంబర్‌లో విడుదల చేసిన నివేదికప్రకారం అతను 2024లో ప్రతి రోజు రూ.5.9కోట్లకు సమానమైన రూ.2,153 కోట్లను విరాళంగా ఇచ్చాడు. అతను భారతదేశ అత్యంత ఉదారమైన పరోప కారిగా గుర్తింపు పొందడం ఐదేళ్లలో ఇదిమూడోసారి. స్టాక్‌మార్కెట్ అస్థిరత ఫలితంగా హెచ్‌సిఎల్ టెక్ వాల్యుయేషన్‌లో తాత్కాలికంగా తగ్గుదల ఏర్పడినప్పటికీ, భారతదేశ ఐటి రంగానికి శివ్ నాడార్ చేసిన కృషి ఇంకా అతని దాతృత్వ సేవల కారణంగా అతనిని నిజమైన మార్గదర్శకుడిగా అలాగే భవిష్యత్ తరాలకు రోల్ మోడల్‌గా నిలిపింది.




# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, జనవరి 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో సానుకూలసంకేతాల మధ్య ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదే బాటలో పయనించాయి. ముఖ్యంగా పవర్, మెటల్ షేర్లలో కొనుగోళ్లతో సూచీలు రాణించాయి. చివరికి సెన్సెక్స్ 318 పాయింట్లు పెరిగి 77,042.82 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 98.60 పాయింట్లు లాభపడి 23,311.80 పాయింట్ల వద్ద నిలిచింది. అదానీ పోర్ట్స్, ఎస్‌బిఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, మారుతి సుజుకి, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటిసి, టిసిఎస్, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 81.86 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,735.40 డాలర్ల వద్ద కొనసాగింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.56 వద్ద స్థిరపడింది.

# సియట్, నెట్‌వర్క్18 లాభాలు డౌన్

**ముంబై, జనవరి 16:** టైర్ల తయారీ దిగ్గజం సియట్ (సీట్) లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(202425) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు వెల్లడయ్యాయి. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్‌డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 46 శాతంపైగా క్షీణించి రూ.97 కోట్లకు పరిమితమైంది. పెరిగిన ముడిసరుకుల వ్యయాలు లాభాలను దెబ్బతీశాయి. ఇదేకాలంలో రూ.181 కోట్లుపైగా ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.2,963కోట్ల నుంచిరూ.3,300 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ.2,739కోట్ల నుంచి రూ.3,176 కోట్లకు పెరిగాయి. ముడిసరుకుల వినియోగ వ్యయాలు రూ.1,695 కోట్ల నుంచి రూ.2,117 కోట్లకు ఎగశాయి. అన్ని విభాగాల్లోనూ పటిష్ట ఆర్డర్ బుక్‌ను కలిగి ఉంది కంపెనీ ఎండీ, సీఈవో అర్నాబ్ బెనర్జీ. స్థిరమైన డిమాండ్ కారణంగా ఆదాయంలో వృద్ధి కొనసాగే వీలున్నట్లు అంచనా వేయబడింది. ప్రయివేట్‌రంగ సంస్థ నెట్‌వర్క్18మీడియా ఇన్వెస్ట్మెంట్స్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో భారీ నష్టాలు చవిచూసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్‌లో రూ.1,400 కోట్లనష్టం ప్రకటించింది. అయితే అనుకోని పద్దులకు ముందు దాదాపు రూ.26కోట్ల నికర లాభం ఆర్జించినట్లు కంపెనీ కనుగొన్నట్లు. అనుబంధ సంస్థల గుర్తింపురాదు. 1,426 కోట్ల నష్టం నమోదైనట్లు. వీటిని ప్రొవిజనల్గా మదింపు చేసినట్లు తెలియజేసింది. స్టార్ ఇండియాతో అనుబంధ కంపెనీ వయాకామ్ 18విలీనం కారణంగా (2023-24) ఫలితాలను పోల్చదగినదని, కాగా మొత్తం ఆదాయం రూ.1,361 కోట్లకు చేరింది. స్టాండలోని ఆదాయం రూ.476 కోట్లను అధిగమించింది.



# వాణిజ్యం

## పాత పన్ను విధానం తొలగింపు?

**ముంబై, జనవరి 16:** కేంద్ర ప్రభుత్వం 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో పాత వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంపై కీలక నిర్ణయాలు తీసుకోనుందని సమాచారం. క్రమంగా ఈ పాత పన్ను తొలగించే ప్రకటనలు ప్రభుత్వం యోచిస్తోంది. కొత్త పన్ను విధానాన్ని ఆర్థిక పన్నుదారుల ఎంపికగా మార్చే లక్ష్యంతో మంత్రి నిర్మలా సీతారామన్ రోడ్ మ్యాప్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటివరకు పన్నుదారులు పాత, కొత్త విధానాల్లో ఏదైనా పెంచుకునే వీలుంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఇకపై వెసులుబాటు ఉండదని నిపుణులు చెబుతున్నారు. 2021 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన కొత్త పన్ను విధానం తక్కువ పన్ను రేట్లను అందిస్తుంది. కానీ పాత పన్ను విధానంలో ఉన్నన్ని మినహాయింపులు మాత్రం కొత్త విధానంలో లేవని కొందరు అభిప్రాయపడుతున్నారు.




ఈ విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన తక్కువ రేట్లకు పన్నుదారులు ఆకర్షితులయ్యారు. వీరిని మరింత ప్రోత్సహించడానికి కొత్త శ్లాబ్‌లను తీసుకురావాలని ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుత విధానంలో ఏడాదికి రూ.3 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంది. ఈ పరిమితిని రూ.4లక్షలకు పెంచే అవకాశంఉంది. మొదటి శ్లాబుగా ఉన్న రూ.3లక్షల నుంచి రూ.6 లక్షల పరిధిని రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షలకు సర్దుబాటు చేయవచ్చు. కొత్త విధానం చాలా మందికి అనుకూలంగా ఉంటుంది, ఇంటి అద్దె భత్యం, పెట్టుబడులు, గృహ రుణ వడ్డీ వంటి వివిధ మినహాయింపు లు, వాటి వల్ల కలిగే ప్రయోజనం పొందే అవకాశం పాత విధానంలో మెరుగ్గా ఉండేదనే వాదనలు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.